


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 67 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ ఆదివారం 18 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 67 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SUN 18 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పనులు చేస్తోంది

- 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి అనుమతి నిరాకరణ.. ప్రభుత్వంపై కేటీఆర్ ఆగ్రహం
- నగరం అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే నిరసన తెలిపే హక్కు లేదా అని నిలదీత
- అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల అస్తిత్వాన్ని దెబ్బ తీస్తే ఉపేక్షించేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'సేవ్ సికింద్రాబాద్' ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ,

- మిగతా 2లో...

## పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరుకు

# అన్యాయం జరిగింది

- పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ను ఏకిపారేసిన సీఎం రేవంత్ రెడ్డి
- మహబూబ్‌నగర్‌లో రూ.1284 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం
- కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయిందని ఎద్దేవా
- జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ
- తమ ప్రభుత్వం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన ఆయన, రూ.1,284 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదని ధ్వజమెత్తారు. దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా అందులో పాలమూరు బిడ్డల చెమట ఉంటుందని, కానీ ఈ జిల్లా మాత్రం వెనుకబడే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో కాంగ్రెస్ నేతలు సాధించుకున్న పాలమూ రు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లకు రూ.23 కోట్లు చెల్లించారని, ఉద్దండాపూర్ జలాశయం భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. సంగంబండ వద్ద బండను పగులగొట్టేందుకు కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పట్టించుకోలేదని మండిపడ్డారు. జిల్లా ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చ పెడితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభకు రాకుండా పారిపోయారని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయిం దని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లాలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం అందిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రానికి బీజేపీ ఎంపీలు ఐఐఎం తెస్తే, భూమి ఇచ్చే బాధ్యత తనదని సీఎం స్పష్టం చేశారు.




## బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమత ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న నరేంద్ర మోదీ
- కేంద్రం ఇస్తున్న నిధులను మమతా బెనర్జీ కొల్లగొడుతోందని విమర్శ

**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక పశ్చిమ బెంగాల్‌కు సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. బెంగాల్ పర్యటనలో భాగంగా మాల్దాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను మమతా బెనర్జీ ప్రభుత్వం కొల్లగొడుతోందని మోదీ ఆరోపించారు. తృణమూల్

- మిగతా 2లో...

## యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది



- ఈ గెలుపు ద్వారా తమను నిర్వీర్యం చేశామని బీజేపీ నేతలు భావిస్తున్నారన్న థాకరే
- బీజేపీ కుట్రలను త్వరలో బయటపెడతామని వ్యాఖ్య
- ముంబైలో శివసేన నుంచి మేయర్‌ను నియమించాలనేది తమ కల అన్న థాకరే

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ పార్టీ ముక్కలవడం ఖాయం

- మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ సిద్ధంగా ఉందన్న రాంచందర్ రావు
- ప్రజాల విశ్వాసాన్ని బీఆర్ఎస్ కోల్పోయిందని వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల రాజకీయాలకు పరిమితమయిందని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చూపిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు ఐదు వేల సర్పంచ్ స్థానాల్లో పోటీ చేశామని, గతంతో పోలిస్తే బీజేపీ గెలుపు సంఖ్య పెరిగిందని చెప్పారు. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలపడుతోందనేందుకు స్పష్టమైన నిదర్శనమన్నారు.బీఆర్ఎస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని... ఆ పార్టీ ముక్కలవడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై విమర్శలు గుప్పిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల రాజకీయాలకు పరిమితమైందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతోందని,

- మిగతా 2లో...



## లక్కీడ్రా ఇన్‌ఫ్లుయెన్సర్ల పట్ల జాగ్రత్త ఉండాలి

- ఇన్‌ఫ్లుయెన్సర్ల 'లక్కీ డ్రా' ప్రకటనలు.. హెచ్చరించిన సజ్జనార్
- బెట్టింగ్ యాప్‌ల దందా ఆగిపోవడంతో లక్కీ డ్రా అంటూ వేషాలు వేస్తున్నారని ఆగ్రహం
- చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించిన సజ్జనార్

**హైదరాబాద్ పెన్ పవర్:** సామాజిక మాధ్యమాల్లో లక్కీ డ్రా పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందించారు. "రీల్స్‌లో బిల్డప్...

- మిగతా 2లో...



## బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

- పెట్రోల్ పోయించుకుని డబ్బులు ఇవ్వకుండానే వెళ్లే ప్రయత్నం చేసిన నిందితుడు
- కారును ఆపే ప్రయత్నం చేసిన హిందూ ఉద్యోగి రిపోన్ సాహా
- కారుతో ఢీకొట్టి హత్య చేసిన బీఎన్‌పీ మాజీ నాయకుడు

- మిగతా 2లో...



## నేడు మేడారానికి సర్కారు!

### ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో తొలిసారి హైదరాబాద్ బయట కేబినెట్ భేటీ..

- 300 మంది అధికారులకు ఏర్పాట్లు
- భారీ భద్రత మధ్య హరిత హోటల్
- మేడారానికి సర్కారు!

- మిగతా 2లో.

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివారం (జనవరి 18) సర్కారు మేడారం వెళ్లనుంది. వనదేవతల సన్నిధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అక్కడే కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. సాయంత్రం 5 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఆయా శాఖల సెక్రటరీలు,




## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం..

### వంద మందికి పైగా సోకిన వైరస్

- గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ లోని స్కూలులో 103 మంది విద్యార్థులకు నోరో వైరస్
- అప్రమత్తమైన అధికారులు.. స్కూలు చుట్టుపక్కల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడి
- స్కూలు మొత్తం వైరస్ ను నాశనం చేసే మందులు స్ప్రే చేసిన అధికారులు

2లో...

## ఎడిటర్ వ్యూ

# ఓటరును శక్తిమంతం చేస్తున్న ఎడిఆర్

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఏడున్నర దశాబ్దాలు గడిచాయి. పాతతరం నేతలు దాదాపుగా కనుమరుగైపోయారు. కేవలం వారి జీవిత గాథలు, వారు పాటించిన విలువలు మనకు జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలాయి. కొత్త తరం నేతలు తమ పూర్వీకుల వాసన లేకుండా, విలువల జోలికి పోకుండా రాబోయే తరాల కోసం సంపాదించుకుంటూ రాజకీయాలను జాగ్రత్తగా తమకు అనుకూలంగా నడుపుకొస్తున్నారు. 1990కి పూర్వం రాజకీయాలు ఒక తీరున నడిస్తే తర్వాత కాలంలో మద్యం వ్యాపారులు, కాంట్రాక్టర్లు, భూ ఇసుక మాఫియా నేతలు, నేరచరిత్ర గలవాళ్లే ప్రజాప్రతినిధులుగా ఎక్కువమంది ఎన్నికవుతూ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. ఎడిఆర్ అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫారమ్స్ అనే సంస్థ గత 25 ఏళ్లుగా రాజకీయ నాయకులపై, రాజకీయ పార్టీలపై రకరకాల కోణాల్లో సర్వే చేస్తూ నివేదికలు విడుదల చేస్తున్నది. గత పదేళ్లలో అంటే 2014 నుండి 2024 వరకు జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన ఎన్నికైన అభ్యర్థుల ఆదాయం, రాజకీయ పార్టీల ఆదాయం, ఎన్నికలలో జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఏ విధంగా ఖర్చు చేశాయి, కేసులు ఎదుర్కొంటున్న పురుష మహిళా ప్రతినిధులు, ఎన్నికైన వారి విద్యార్హతలు ఈ రకంగా నేతల పార్టీల బాగోతాన్ని బహిర్గతం చేసింది.

భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా నలుగురు దిగ్గజాలు చేపట్టిన అధ్యయనం దేశంలో సగటు పౌరుడిని ఆలోచింపజేస్తున్నది. ప్రజాస్వామ్యానికి పౌరుడే యజమాని అనేది ఈ సంస్థ విశ్వాసం, నినాదం. 2004 మొదలుకొని 2025 వరకు జరిగిన వివిధ ఎన్నికలలో రాజకీయ పార్టీలు, నేతలకు సంబంధించిన వివరాలన్నింటినీ బహిర్గత పరుచుతున్న ఎడిఆర్ ఇటీవల 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారం మొత్తాన్ని తన నివేదికలో వెల్లడించింది. 2024లో ఎన్నికైన 102 మంది లోక్‌సభ సభ్యులు, ఇంకా ఈ మధ్య ఎన్నికలలో గెలిచిన 400 మంది ఎంఎల్ఎల పైన సంస్థ తన శాంపిల్ సర్వే నిర్వహించింది. ఈ ప్రజాప్రతినిధులు తమ ఎన్నికల ఇచ్చిన సమాచారాన్ని ఉపయోగించుకుని దాన్ని క్రోడీకరించి సగటు పౌరుడికి తెలవని, తేలికగా తెలుసుకోలేని సమాచారాన్ని ఈ నివేదికలో పొందుపరిచింది. ముఖ్యంగా వారి ఆస్తులు 108% పెరగడం చాలా ఆశ్చర్యకరం. కాగా మన దేశంలో ఇంకా 30% మంది అంటే 40 కోట్ల మంది దారిద్ర్యరేఖ దిగువన తమ జీవనం సాగించడం చాలా ఆందోళనకరం. 2014 నుండి దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం తాను అనేక సంస్కరణలు తెచ్చానని, అందరి జీవన ప్రమాణాలు పెరిగాయని అందుకే జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్లు తెరిపించినట్లు చెప్పుకున్నా ప్రయోజనం శూన్యం.

ప్రజల ప్రమాణాలు రోజురోజుకు క్షీణించుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నా ప్రభుత్వ ప్రచారం మాత్రం భిన్నంగా ఉంది. దేశంలో అత్యధికంగా ఆస్తులు పెరిగినట్లు ప్రకటించిన మొదటి ఇద్దరు సభ్యులు కాగా, మూడవ స్థానం వైకాపా సభ్యులు ఆక్రమించడం విశేషం. వారి ఆస్తులు 162, 130, 124 కోట్లు పెరిగినట్లు నివేదిక తెలుపుతున్నది. ఆస్తులు బాగా పెంచుకున్న మొదటి పది మంది సభ్యుల్లో ఐదుగురు బిజెపి సభ్యులే కాగా, సర్వే తెలిపిన 102 మందిలో 65 మంది కూడా ఆ పార్టీ వారే కావడం కూడా బిజెపి ధనికులకే పార్టీ టిక్కెట్లు ఇస్తుందన్న విషయాన్ని నిరూపిస్తున్నది. బిజెపి సభ్యుల ఆస్తులు 108%పెరగగా, కాంగ్రెస్ సభ్యులు 135%, తృణమూల్ సభ్యులు 86% పెంచుకున్నారు. నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థతో ఎడిఆర్ సంయుక్తంగా జరిపిన విశ్లేషణలో దేశంలోని 5203 మంది ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల్లో 1106 మంది అంటే 21% సభ్యులకు వంశపారంపర్య రాజకీయాలు ఉన్నట్లుగా తెలిసింది అంటే ప్రతి ఐదులో ఒక సభ్యుడు వారసత్వ అర్హతతో రాజకీయాలు నడుపుతున్నాడన్నమాట.

వీరిలో 32% కాంగ్రెస్ కాగా, 17% బిజెపి సభ్యులు కావడం గమనార్హం. ప్రాంతీయ పార్టీలు సైతం జాతీయ పార్టీల బాటలోనే నడుస్తుండడం బాధాకరం.ఇక చట్టసభలకు ఎన్నికయ్యే గౌరవ సభ్యులు అనేకమంది నేరచరిత్ర కలవారుగా వారు తమ అఫిడవిట్లలోనే చూపించుకున్నారు. 20 శాతం పోటీ చేసిన సభ్యులపై క్రిమినల్ కేసులు ఉండగా, 14% మంది తీవ్రమైన నేర సంబంధిత కేసుల్లో నమోదైన వారున్నారు. లోక్‌సభకు పోటీ చేశారు 98 మంది కోర్టులచే శిక్షపొందిన వారు కాగా, 40 మంది హత్య కేసుల్లో నిందితులు మహిళా అభ్యర్థుల సైతం ఇలాంటి కేసుల్లో ఉండడం బాధాకరం. కాగా బిజెపి నుండి 43%, కాంగ్రెస్ పార్టీ నుండి 44% అభ్యర్థులు తమపై కేసులున్నట్లు ప్రకటించినట్లుగా నివేదిక తెలుపుతున్నది. 2024 లోక్‌సభకు పోటీచేసిన అత్యంత ధనవంతులలో ఒకరు ఆంధ్రప్రదేశ్, ఒకరు తెలంగాణ, మరొకరు గోవాకు చెందినవారు. 46 మంది జీరో ఆస్తులు ప్రకటించడం గమనార్హం. 767 మంది లక్షకు తక్కువగా ఆస్తులు ఉన్నట్లుగా తమ అఫిడవిట్లలో పేర్కొన్నారు. అదే విధంగా పోటీ చేసిన వారిలో 42 శాతం మంది ఐదు నుండి 12 తరగతుల మధ్యన చదవగా, 51% మంది పట్టభద్రులు ఆపైన చదివినట్లుగా పేర్కొన్నారు. 292 మంది డిప్లొమా హోల్డర్లు. 217 మంది కనీస అక్షరాస్యులు కాగా, 121 మంది నిరక్షరాస్యులు.2024 లోక్‌సభకు రకరకాల జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థుల వయసు, ఆస్తులు, విద్యార్హతలు, లింగం, నేరచరిత్ర, వంశపారంపర్యత, వారి ఓట్ షేర్ లాంటి అనేక సున్నితమైన అంశాలను ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ నుండి సేకరించి ఎడిఆర్, ఎన్ఇడబ్ల్యూ సంస్థల విశ్లేషణాత్మకమైన నివేదిక ప్రజలకు అందుబాటులో ఉంచారు. తదుపరి జరిగిన ఢిల్లీ, బీహార్ ఎన్నికల అభ్యర్థుల వివరాలపై కూడా సమాచారంతో పాటుగా ప్రతి అధ్యాయం చివరన వీరి సలహాలు, సూచనలు కూడా పొందుపరిచారు. పార్టీలవారీగా కూడా ప్రతి అంశం విషయంలో ప్రత్యేక సమాచారం అందజేయడం విశేషం. ఐదు అధ్యాయాలు దాదాపు 1000 పేజీలతో కూడిన నివేదిక సగటు భారతీయ ఓటర్లను ఆలోచింపజేస్తుంది. నివేదిక ఇంగ్లీషు, హిందీ భాషల్లో కూడా లభ్యమవుతుంది.

ఓటు వేయడం కాదు, సరైన అభ్యర్థికి ఓటు వేయాలి అనే స్పృహ కలిగిస్తుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు కూడా నేరచరిత్ర, కేసులు, బిలియనీర్లు లాంటి అంశాల్లో తాము కూడా తక్కువ కాదు అని నిరూపించుకున్నారు. పబ్లిక్ డొమైన్‌లో లభ్యమవుతున్న ఈ నివేదిక గత ఎన్నికలలో ఎన్నికైన సభ్యుల వివరాలతో పోలికను కూడా చూపడం అసాధారణమైన విషయం. త్రిలోచన్ శాస్త్రి, అజిత్ రనాడే, జగదీప్ చొక్కార్ వీరు ముగ్గురు మేజర్ జనరల్ అనిల్ వర్మ నాయకత్వంలో పనిచేస్తూ ఎన్నికల సంస్కరణలకు తమ వంతు సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.1999లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వీరు స్థాపించిన ఎడిఆర్ పౌరులను, ఓటర్లను సాధికారులను చేసే దూరదృష్టి, స్వేచ్ఛాయుతమైన, నీతివంతమైన ఎన్నికలు, సంస్కరణలు రాజకీయ పార్టీలను బాధ్యులు చేసే విధంగా అవినీతి రహిత, నేర రహిత రాజకీయాలే ధ్యేయంగా పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం, పారదర్శకత కోసం తన వంతు పాత్ర నిర్వహించుచున్నది. పార్టీలను, నేతలను జవాబుదారులుగా చేస్తున్నది. పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా అప్పుడు సమర్పించేలా చేయడం ఆదాయ పన్ను రిటర్న్ ప్రజలకు అందుబాటులో ఉంచడం, రాజకీయ పార్టీలు సమాచార హక్కు కింద పనిచేయడం, బ్యాలెట్ పేపర్‌లో 'నోటా' ఉండేలా చేయడం, రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చుల పరిశీలించడం, సిఇసి ఇతర సభ్యులను ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతిపక్ష నాయకుల కమిటీ నిర్ణయించాలని, ఎలక్ట్రోరల్ బాండ్స్ నియంత్రణ జరగాలని, వివి ప్యాట్ల లెక్కింపు జరగాలనేవి వీటిలో ముఖ్యమైనవి. ఈ విజయాల ద్వారా అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్ సంస్థ అవినీతి రాజకీయ పార్టీలు, నేరపూరిత నేతల గుండెల్లో మాత్రం రైళ్లు పరుగెత్తిస్తున్నది. భారత రాజకీయాలు ప్రక్షాళన చేసే ఎడిఆర్ ప్రయత్నానికి ప్రజాస్వామ్యవాదులు తమ మద్దతు తెలుపుతారని ఆశిద్దాం. ఈ నివేదికల ద్వారా సగటు భారతీయ ఓటరు మరింత చైతన్యవంతమవుతాడని, అదే విధంగా శక్తివంతమవుతాడని కోరుకుందాం.

# నేడు మేడారానికి సర్కారు!

- మొదటి పేజి తరువాయి

అధికారులు అక్కడికి చేరుకుంటున్నారు. సాయంత్రం అక్కడి హరిత హోటల్ లో జరిగే కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో హైదరాబాద్ నగరం బయట మంత్రి మండలి సమావేశం జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇందుకోసం మంత్రి సీతక్క ఇవాళ (శనివారం ) ఉదయం నుంచి అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సీఎం, మంత్రులు, వివిధశాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారు లతో కలిపి సుమారు మూడు వందల మంది అక్కడ బస చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 28 నుంచి వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో ఈ కేబినెట్ మీటింగ్ అక్కడ ఏర్పాటు చేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

సీఎం పర్యటన, కేబినెట్ సమావేశం నేప థ్యంలో అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పా ట్లు చేశారు. మునుపెన్నడూ లేనంత భద్రను ఏర్పాటు చేశారు. సాధారణంగా రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ భేటీ అవుతుంటోంది. ఈసారి సంప్రదాయానికి భిన్నంగా ఒక మారుమూల గ్రామంలోనిర్వహించడం ఇదే తొలిసారి.

మేడారంలో జరగబోయే కేబినెట్ భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే మేడారంలో శాశ్వత ప్రాతిపాదికన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం భారీగానే నిధులు కేటాయించారు. కేబినెట్ భేటీలో మరిన్ని నిధులపై ప్రకటన ఏమైనా ఉంటుందా అనే చర్చ కూడా ఉంటుంది. రైతు భరోసా, హ్యామ్ రోడ్ల నిర్మాణం, మున్సిపల్ ఎన్నికలతో పాటు మరికొన్ని ముఖ్యమైన అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పనులు చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు.నగర అస్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే ప్రజలకు నిరసన తెలిపే హక్కు లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పనులు చేస్తోందని విమర్శించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ నగరాలకు శతాబ్దాల చరిత్ర ఉందని అన్నారు. ఈ రెండు నగరాలు రెండు కళ్లు వంటివని, అలాంటిది వాటి ఐడెంటిటీని తొలగించాలని ముఖ్యమంత్రి చూస్తున్నారని ఆరోపించారు.అరెస్టులు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. కోర్టుకు వెళ్లి న్యాయం కోసం పోరాడతామని అన్నారు. రిపబ్లిక్ డేకు పది రోజుల ముందు తెలంగాణలో హక్కుల ఖూనీ జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుండటం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సికింద్రాబాద్ బిడ్డలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సికింద్రాబాద్‌ను జిల్లాగా చేసే ఆలోచన చేస్తామని అన్నారు.

# లక్కీడ్రా ఇన్‌ఫ్లుయెన్సర్ల పట్ల జాగ్రత్త ఉండాలి

- మొదటి పేజి తరువాయి

రియాల్టీలో ఫ్రాడ్, లక్కీ డ్రా ఇన్‌ఫ్లుయెన్సర్ల పట్ల జాగ్రత్త“ అంటూ 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. లక్కీ డ్రా పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారంటూ ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఇన్‌ఫ్లుయెన్సర్లను విశ్వసించవద్దని ప్రజలకు సూచించారు.కొంతమంది ఇన్‌ఫ్లుయెన్సర్లు కార్లు, బైకులు, ప్లాట్లు, డీజేలు ఇస్తామని లక్కీ డ్రాల పేరుతో మోసాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా ఆగిపోవడంతో లక్కీ డ్రాలు అంటూ కొత్త వేషాలతో ఇన్‌ఫ్లుయెన్సర్లు దర్శనమిస్తున్నారని వెల్లడించారు. అమాయకపు ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని నిండా ముంచుతున్నారని, అలాంటి ఇన్‌ఫ్లుయెన్సర్లపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ యాక్ట్-1978

ప్రకారం లక్కీ డ్రాల పేరుతో మోసం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మోసాలకు పాల్పడేవారు సెలబ్రిటీలైనా, సోషల్ మీడియా స్టార్లు అయినా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాప్యులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

# బంగ్లాదేశ్‌లో దారుణం.. మరో హిందువు దారుణ హత్య

బంగ్లాదేశ్‌లో మరో హిందువు దారుణ హత్యకు గురయ్యాడు. గత మూడు వారాల్లోనే బంగ్లాదేశ్‌లో పది మందికి పైగా హిందువులు హత్యకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది.

తాజాగా, పెట్రోల్ పంపులో ఇంధనం నింపుకుని డబ్బులు చెల్లించకుండానే వెళ్లిపోతున్న వ్యక్తిని అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు హిందూ వ్యక్తిని వాహనంతో ఢీకొట్టి హతమార్చారు. ఈ విషాద సంఘటన రాజ్‌బరి జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడిని 30 ఏళ్ల రిపోన్ సాహాగా గుర్తించారు. అతడు అక్కడి పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడని పోలీసులు వెల్లడించినట్లు అక్కడి మీడియా వర్గాలు తెలిపాయి. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హషేమ్ పెట్రోల్ నింపుకున్న తర్వాత డబ్బులు చెల్లించకుండానే వెళ్లడానికి ప్రయత్నించాడు. దీంతో రిపోన్ అతడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, హషేమ్ తన కారును అతనిపైకి పోనిచ్చాడు. తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడికక్కడే మృతి

చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హషేమ్, అతడి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## చైనా స్కూలులో నోరో వైరస్ కలకలం.. వంద మందికి పైగా సోకిన వైరస్

చైనాలోని ఓ స్కూలులో వైరస్ కలకలం రేగింది. వంద మందికి పైగా విద్యార్థులు అనారోగ్యానికి గురికావడంతో వైద్యాధికారులు రంగంలోకి దిగి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 103 మంది విద్యార్థులకు 'నోరా వైరస్' సోకినట్లు తేలింది. దీంతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం.. క్లాస్ రూమ్ లతో పాటు స్కూలు ఆవరణలో వైరస్ ను నాశనం చేసే మందును చల్లారు. వైరస్ బాధిత విద్యార్థులకు చికిత్స అందజేస్తూనే మిగతా విద్యార్థులకు వైరస్ సోకకుండా చర్యలు చేపట్టారు.బాధిత విద్యార్థులు అందరూ కోలుకుంటున్నారని వివరించారు. రోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షిస్తూ ప్రత్యేక హాజరు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్కూలు పరిసరాల్లోని నివాస సముదాయాల్లో ఉంటున్న వారికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు వివరించారు. గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ డిసీజ్ కంట్రోల్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..

ఏటా అక్టోబర్ నుంచి మార్చి మధ్య ప్రావిన్స్ లో నోరో వైరస్ విజృంభిస్తుందని అధికారులు తెలిపారు. వైరస్ బాధితులు ప్రధానంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటారని చెప్పారు. ఈ వైరస్ సాధారణమైందేనని, వైరస్ వ్యాప్తి చాలా వేగంగా ఉంటుందని వివరించారు. ఈ వైరస్ ను తొలిసారి 1968 లో అమెరికాలోని ఓహియో రాష్ట్రం నార్ వాక్ లోని ఓ స్కూలులో గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ వైరస్ ను నోరో వైరస్ గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమెరికాలో ఎక్కువగా ఆహారం ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు. ఏటా ప్రపంచవ్యాప్తంగా 68.5 కోట్ల మంది ఈ వైరస్ బారిన పడుతుండగా.. అందులో 20 కోట్ల మంది ఐదేళ్లలోపు చిన్నారులేనని గణాంకాలు చెబుతున్నాయి. ఈ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 50 వేల మంది చిన్నారులు సహా 20 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని సమాచారం.

# యుద్ధం ముగియలేదు... ఇప్పుడే ప్రారంభమైంది

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంతో తమను నిర్వీర్యం చేశామని భావిస్తున్న బీజేపీ నేతలకు అది ఎప్పటికీ సాధ్యం కాదని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. యుద్ధం ఇప్పుడే మొదలైందని, ఇది ముగింపు కాదని ఆయన ఉద్ఘాటించారు. బీజేపీ కుట్రలను త్వరలోనే బయటపెడతామని అన్నారు. ముంబైలో శివసేన (యూబీటీ) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని, అదే నెరవేరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆకాంక్షించారు.స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరగడం వల్లే బీజేపీ గెలుపొందిందని ఉద్ధవ్ థాకరే ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందని దుయ్యబట్టారు. ముంబైని పూర్తిగా తాకట్టు ద

పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని గుర్తు చేశారు. 227 స్థానాలున్న బీఎంసీలో బీజేపీ 89 స్థానాలు, శివసేన (షిండే) 27 స్థానాలు, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) 64 స్థానాల్లో విజయం సాధించాయి.

# బీఆర్ఎస్ పార్టీ ముక్కలవడం ఖాయం

- మొదటి పేజి తరువాయి

అయినా కాంగ్రెస్ కేంద్ర పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# బీహార్‌లో గెలిచాం.. బెంగాల్‌కు సమయం ఆసన్నమైంది

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ పార్టీకి హింస, బుజ్జగింపు రాజకీయాలు కావాలని ఆయన విమర్శించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.రాష్ట్రానికి అసలైన సవాల్ చొరబాటుదారులేనని మోదీ పేర్కొన్నారు. చొరబాట్లను అరికట్టడంలో తృణమూల్ ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. మాల్దా, ముర్షిదాబాద్ వంటి ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగడానికి చొరబాట్లే కారణమని ఆయన ఆరోపించారు. బెంగాల్ రాష్ట్రానికి

వరద సహాయ నిధులను కేంద్రం 40 సార్లు అందించినా, ఆ నిధులు అసలైన లబ్ధిదారులకు చేరలేదని ప్రధానమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.బెంగాల్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే బీజేపీ ప్రభుత్వం ఇక్కడ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన అన్నారు.

## కత్తులతో దాడి చేసుకున్న టీడీపీ, వైసీపీ కార్యకర్తలు.. టీడీపీ కార్యకర్త మృతి

కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## 11 సీట్లకే పరిమితమైనా మీ 'తాచుపాము' బుద్ధి మారలేదు

**పెన్ పవర్ డెస్క్:**“2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురై కేవలం 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ నేతల 'తాచుపాము' బుద్ధి మారకపోవడం రాష్ట్ర దౌర్భాగ్యం“ అని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర అభివృద్ధిపై, ముఖ్యంగా ప్రజా రాజధాని అమరావతిపై వైసీపీ విషప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు.“హెల్దీ-హ్యాపీ-వెల్దీ స్టేట్ అనే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుంటే, రాష్ట్రంలో కనిపిస్తున్న ఆశాజనక వాతావరణాన్ని దెబ్బతీయడమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో అమరావతికి మనస్ఫూర్తిగా

'జై' కొట్టిన జగన్మోహన్ రెడ్డి, అధికారం రాగానే 'నై' అని మాట మార్చి రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించారు. ఐదేళ్ల పాటు రాజధాని లేకుండా చేసి ప్రజల కలలను విధ్వంసం చేశారు“ అని పార్థసారథి మండిపడ్డారు.

2019కి ముందు అమరావతే రాజధాని అని, తాను తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నానని నమ్మబలికిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక తుగ్లక్ పాలనను తలపించేలా మూడు రాజధానుల నాటకం ఆడారని విమర్శించారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు త్యాగం చేసిన 29 వేల మంది రైతులను అవమానించారని, అమరావతిని ఎడారి, శ్మశానంతో పోల్చారని గుర్తుచేశారు. “సొంత అవసరాల కోసం వందల ఎకరాల్లో, వేల చదరపు అడుగుల ప్యాలెస్‌లు కట్టుకున్న నాయకులు, ఐదు కోట్ల ప్రజలకు రాజధాని అవసరమా అని ప్రశ్నించడం సిగ్గుచేటు. కులాల మధ్య చిచ్చు, ప్రాంతాల మధ్య విషం చిమ్ముతూ నీచ రాజకీయాలు చేయడం జగన్ రెడ్డికి అలవాటుగా మారింది“ అని దుయ్యబట్టారు. అమరావతిపై ఇన్సైడర్ ట్రేడింగ్ అంటూ అసత్య ఆరోపణలు చేసి హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత మొట్టికాయలు తిన్నా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదని పార్థసారథి అన్నారు.

“పీపీపీ విధానంలో రాష్ట్రానికి వచ్చే సంస్థలను 'మేం వస్తే అరెస్ట్ చేస్తాం' అని బెదిరించడం అత్యంత జుగుప్సాకరం. ఇది రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేసే కుట్ర కాదా?“ అని ప్రశ్నించారు. చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించినప్పుడు కూడా ఇలాంటి విమర్శలే వచ్చాయని, కానీ నేడు ఆ ప్రాంతం విలువ అందరికీ తెలుసని అన్నారు. అమరావతి పూర్తయితే వచ్చే లక్షల కోట్ల సంపదతోనే రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతిలో పనులు శరవేగంగా సాగుతున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు. విశాఖ, అనకాపల్లి ప్రాంతాల్లోనూ టీసీఎస్, రిలయన్స్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. “రాజ్యాంగంపై గౌరవం లేని వైసీపీ, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించే ధైర్యం లేక బయట కూర్చుని విషప్రచారం చేస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఈ నిజాన్ని ప్రజలు గ్రహించి, విధ్వంసకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి“ అని మంత్రి పార్థసారథి పిలుపునిచ్చారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్


# తెలంగాణలో 20 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో 20 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. గజారావు భూపాల్ (ఐజీ), అభిషేక్ మొహంతి (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీ), భాస్కరన్ (ఇంటెలిజెన్స్ డీఐజీ), చందనా దీప్తి (ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ అదనపు సీపీ), టి. అన్నపూర్ణ (అడ్మిన్, సైబరాబాద్ డీసీపీ), రాహుల్ హెగ్డే (హైదరాబాద్ సిటీ ట్రాఫిక్–3 డీసీపీ), అపూర్వారావు (ఇంటెలిజెన్స్ ఎస్పీ), బి.బాలస్వామి (విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ), వెంకటేశ్వర్లు (సీఐడీ ఎస్పీ)అవినాష్ కుమార్ (క్రైమ్స్, డీసీపీ)గా బదిలీ అయ్యారు.

## తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు

- 121 మున్సిపాలిటీల్లో ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38 చైర్‌పర్సన్ పదవుల కేటాయింపు
- మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల కేటాయింపు
- మహిళా జనరల్‌కు హైదరాబాద్ కార్పొరేషన్ కేటాయింపు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలోని కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. 121 మున్సిపాలిటీల్లో ఎస్టీలకు 5, ఎస్సీలకు 17, బీసీలకు 38 మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులను కేటాయించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఈ మేరకు మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

**వివిధ కార్పొరేషన్‌లకు ఖరారు చేసిన రిజర్వేషన్లు**

వివిధ కార్పొరేషన్‌లకు ఖరారు చేసిన రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్‌కు ఎస్టీ జనరల్, రామగుండం కార్పొరేషన్‌కు ఎస్సీ జనరల్, మహబూబ్ నగర్ కార్పొరేషన్ బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్ బీసీ జనరల్, కరీంనగర్ కార్పొరేషన్ బీసీ జనరల్, జీహెచ్ఎంసీ మహిళ జనరల్, గ్రేటర్ వరంగల్ జనరల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్ కార్పొరేషన్‌లలో మహిళ జనరల్‌ను ఖరారు చేశారు.

- ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్ల ఖరారు..
- ఎస్ఈఈఈపిసి సర్వే2024 ఆధారంగా లాటరీ పద్ధతిలో రిజర్వేషన్ ఎంపిక..
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా రిజర్వేషన్ల వివరాలు ప్రకటన..
- అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ..
- రిజర్వేషన్లపై గెజిట్ విడుదలకు కలెక్టర్ ప్రకటన..




# ఆ మూడు మున్సిపల్ ఎన్నికలకు..! మహిళా రిజర్వేషన్లు..!



లాటరీ పద్ధతిలో నిర్ణయించిన రిజర్వేషన్ ప్రకటిస్తున్న కలెక్టర్ మను చౌదరి..

### మేడ్చల్ జిల్లాలోని 3 మున్సిపాలిటీలకు లాటరీ పద్ధతిలో నిర్ణయం: కలెక్టర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 17:** మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు మహిళా రిజర్వేషన్‌లను లాటరీ ద్వారా ఖరారు చేశారు.. జిల్లాలో జీహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపాలిటీల తర్వాత, మిగిలిన మూడు మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థుల రిజర్వేషన్‌లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసినట్టు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.. మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా పరిధిలో త్వరలో జరగనున్న ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి మహిళా రిజర్వేషన్లను లాటరీ పద్ధతిలో ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రకటించారు.. ఈ మేరకు శనివారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలు పాల్గొన్నారు.. ఎల్లంపేట్ (24 వార్డులు), మూడుచింతలపల్లి (24 వార్డులు), అలియాబాద్ (20 వార్డులు) మున్సిపాలిటీ లకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా రిజర్వేషన్లను ప్రణాళికా శాఖ ఆమోదించిన ఎస్ఈఈఈపిసి సర్వే2024 (సోషియో, ఎకనామిక్, ఎడ్యుకేషన్, ఎంప్లాయ్మెంట్, పొలిటికల్ మరియు కాస్ట్) ఆధారంగా లాటరీ విధానంలో ఖరారు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రిజర్వేషన్లకు సంబంధించిన గజిట్‌ను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించారు.. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, ఎల్లంపేట్, మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రిజర్వేషన్ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్వో,

# నల్గొండ ఇక కార్పొరేషన్...

## సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్ చెప్పిన మంత్రి కోమటిరెడ్డి

- నల్గొండకు మున్సిపల్ కార్పొరేషన్ హోదా
- కార్పొరేషన్ హోదాతో నేరుగా కేంద్ర నిధులు పొందే అవకాశం
- సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్న మంత్రి కోమటిరెడ్డి
- హైదరాబాద్ తరహాలో నల్గొండను తీర్చిదిద్దుతామని వెల్లడి
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించాలని పిలుపు

**హైదరాబాద్ పెన్ పవర్:** నల్గొండ పట్టణానికి మున్సిపల్ కార్పొరేషన్ హోదా లభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్గొండను కార్పొరేషన్‌గా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో నల్గొండను ఒక 'సూపర్ స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. కార్పొరేషన్ హోదా రావడంతో ఇకపై అభివృద్ధి పనుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి

-4 లో

# నిజామాబాద్‌దే కాకా కప్..

## IPL ను తలపించిన టీ20 లీగ్.. టోర్నీ పూర్తి వివరాలు ఇవే !

- తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడి
- తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందన్న ముఖ్యమంత్రి
- విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్న ముఖ్యమంత్రి

# 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చు



**హైదరాబాద్ పెన్ పవర్:** 25 ఏళ్లు కష్టపడి చదివితే 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లి ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలి ప్రధానమంత్రి నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు.తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే నేటికీ జీవనాధారంగా నిలుస్తున్నాయని అన్నారు. భూగరిష్ఠ పరిమితి చట్టం తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ దొరల వద్ద ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిందని గుర్తు చేశారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని గుర్తించాలని సూచించారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని అన్నారు.






- రూరల్ క్రికెటర్లకు వేదిక ఇదే
- కాకా వర్ధంతి రోజున ఇంటర్ డిస్ట్రిక్ట్స్ టీ20 లీగ్ స్టార్ట్
- ఐపీఎల్ తరహాలో నిర్వహణ, గ్రామీణ ప్రతిభకు పెద్ద పీట
- స్టేడియంలకు భూమి, హెచ్సీఏ నుంచి నిధులపై విజ్ఞప్తి
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాక ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకా వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ ఇంటర్డిస్ట్రిక్ట్స్ టీ20 లీగ్ ఫైనల్ లో నిజామాబాద్ జిల్లా టీమ్ విజేతగా నిలిచింది. సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్ లో జరిగిన టైటిల్ పోరులో ఖమ్మం జిల్లా జట్టు టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌ఎంచుకుంది. 19.5 ఓవర్లలో 114 రన్స్ కే ఆలౌట్ అయ్యింది. అనంతరం 115 పరుగుల టార్గెట్ తో చేజింగ్ స్టార్ట్ చేసిన నిజామాబాద్ టీం 12 ఓవర్లలోనే (ఇంకా 8 ఓవర్లు మిగిలి ఉండగానే) 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. హర్షవ ర్ధన్ సింగ్ (69 పరుగులు, 37 బాల్స్) అద్భు తమైన బ్యాటింగ్ తో రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. విజేతగా నిలిచిన టీమ్ కు నిర్వాహకులు రూ.5 లక్షల ప్రైజ్ మనీ అందజేశారు. అంతకుముందు టోర్నీలో పాల్గొన్న టీమ్ సభ్యులందరినీ మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్ర భాకర్, అజారుద్దీన్, ఉత్తమ్ కుమార్ రెడ్డి ,

-4 లో

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కండిషన్స్ అప్లై...

# AI సాయంతో అక్రమాలకు చెక్

**ఖమ్మం, హైదరాబాద, జనవరం 17, పెన్ పవర్:** పేదల సొంతింటి కలను నెరవేర్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' అమలు చేస్తోంది. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు కూడా ఈ పథకానికి అర్హులే. నియోజకవర్గానికి 3,500 చొప్పున తొలి విడతలో 4,16,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పూరిగుడిసెలు, తాత్కాలిక ఇళ్లలో ఉంటున్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. సొంత స్థలం ఉన్నవారికి తొలి దశలో ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా పనుల పురోగతిని అప్‌డేట్ చేస్తుండగా.. ఏఐ సాంకేతికతో అక్రమాలను గుర్తించి, చర్యలు తీసుకుంటున్నారు. సొంతిల్లు నిర్మించుకోవడం అనేది ఎలాంటి వారికైనా ఒక అపురూపమైన కల. మరి పేదలకు సొంతిల్లు నిర్మించుకోవడం అనేది చాలా పెద్ద కల. పేదలకు, గూడు లేనివారికి సొంతింటి కలను నిజం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం 'ఇందిరమ్మ ఇళ్లు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో నిరుపేదలైన, సొంత ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం లేదా ఇంటి స్థలంతో పాటు ఆర్థిక సాయం అందిస్తారు. ఈ పథకం పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ, దరఖాస్తు స్టేటస్ తెలుసుకునే విధానం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..

తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి సహాయం అందించడమే ఇందిరమ్మ ఇళ్లు పథకం ముఖ్య ఉద్దేశ్యం. ఈ పథకం ద్వారా కింది విధంగా లబ్ధి చేకూరుస్తారు..

1) ఆర్థిక సహాయం: సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు.

2) స్థలం + ఆర్థిక సహాయం: సొంత స్థలం లేని వారికి ఇంటి స్థలం కేటాయించడంతో పాటు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తారు.

3) ఎస్సీ, ఎస్టీలకు అదనపు సహాయం: ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 5 లక్షలతో పాటు అదనంగా రూ. 1 లక్ష (మొత్తం రూ. 6 లక్షలు) ఆర్థిక సహాయం అందిస్తారు.ఇంటి నిర్మాణం వివిధ దశల్లో ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఉదాహరణకు.. పునాది పూర్తయిన తర్వాత రూ. 1 లక్ష, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత రూ. 1.25 లక్షలు, స్లాబ్ నిర్మాణ సమయంలో రూ. 1.75 లక్షలు అందిస్తారు.రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించాలని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలి దశలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకానికి తెలంగాణ ప్రభుత్వం రూ. 22,000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

ఇందిరమ్మ ఇళ్లు పథకానికి ఎవరు అర్హులు?

దరఖాస్తుదారుడు తెలంగాణ రాష్ట్రానికి చెందిన పర్మినెంట్ నివాసి అయి ఉండాలి.

దారిద్ర్యరేఖకు) దిగువన ఉన్న కుటుంబాలు, లేదా ఆర్థికంగా వెనుకబడిన వర్గా ప్రజలు అర్హులు.

దళితులు, గిరిజనులు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాల వారికి ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తుదారుడికి లేదా అతడి కుటుంబానికి సొంత పక్కా ఇల్లు ఉండకూడదు.

గుడిసెలు, తాత్కాలిక ఇళ్లలో నివసించే వారికి ప్రాధాన్యం ఇస్తారు.

దరఖాస్తుదారుడు గతంలో ఏ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధి పొంది ఉండకూడదు (ముఖ్యంగా 1995 తర్వాత).

రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుడిని ఎంపిక చేస్తారు.

కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2 లక్షల కంటే తక్కువగా ఉండాలి.

ఒంటరి మహిళలు, వితంతువులు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇందిరమ్మ ఇళ్లు అధికారిక వెబ్‌సైట్:

హ్ట్ట్ప్స్://ఇందిరమ్మైందిలు.తెలంగాణ.గొవ్.ఇన్/

ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోనివారు.. కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందిరమ్మ ఇళ్లు పథకం నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోచ్చునని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గ్రామ పంచాయతీలు లేదా వార్డు కార్యాలయాలు లేదా మండల కార్యాలయాల నుంచి ప్రజా పాలన దరఖాస్తు పత్రాలను పొందవచ్చు. ఈ దరఖాస్తు ఫారమ్‌లను జాగ్రత్తగా నింపి, అవసరమైన పత్రాలను జతచేసి ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో సమర్పించాలి.ఇందిరమ్మ ఇళ్లు పథకానికి దరఖాస్తులను 'ప్రజా పాలన' కార్యక్రమం ద్వారా స్వీకరించారు. 2023 డిసెంబర్ 28 నుంచి 2024 జనవరి 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించారు. ఇళ్ల కోసం మొత్తం 77.18 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 36.03 లక్షల (46.7 శాతం) మంది మాత్రమే అర్హులని గుర్తించారు. మిగతా 41.15 లక్షల (53.3 శాతం) మందిని అనర్హులుగా తేల్చారు. అనర్హులందరూ దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు ఎగువన ఉన్నవారేనని అధికారులు నిర్ధారించారు.మొత్తం దరఖాస్తుదారుల వివరాలను తెలంగాణ గృహ నిర్మాణ శాఖ ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలుగా సిద్ధం చేసింది. దీని ప్రకారమే ప్రతి ఆర్థిక సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున.. రాష్ట్రవ్యాప్తంగా ఏటా గరిష్ఠంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఇళ్ల దరఖాస్తుల వివరాలను ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. యాప్‌లో పొందుపరిచిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్ర స్థాయిలో సిబ్బంది అన్ని కోణాల్లో సర్వేలు నిర్వహించారు. దీంతో పాటు ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా తీసుకున్న వివరాలను కూడా పరిశీలించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. దరఖాస్తుదారులను ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ అందుబాటులో లేదు. భవిష్యత్తులో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించవచ్చు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం దరఖాస్తుకు అవసరమైన పత్రాలు ఏంటి?

ఆధార్ కార్డు

రేషన్ కార్డు / ఆహార భద్రతా కార్డు

కుటుంబ ఆదాయ ధ వీకరణ పత్రం

నివాస ధృవీకరణ పత్రం

కుల ధృవీకరణ పత్రం (అవసరమైతే)

మైనారిటీ ధృవీకరణ పత్రం (అవసరమైతే)

బ్యాంకు ఖాతా వివరాలు (బ్యాంకు పాస్‌బుక్ జీరాక్స్)

భూమి యాజమాన్య పత్రాలు (సొంత స్థలం ఉన్నవారికి)

దరఖాస్తుదారుడి పాస్‌పోర్ట్ సైజు ఫోటోలబ్ధిదారులను గుర్తించేందుకు ఇందిరమ్మ కమిటీలను నియమించారు. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించాయి. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు పలు విడతలుగా పరిశీలించి అర్హులను గుర్తిస్తున్నారు.ఎంపికలో అతిపేదలు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తారు. పూరిగుడిసెలు లేదా పెంకుటిళ్ళలో నివసిస్తున్న వారికి తొలి దశలో ఇళ్లను నిర్మించి ఇస్తారు. గ్రామసభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాలను గుర్తిస్తారు. తుది జాబితాను గ్రామసభలో ప్రదర్శించి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. నియోజకవర్గాల వారీగా కలెక్టర్లు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తారు.ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు యాప్ తీసుకొచ్చింది. ఈ మొబైల్ యాప్‌ల ద్వారా దరఖాస్తుల పరిశీలన జరుగుతోంది. అధికారులు దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి ఫోటోలు తీసుకుని, వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. సొంత స్థలం ఉన్న వారిని అదే స్థలం దగ్గర ఉంచి, జియో ట్యాగింగ్ ద్వారా ఫోటో తీస్తున్నారు.పార్టీలకు అతీతంగా, ఎలాంటి సిఫారసులకు తావులేకుండా, నిజమైన అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రయోజనం చేకూరాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో గ్రామాలు, పట్టణాల వారీగా ఎక్కడెక్కడ ఎన్ని కేటాయించాలనే దానిపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం 3,500 ఇళ్లలో గ్రామాలు, పట్టణాల వారీగా మంజూరు చేసిన వాటి వివరాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి సమర్పిస్తే, ఆయన ఆమోదం తెలుపుతారు. అనంతరం ఎన్ని మంజూరయ్యాయో మళ్లీ గ్రామసభల్లో ప్రదర్శిస్తారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, బిల్లుల మంజూరులో ఏఐ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. ఇందిరమ్మ యాప్‌లో తప్పుడు సమాచారం నమోదు చేస్తే, సులభంగా గుర్తిస్తోంది. ఇందిరమ్మ యాప్‌లో గుంతలు, పునాది, పిల్లర్లు, స్లాబు, గోడలు, ఇంటి స్వరూపం లాంటి ఫోటోలను సిబ్బంది అప్‌లోడ్ చేశారు. దరఖాస్తుదారులకు సంబంధించిన సమగ్ర సమాచారం రికార్డై ఉంటుంది. పనుల పురోగతిపై యాప్‌లో వివరాలు నమోదు కాగానే, లబ్ధిదారుడి వివరాల ఆధారంగా ఏఐ వాటిని పరిశీలిస్తుంది. ఉండాల్సిన దానికంటే భిన్నంగా కనిపిస్తే వెంటనే గుర్తిస్తుంది. దీని ఆధారంగా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి, అక్రమాలు తేలితే చర్యలు తీసుకుంటారు.ఇళ్ల పునాది నిర్మాణాలు పూర్తి కాకున్నా, తప్పుడు ఫోటోలను అప్‌లోడ్ చేసి డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు చేసే ప్రయత్నాలను ఏఐ సాంకేతికతతో గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో 18 ఇళ్ల నిర్మాణాల పునాదులు పూర్తయ్యాయంటూ బిల్లుల కోసం ఆన్‌లైన్‌లో వివరాలు, ఫోటోలు నమోదు చేయగా.. తేడా ఉన్నట్లు ఏఐ గుర్తించడంతో అధికారులు పరిశీలించి, బిల్ కలెక్టర్‌ను విధుల నుంచి తొలగించారు.

యాప్‌లో ఏఐ సాయంతో గుర్తించే అంశాలు:

లబ్ధిదారుల ముఖకవళికలు

ఇల్లు నిర్మించాల్సిన స్థలం అక్షాంశ, రేఖాంశాలు

ఇంటి స్వరూపం (ఆర్‌సీసీ/ ఏసీ షీట్/ తాటాకులు/ ప్లాస్టిక్ షీట్ రూఫ్)

ఇంటి నిర్మాణ దశల ఫోటోలు

లబ్ధిదారుడి వివరాలు

ఇందిరమ్మ ఇళ్లు స్కీమ్ 2025

యాప్ సర్వేలో ఇందిరమ్మ ఇంటికి అర్హులేనని తేలినప్పటికీ.. సమగ్ర కుటుంబ సర్వేలో ఆదాయ పన్ను చెల్లిస్తున్నట్లు, ఇతర ప్రాంతంలో ఇల్లు, కారు ఉన్నట్లు తేలితే,ద

అలాంటివారిని అనర్హులుగా గుర్తించి దరఖాస్తులను పక్కన పెట్టేస్తున్నారు. పూర్తి వడపోత తర్వాత జూన్ 18న అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు. జూన్ 21 నుంచి గ్రామసభలు ఏర్పాటు చేసి ఈ జాబితాలను ప్రదర్శిస్తారు. అభ్యంతరాలను పరిశీలించి, తుది జాబితాను సిద్ధం చేస్తారు. జూన్ 26వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తికానుంది.

దరఖాస్తు స్టేటస్ ఎలా తెలుసుకోవాలి?

తెలంగాణ ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్‌ను (https://indirammaindlu.telangana.gov.in/) రూపొందించినప్పటికీ.. ప్రస్తుతం ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఇందిరమ్మ ఇళ్లు పథకం దరఖాస్తు స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునేందుకు వివరాలు లేవు. భవిష్యత్తులో ఆధార్ నంబర్/ మొబైల్ నంబర్/ రేషన్ కార్డు నంబర్ సాయంతో అప్లికేషన్ స్థితిని తెలుసుకునే సదుపాయాన్ని కల్పించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల విభజన ఇలా..

1 (లిస్ట్ 1): సొంత స్థలం ఉండి, పక్కా ఇల్లు లేని వారు. వీరికి మొదటి విడతలో ప్రాధాన్యం ఇస్తారు. సొంత స్థలంలో గుడిసె, పూరిపాక, మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు ఉన్నవారిని కూడా ఈ జాబితాలో చేర్చారు.

2 (లిస్ట్ 2): సొంత స్థలం లేదా పక్కా ఇల్లు లేని పౌరులు. గుడిసెల్లో, తాత్కాలిక ఇళ్లలో నివాసం ఉంటున్నవారు. వీరికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి సహాయం అందిస్తారు.

ూ3 (లిస్ట్ 3): ఇప్పటికే పక్కా ఇల్లు ఉండి, వార్షికాదాయం రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారు. వీరు ఈ పథకానికి అర్హులు కారు.ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఏవైనా సందేహాలను నివృత్తి చేసుకోవడానికి లేదా ఫిర్యాదులు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం 040-29390057 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నంబర్‌కు పని దినాల్లో కాల్ చేసి వివరాలను తెలుసుకోవచ్చు.

## పుర ఎన్నికల రిజర్వేషన్లకు కసరత్తు

**అచ్చంపేట, జనవరి 17 పెన్ పవర్:** పురపాలిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. తుది ఓటర్ల జాబితాలను ప్రకటించారు. పురపాలికల్లో రిజర్వేషన్లకు సంబంధించిన ప్రకటనను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళల వారీగా వార్డులు, ఛైర్‌పర్సన్ పదవులను రిజర్వు చేశారు. ఏ కేటగిరీకి ఎన్ని పదవులు దక్కుతాయో ఇప్పటికే ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వుడ్ స్థానాలను కేటాయించారు. బీసీ డెడికేటెడ్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వుడ్ స్థానాలు కేటాయించారు. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం జనరల్ విభాగం మహిళలకు రిజర్వుడ్ స్థానాల సంఖ్యను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 20 పురపాలికలు ఉండగా అచ్చంపేట, జడ్చర్ల పురపాలికల కాలపరిమితి ముగియకపోవడంతో ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదు. మహబూబ్నగర్ పురపాలికను కార్పొరేషన్‌గా స్థాయికి పెంచారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం



**కోదాడ, జనవరి 17 పెన్ పవర్:** చిలుకూరు మండల పరిధిలోని కట్టకొమ్ముగూడెం గ్రామంలో గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను గ్రామ పంచాయతీ సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్, నర్సింహాపురం గ్రామ సర్పంచ్ వేమూరి సత్యనారాయణలు ప్రారంభించారు. క్రీడల్లో రాణించి గ్రామానికి పేరు తేవాలని, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## టైరు పేలి బోల్తా కొట్టిన కారు..
## ఇద్దరు టీచర్లు మృతి

**సూర్యాపేట, జనవరి 17 పెన్ పవర్:**సూర్యాపేట జిల్లా అర్వపల్లి వద్ద టీచర్లు ప్రయాణిస్తున్న కారు టైరు పేలి మూడు పల్టీలు కొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో కల్పన అనే టీచర్ స్పాట్‌లోనే మృతి చెందారు. గాయపడిన నలుగురు టీచర్లను సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. వీరిలో గీత అనే టీచర్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ కు తరలిస్తుండగా చనిపోయారు. దీంతో టీచర్లు కల్పన, గీతల ఇంటి వద్ద విషాద ఛాయలు అమ్ముకున్నాయి. సంతోషంగా స్కూల్‌కి వెళ్లిన తమ వారు విగత జీవిగా రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల విజయసంకల్ప సమావేశంలో పాల్గొన్న నాయకులు



**తుంగతుర్తి, జనవరి 17 పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర స్థాయి మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికల విజయ సంకల్ప సమావేశం సికింద్రాబాద్ లోని క్లాసిక్ గార్డెన్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరవేయడమే తమ లక్ష్యమని సూర్యాపేట బీజేపీ నాయకులు తెలిపారు. ఈ సమావేశం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలను, వ్యూహాలను సమీక్షించడానికి నిర్వహించబడింది.

## తోటి విద్యార్థుల ఆర్థిక సాయం:
## బెల్లం కొండ కుటుంబానికి భరోసా

**భువనగిరి, జనవరి 17 పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామంలో ఇటీవల మృతి చెందిన బెల్లం కొండ పర్శరాము కుటుంబానికి, 2011-12 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం రూ. 12,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ముక్క శ్రీకాంత్, జెట్ట శ్రీకాంత్, కర్ణాకర్, కుమార్, ప్రశాంత్, కార్తీక్, సిద్దులు పాల్గొన్నారు. మృతుని కుటుంబానికి అండగా నిలిచిన తోటి విద్యార్థుల సాయం పలువురి ప్రశంసలు అందుకుంది.

## బాన్సువాడ మున్సిపల్ చైర్మెన్ సీటుకు బీసీ మహిళను ఖరారు

**బాన్సువాడ, జనవరి 17 పెన్ పవర్:** బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ సీటును బీసీ మహిళకు ఖరారు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. వార్డుల వారీగా రిజర్వేషన్లను కూడా ప్రకటించారు. 1వ వార్డు జనరల్ మహిళ, 2వ వార్డు బీసీ జనరల్, 3వ వార్డు జనరల్, 4వ వార్డు ఎస్సీ జనరల్, 5వ వార్డు జనరల్ మహిళ, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు బీసీ మహిళ, 8వ వార్డు ఎస్సీ మహిళ, 9వ వార్డు జనరల్ మహిళ, 10వ వార్డు ఎస్టీ, 11వ వార్డు జనరల్, 12వ వార్డు జనరల్, 13వ వార్డు జనరల్, 14వ వార్డు బీసీ మహిళ, 15వ వార్డు బీసీ జనరల్, 16వ వార్డు జనరల్, 17వ వార్డు బీసీ మహిళ, 18వ వార్డు బీసీ మహిళ, 19వ వార్డు బీసీ జనరల్ గా రిజర్వేషన్లు ప్రకటించారు.

## తప్పిపోయిన అరగంటలోనే
## తల్లికి బిడ్డను అప్పగించిన పోలీసులు

**ఎల్లారెడ్డి, జనవరి 17 పెన్ పవర్:** కామారెడ్డికి ప్రయాణిస్తున్న ఫరీద్‌పేట్ గ్రామానికి చెందిన యస్. సబిత తన ఏడేళ్ల కూతురు సుదీక్ష అలియాస్ చెర్రీని పాల్వంచ?మర్రి బస్సులో కోల్పోయింది. ప్రయాణికుల రద్దీ కారణంగా మార్గమధ్యంలో బస్సు దిగిన చిన్నారి కనిపించకపోవడంతో తల్లి ఆందోళనకు గురైంది. వెంటనే కామారెడ్డి పోలీసులకు సమాచారం అందించగా, సీఐ నరహరి ఆధ్వర్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఐదు బృందాలు రంగంలోకి దిగాయి. కేవలం అరగంట వ్యవధిలోనే పోలీసులు చిన్నారిని గుర్తించి, సురక్షితంగా తల్లి చెంతకు చేర్చారు.

## కుంటలో దూకి యువకుడి ఆత్మహత్య

**కామారెడ్డి, జనవరి 17 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా శబ్దిపూర్ తండాలో శనివారం ఇంట్లో జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన సాయికుమార్ అనే యువకుడు పుల్చేరు కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సాయికుమార్ కుటుంబ సభ్యులతో జరిగిన చిన్నపాటి గొడవతో ఈ ఘోరం జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# నల్గొండ ఇక కార్పొరేషన్...

-3 పేజీ తరువాయి

నేరుగా నిధులు పొందే అవకాశం కలిగిందని మంత్రి కోమటిరెడ్డి వివరించారు. కేవలం 25 నెలల్లోనే ఈ హోదాను సాధించామని, దీనివల్ల గతంతో పోలిస్తే అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.రాబోయే రోజుల్లో చేపట్టనున్న అభివృద్ధి ప్రణాళికలను కూడా ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్‌తో పాటు రూ.700 కోట్లతో ఓఆర్ఆర్, ధర్వేశిపురం వరకు 6 లైన్ల రహదారి నిర్మిస్తామని తెలిపారు. అలాగే, ఏఎంఆర్పీ కాలువల లైనింగ్ కోసం రూ.450 కోట్లు కేటాయించనున్నట్టు వెల్లడించారు. బ్రహ్మంగారి గుట్ట - లతీఫ్ సాబ్ దర్గా గుట్టలను కూడా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు.రాజకీయాలకు అతీతంగా నల్గొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్పొరేషన్ అభివృద్ధికి శాంతి, సామరస్యాలతో అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# నిజామాబాద్‌దే కాకా కప్..

-3 పేజీ తరువాయి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శివలాల్ యాదవ్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్సీఏ) సభ్యులు అభినందించారు.

డిసెంబర్ 22న కాకా వర్ధంతి రోజున ఈ టోర్నీని ప్రారంభించామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది క్రికెటర్లు బయటికి రావాల న్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించామని తెలిపారు. గతంలో వెలుగు పత్రిక ద్వారా కూడా ఇలాంటి టోర్నీ నిర్వహించామని, ఇప్పుడు విశాఖ ఇండస్ట్రీస్ తరపున ఇంటర్ డిస్ట్రిక్ట్స్ టీ20 లీగ్ ఐపీఎల్ తరహాలో నిర్వ హించామని స్పష్టం చేశారు. ప్రపంచంలో క్రికెట్ ఒక పెద్ద క్రీడగా ఎదిగిందని పేర్కొన్న మంత్రి, హెచ్సీఏ నుంచి జిల్లా క్రికెట్ అసోసియేషన్లకు మరింత నిధులు కేటాయించాలని హెచ్సీఏ అధ్యక్షుడిని కోరారు. స్టేడియంల నిర్మాణానికి భూమి అవసరమని రెవెన్యూ మంత్రికి తెలియజేశామని, వరంగల్లో ఇప్పటికే గ్రౌండ్ స్థలం సిద్ధంగా ఉందని, ఇతర జిల్లాల్లో కూడా గ్రౌండ్ల కోసం స్థలం కావాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నపుడే రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం కోసం భూమి సేకరించి నిర్మించామని గుర్తుచేశారు.

కాకా వెంకటస్వామి ఉన్నపుడే టాక్సీ బెనిఫిట్ అంశంపై అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, ఆర్థిక మంత్రి చిదంబరంతో మాట్లాడి ప్రయోజనాలు సాధించామని తెలిపారు. హెచ్సీఏ ప్రతి సంవత్సరం ఇలాంటి ఇంటర్ డిస్ట్రిక్ట్స్ టీ20 లీగ్ నిర్వహించాలని కోరుతూ, విశాఖ ఇండస్ట్రీస్ ఎప్పటికీ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ టోర్నీలో విజయం సాధించిన జట్టుకు అభినందనలు తెలియజే స్తూ, ఎలాంటి లోపాలు లేకుండా టోర్నీ విజయవంతంగా కొనసాగిందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.

**తెలంగాణ క్రికెట్‌ఎకు ఇదో కొత్త దిశ : పొన్నం**

కాకా వెంకటస్వామి మెమోరియల్ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ టీ20 లీగ్ ఫైనల్ మ్యాచ్ జరగడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దాదాపు 500 మంది టాలెంట్ ఉన్న క్రీడాకారులకు ఇలాంటి టోర్నీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ముఖ్యంగా బౌలింగ్, బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లకు రానున్న రోజుల్లో హెచ్సీఏ మరింత సహకారం అందించాలని సూచించారు.

కాకా వెంకటస్వామి కుమా రుడిగా వివేక్ వెంకటస్వామి ఈ టోర్నీని నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ క్రీడా పరంగా ముందుండాలంటే ఎక్కడెక్కడ స్థలాలు ఉన్నాయో గుర్తించి మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

**ఇతర జిల్లాల్లోనూ స్టేడియాలు: ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్ తరహాలో ఇతర జిల్లాల్లోనూ క్రికెట్ స్టేడియాలను ఏర్పాటు చేస్తామని

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. తమ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. కాకా క్రికెట్ టోర్నీ నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసే టోర్నీ: పొంగులేటి

విశాఖ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకా వెంకట స్వామి మెమోరియల్ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ టీ20 లీగ్ మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసిన టోర్నీగా నిలిచిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అన్ని జిల్లాలను కవర్ చేస్తూ ఈ లీగ్ నిర్వహించడం ద్వారా గ్రామీణ స్థాయి ప్రతిభకు మంచి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. మన మధ్య లేని కాకా వెంకటస్వామి గుర్తింపుగా ఆయన కుమారుడు వివేక్ వెంకటస్వామి క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి టోర్నీ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

## కారు బోల్తా.. ఒకరి మృతి

**నారాయణ్‌ఖేడ్, జనవరి 17 పెన్ పవర్:** అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామం వద్ద 161వ జాతీయ రహదారిపై శనివారం ఉదయం అతివేగంతో, అజాగ్రత్తతో కారు నడుపుతూ ప్రమాదానికి గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. నారాయణఖేడ్ నుండి హైదరాబాద్ వైపు అతివేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోవడంతో ఈ ఘోరం జరిగింది. ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**అందోల్, జనవరి 17 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం పరిధిలోని మునిపల్లి మండలం బుదేరా గ్రామానికి సమీపంలో ముంబై–హైదరాబాద్ జాతీయ రహదారిపై, కంకోల్ – బుదేరా మధ్యలో రాత్రి 9–10 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆంజనేయులు (42) అనే వ్యక్తి మృతి చెందారు. కోహిర్ మండలం కవేలి గ్రామస్తుడైన మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికానున్నాయి.

## యువకుడి గొంతు కోసిన చైనా మాంజా

**సంగారెడ్డి, జనవరి 17 పెన్ పవర్:** చైనా మాంజా అమాయకులను గాయపరుస్తోంది. తాజాగా సంగారెడ్డి జిల్లాలో ఒకే రోజు రెండు ఘటనలు జరిగాయి. మారేపల్లిలో సాయిలు అనే యువకుడు బైక్‌పై వెళ్తుండగా మాంజా దారం మెడకు చుట్టుకుంది. దీంతో గొంతుకు తీవ్ర గాయం కావడంతో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. రాయికోడ్‌లో మరో యువకుడి సాయికుమార్‌కు చైనా మాంజా తగిలడంతో డాక్టర్లు మెడకు నాలుగు కుట్లు వేశారు. తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

## భార్య కాపురానికి రావడంలేదని భర్త దుశ్చర్య

**జహీరాబాద్, జనవరి 17 పెన్ పవర్:** భార్యను కాపురానికి పంపడం లేదనే ఆగ్రహంతో అల్లుడు అత్తగారింటి ముందు నిలిపిన ద్విచక్రవాహనానికి నిప్పంటించిన ఘటన మండల కేంద్రమైన నిజాంపేట్‌లో గురువారం రాత్రి జరిగింది. నారాయణఖేడ్ ఎస్సై శ్రీశైలం కథనం ప్రకారం.. నిజాంపేట్‌కు చెందిన పిట్ల బాలయ్య కూతురు సాయమ్మ, అదే గ్రామానికి చెందిన ఇరుపోటి రవికి 15 ఏళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ముగ్గురు సంతానం. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నెలరోజుల క్రితం రవి సాయమ్మను తిట్టి బెదిరించి ఇంటి నుంచి పంపేశాడు. ఆమె తల్లిగారింట్లో ఉంటోంది. రవి గురువారం రాత్రి తన అత్తగారి ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనానికి నిప్పంటించి వెళ్లిపోయాడు. సాయమ్మ కుటుంబసభ్యులు బయటకు వచ్చి చూసేసరికి బైక్ పాక్షికంగా కాలిపోయింది.

## మల్లన్న బ్రహ్మోత్సవం.. సర్వం సన్నద్ధం

**మెదక్, జనవరి 17 పెన్ పవర్:** కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో మొదలుకానున్నాయి. ఏటా ఉత్సవాల మొదటి ఆదివారం లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని ఆలయ వర్గాల అంచనా. ఈసారి జనవరి చివరి తేదీల్లో మేడారం జాతర ఉన్నందున అక్కడికి వెళ్లే భక్తులు ముందుగా 'మల్లన్న'ను దర్శించుకుంటారు. ఈ కారణంగా ఆదివారం మరింత ఎక్కువ మంది వచ్చే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు.

## యువత నేరాల బాట:

## జైళ్లలో 18-30 ఏళ్ల వారే ఎక్కువ

**మహబూబ్‌నగర్, జనవరి 17 పెన్ పవర్:** ఉమ్మడి జిల్లాలో 18–30 ఏళ్ల మధ్య వయసున్న యువకులు ఎక్కువ సంఖ్యలో నేరాలకు పాల్పడి జైళ్లకు వెళ్తున్నారని తెలిసింది. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కారాగారంతో పాటు, నాగర్కర్నూల్, కల్వకుర్తిలలో సబ్ జైళ్లు ఉన్నాయి. మహబూబ్నగర్ జైలులో 200 మంది, కల్వకుర్తిలో 17, నాగర్కర్నూల్ లో 90 మంది ఖైదీలను ఉంచే సామర్థ్యం ఉంది. పెద్ద కేసుల్లోని నిందితులను మహబూబ్నగర్ జైలుకు తరలిస్తుండటంతో ఆ జైలు ఎప్పుడూ ఖైదీలతో నిండిపోతోంది. చిన్న కేసుల్లోని వారిని నాగర్కర్నూల్, కల్వకుర్తి సబ్ జైళ్లకు పంపుతున్నారు.

## మహిళపై కత్తితో దాడి.. పరిస్థితి విషమం

**నారాయణపేట, జనవరి 17 పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మద్దూరు మండలం అచ్చంపల్లిలో శనివారం అంబటి లక్ష్మణ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన అంజమ్మపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో అంజమ్మ చేతులు, వీపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ విజయ్ కుమార్ దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చెట్టుపై నుంచి పడి బాలుడికి గాయాలు

**నాగర్‌కర్నూల్, జనవరి 17 పెన్ పవర్:** లింగాల మండల కేంద్రంలో గాలిపటం ఎగరేస్తున్న బాలుడు రిషిత్ ప్రమాదానికి గురయ్యాడు. ఇంటి పైకి ఎక్కి గాలిపటం ఎగరేస్తుండగా, అది ఇంటికి అనుసరించుకొని ఉన్న చెట్టుపై పడింది. దానిని తీసుకునే ప్రయత్నంలో బాలుడు ప్రమాదవశాత్తు కింద పడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## నగరంలో లీకేజీల సమస్య

**వనపర్తి, జనవరి 17 పెన్ పవర్:** జిల్లా కేంద్రంలో తాగునీటి పైపులైన్ల లీకేజీ సమస్య నిత్యం వేధిస్తోంది. ఎక్కడో ఓ చోట లీకేజీ ఏర్పడటం, దీంతో కొన్ని కాలనీలకు సరఫరా నిలిచిపోడం తరచూ ఎదురయ్యే సమస్య. తాగునీరు కలుషితం అవుతోంది. కోదాడ – రాయచూర్ జాతీయ రహదారి పక్కన ప్రైవేట్ సంస్థ కేబుల్స్ కోసం తవ్వకాలు చేపట్టారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పైపులు పగిలిపోయాయి. అర కిలోమీటర్ పరిధిలో ఆరు చోట్ల తాగునీరు వృథాగా పోతోంది.

## ఇక విద్యార్థులకు స్కూల్ కిట్లు

**కల్వకుర్తి, జనవరి 17 పెన్ పవర్:** వచ్చే విద్యా సంవత్సరం(2026–27) నుంచి సర్కారు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ప్రాథమిక కసరత్తు పూర్తి చేసింది. అవసరమైన సామగ్రి కొనుగోలుకు సంబంధించిన మార్గదర్శకాల జారీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షించారు. దీనిపై త్వరలోనే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో వివిధ సంక్షేమ, విద్యాశాఖాధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది.

# తెలంగాణలో కుల రాజకీయాలు సాధ్యమేనా

**కరీంనగర్, జనవరి 17 పెన్ పవర్:** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ రెండు పడవలపై కాళ్లు పెట్టకూడదు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి తో అధికారంలోకి వచ్చిన పవన్ కల్యాణ్ తెలంగాణలోనూ పార్టీని విస్తరించాలని భావిస్తున్నట్లు కనపడుతుంది. ఇటీవల కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం పర్యటనలో భాగంగా ఒక రిసార్ట్ లో తెలంగాణ జనసేన నేతలు, కార్యకర్తలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. అయితే పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు తెలంగాణలో లేరని కాదు. అది సినిమా హీరోగానే అభిమానించేవాళ్లు. అంతే తప్ప రాజకీయంగా ఆయనను ఓన్ చేసుకునే వారు దాదాపుగా లేరనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు,తెలంగాణ పాలిటిక్స్ కు చాలా తేడా ఉంది.ఇక్కడ కుల రాజకీయాలు అస్సలు పనిచేయవు. అలాగే సెంటిమెంట్ బాగా పనిచేస్తుంది. గతంలో జరిగిన అనేక ఎన్నికలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. అందుకే వైసీపీ తెలంగాణలో దుకాణం మూసేసింది. తన పార్టీని ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే పరిమితం చేసింది. అసలు జగన్ తెలంగాణ రాజకీయాల్లో వేలు కూడా పెట్టడం లేదు. ఇక కూటమిలో తన మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా దాదాపు అదే బాటలో పయనిస్తుంది. తెలంగాణలో టీడీపీ ఇంతవరకూ రాష్ట్ర కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. జగన్, చంద్రబాబును చూసినట్లుగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ వాసిగానే తెలంగాణ ప్రజలు చూస్తారు. అంతే తప్ప తండోపతండాలుగా వచ్చి ఓట్లు గుమ్మరించే సీన్ మాత్రం లేదనే చెప్పాలి.అందుకే ఆంధ్రప్రదేశ్ లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుంటే మంచిది. పార్టీ పెట్టి ఇన్నేళ్లయినా ఆంధ్రప్రదేశ్ లోని అన్ని నియోజకవర్గాల్లో జనసేన లేదు. ఇది వాస్తవం. అలాంటిది తెలంగాణలో రాజకీయం చేసి చేతులు కాల్చుకోవడం తప్ప మిగిలేది ఏమీ ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. బహుశ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ఇక్కడ పెద్దగా రాజకీయంగా ఒరిగేది లేదు. వచ్చేది లేదు.అందుకే ముందు ఆంధ్రప్రదేశ్ లో పార్టీపై ఫోకస్ పెట్టి వచ్చే ఎన్నికల్లో మరిన్ని సీట్లు గెలిచి ముఖ్యమంత్రి పదవికి దగ్గర దారి ఏర్పరుచుకుంటే మంచిదన్న సూచనలు పవన్ కల్యాణ్ కు కొందరు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. మరి పవన్ చెవికి ఈ మాటలు ఎక్కుతాయో? లేదో? చూడాలి.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కొత్త రూల్

**హైదరాబాద్, జనవరి 17, పెన్ పవర్:** హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 అంతస్తులు దాటి నిర్మించే భవనాలకు టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేసింది. చెరువులు, నదుల పరిరక్షణకు భూసేకరణను వేగవంతం చేసేందుకు ఆకర్షణీయమైన టీడీఆర్ ప్యాకేజీని ప్రకటించింది.హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేసేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని చెరువులు, నదుల పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం భూసేకరణను వేగవంతం చేసేందుకు 'టీడీఆర్' నిబంధనలను సవరిస్తూ పురపాలక శాఖ జీవో నం.16ను విడుదల చేసింది. ఈ కొత్త ఉత్తర్వులు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్లకు వర్తిస్తాయి.కొత్త నిబంధనల ప్రకారం.. నగరంలో 10 అంతస్తులు దాటి నిర్మించే ప్రతి భవనానికి టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేశారు. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు మొత్తం నిర్మాణ విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లను బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల మార్కెట్‌లో నిల్వ ఉన్న టీడీఆర్




బాండ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ బిల్డర్లు తమ భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగిస్తే.. వారికి సెట్‌బ్యాక్, భవన ఎత్తు నిబంధనలలో ప్రత్యేక సడలింపులు కూడా కల్పిస్తారు.చెరువులు, నదుల సమీపంలోని పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్యాకేజీని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలోని భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలోని భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపలి భూములు అభివృద్ధి కోసం సేకరిస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, భూసేకరణ విస్తీర్ణం ఒక ఎకరా కంటే ఎక్కువగా ఉంటే ఆ దరఖాస్తును ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, చెరువుల సుందరీకరణకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది.గతంలో జారీ చేసిన సుమారు రూ. 10 వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి, వాటి విలువ పడిపోయింది. ఫలితంగా యజమానులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ నగదు పరిహారం కోరుతున్నారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడం వల్ల, బిల్డర్లు వీటిని కొనుగోలు చేయక తప్పదు. దీనివల్ల మార్కెట్‌లో టీడీఆర్ ధర పెరగడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గుతుంది. తద్వారా నిధుల కొరతతో ఆగిపోయిన రోడ్ల విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగవంతం కానున్నాయి.

# భూభారతిలోనూ...అవే లోపాలు

**హైదరాబాద్, జనవరి 17, పెన్ పవర్:** బీఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి ఒక ప్రధాన కారణమైన ధరణి పోర్టల్‌లోని లోపాలను సరిదిద్ది, పారదర్శకమైన భూ రికార్డుల నిర్వహణ కోసం ప్రస్తుత ప్రభుత్వం భూభారతి ని ఎంతో ఆర్భాటంగా తీసుకువచ్చింది. అయితే, ఆచరణలో ఈ కొత్త వ్యవస్థ కూడా పాత రోగాలనే ప్రదర్శిస్తుండటం ఇప్పుడు రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. ఇటీవల జనగామ, యాదాద్రి జిల్లాల్లో వెలుగుచూసిన చలాన్ల కుంభకోణం ఈ వ్యవస్థలోని సాంకేతిక లొసుగులను బట్టబయలు చేసింది. పేరు మార్చారు కానీ, అక్రమార్కులు చొరబడే మార్గాలను మాత్రం మూసివేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి.భూభారతి వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్లను వాడుకుని నిందితులు ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయల గండి కొడుతున్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ కోడింగ్‌లో ఉన్న లోపాల వల్ల అక్రమార్కులు చలాన్ల విలువను మార్చి, ప్రభుత్వానికి తక్కువ డబ్బు చెల్లిస్తూ రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సింది పోయి, సమస్య బయటపడినప్పుడు మాత్రమే స్పందిస్తూ అండర్ ప్లే చేస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. లోపాలను ఆదిలోనే గుర్తించి అరికట్టడంలో ఐటీ విభాగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.క్షేత్రస్థాయిలో రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. భూముల మార్పిడి, వారసత్వ సంక్రమణ, పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ వంటి అంశాల్లో భూభారతి ఇంకా వేగం పుంజుకోలేదు. స్లాట్ బుకింగ్ దొరకకపోవడం, డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాకపోవడం వంటి సాంకేతిక సమస్యలతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ధరణిలో ఉన్న సమస్యలే ఇక్కడా కొనసాగుతున్నాయి, మాకు ఒరిగిందేమిటి అని రైతులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణ లోపించడం వల్ల మధ్యవర్తులు



మళ్లీ రంగప్రవేశం చేసి రైతులను నిలువునా దోచుకుంటున్నారు.గత ఎన్నికల్లో ధరణిపై ఉన్న ప్రజా వ్యతిరేకతను బీఆర్ఎస్ ప్రభుత్వం తక్కువ అంచనా వేసి భారీ మూల్యం చెల్లించుకుంది. ఇప్పుడు అదే బాటలో భూభారతి వల్ల వచ్చే ఫిర్యాదులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భూమి అనేది సగటు మనిషికి అత్యంత సెంటిమెంట్ , ఆర్థిక మూలాధారం. అక్కడ చిన్న తప్పు జరిగినా అది పాలనపై తీవ్ర వ్యతిరేకతకు దారి తీస్తుంది. భూభారతి పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రభుత్వం సకాలంలో గుర్తించకపోతే, అది రాబోయే ఎన్నికల్లో ప్రస్తుత ప్రభుత్వానికి చేదు అనుభవాలను మిగిల్చే అవకాశం ఉంది.అసలు ఇలాంటి స్కాములు ఎందుకు జరుగుతున్నాయి? వ్యవస్థలో పారదర్శకత ఎక్కడ లోపిస్తోంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక పోర్టల్‌ను మార్చి మరొకటి తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉండదు. అది పటిష్టమైన భద్రతతో, సామాన్యుడికి అర్థమయ్యేలా ఉండాలి. అధికారులు, ఐటీ నిపుణులు నిరంతరం పర్యవేక్షించని పక్షంలో ఏ వ్యవస్థ అయినా అక్రమార్కులకు అడ్డాగా మారుతుందన్న ఆందోళన కనిపిస్తోంది.

## ఒక్కసారిగా... పెరిగిన భక్తజనం

**మెరుపు వేగంతో అప్రమత్తమైన పోలీసులు**

**తానే స్వయంగా రంగంలోకి దిగి క్లిష్ట పరిస్థితిని చక్కదిద్దిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్**

**హైదరాబాద్ పెన్ పవర్:** ములుగు: సంక్రాంతి సెలవుల్లో మేడారం వనదేవతల దర్శనానికి భక్తుజనం భారీగా తరలివచ్చారు. సంక్రాంతి సెలవుల సందర్భంగా అంచనాలకు మించి భారీసంఖ్యలో మేడారం వనదేవతలను దర్శనానికి ఒక్కసారిగా భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. అంచనాలకు మించి భక్తజనం మేడారం బాట పట్టడంతో, ట్రాఫిక్ తోనూ, దర్శన సమయంలోనూ భక్తులు ఇబ్బంది పడే ప్రమాదాన్ని ముందే పసిగట్టిన ములుగు జిల్లా ఎస్ పి సుధీర్ రాంనాథ్ కేకన్ తానే స్వయంగా రంగంలోకి దిగారు.భక్తుల రద్దీ నియంత్రణ కోసం యాక్సెస్ కంట్రోల్, క్యూలైన్ నిర్వహణ వంటి చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంతో భక్తులు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకున్నారు. మేడారానికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నిర్వహణ కోసం 300 మందికిపైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. సరైన డైవర్షన్
ప్లాన్ అమలు చేయడంతో ఎక్కడా వాహనాల రద్దీ లేకుండా సజావుగా ట్రాఫిక్ కొనసాగింది. ఈ బందోబస్తో మొత్తం 600 మందికిపైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో ఓఎస్డీ ములుగు శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్, అదనపు ఎస్పీ ఏఆర్ సదానందం, డీఎస్పీ ములుగు రవీందర్, ములుగు, భూపాలపల్లి, కరీంనగర్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఏసీపీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ గా పగుడాకుల బాలస్వామి

**హైదరాబాద్ పెన్ పవర్:** విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ గా పగుడాకుల బాలస్వామి నియమితులయ్యారు. ఇటీవల జరిగిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో స్వామీజీల సమన్వయం కోసం ధర్మాచార్య బాధ్యతలను బాలస్వామికి అప్పగించారు. ఈ సందర్భంగా శనివారం పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సాధూ సంతులను సమన్వయం చేస్తూ.. ధర్మ రక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు. మఠాలు, పీఠాలు, స్వామీజీల ఆశ్రమాలు, దేవాలయాల కేంద్రంగా హిందుత్వం సజీవంగా ముందుకు సాగేలా పనిచేస్తామన్నారు. కులాల మధ్య అంతరాలను చెరిపి, హిందూ సమాజమంతా ఒకటేనన్న భావన తీసుకువస్తామన్నారు. స్వామీజీల కేంద్రంగా హిందూ ధర్మ రక్షణ కోసం పాటుపడతామన్నారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని సమాజానికి తెలియజేసి, ధర్మ వ్యాప్తి కోసం నిరంతరం పనిచేస్తామని వివరించారు. తెలిసీ తెలియక మతం మారిన వారిని తిరిగి స్వధర్మం లోకి తీసుకువస్తామని చెప్పారు. సాధూసంతుల మార్గదర్శనంలో ధార్మిక సదస్సులు ఏర్పాటు చేసి, హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తామన్నారు. దేవాలయాలపై, సాధూసంతులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు పోరాటం చేస్తామని బాలస్వామి అన్నారు. హిందుత్వం బలపడితేనే భారతదేశం నిలబడుతుందని.. ప్రతి హిందువు సంఘటితం కావాలని ఆయన అభిప్రాయపడ్డారు.
బౌద్ధ, జైన,సిక్కు తదితర ధర్మాలకు చెందిన వారిని కూడా సమన్వయం చేస్తూ.. ధర్మ కార్యంలో ముందుకు సాగుతామని ఆయన అన్నారు.

# అభాగ్యనగరం... వామ్మో... కాలుష్యం...

**హైదరాబాద్, జనవరి 17, పెన్ పవర్:**
సంక్రాంతి పండు గకు సొంతూళ్లకు వెళ్లారు.. హైదరాబాద్ నగరం సగం ఖాళీ అయ్యింది.. రోడ్లపై ట్రా ఫిక్ తగ్గింది.. సిటీ బస్సులు, మెట్రో రైళ్లు సగం ఖాళీగానే కనిపిస్తున్నాయి. అస లే చలికాలం. వాహనాలు వదిలే పొగతో ముక్కులకు మాస్కులు ధరించి, బతుకుజీవుడా అంటూ ఇంటికి చేరే నగరవాసులకు ఈ నాలుగు రోజులు పండగే. పండుగ, పబ్బం లేనిరోజుల్లో అటు వాహనాల రద్దీ, ఇటు కాలుష్యంతో పొగచూరుతున్న నగ రం కూడా త్వరలోనే కాలుష్యంలో ఢిల్లీ స్థాయికి 'ఎదుగుతున్నదా' అనే ప్రశ్న అందరిని వెంటాడుతున్నది. ఢిల్లీలో రియల్ టైమ్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 400 దాటింది. 'ప్రమాదకర' విభాగంలోకి ప్రవేశించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం ఢిల్లీలో ఏఐక్యూ 411గా న మోదైంది. –ఇది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను కలిగించే స్థాయి కావడం గమ నార్హం. హైదరాబాద్ ఇప్పటికీ ఆ తీవ్రస్థాయికి చేరలేదు గానీ, నగరంలో క్రమంగా దిగజారుతున్న గాలి నాణ్యతను నిర్లక్ష్యం చేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే, హైదరాబాద్ కూడా అదే పరిస్థితిని ఎదుర్కొనే ప్రమా దం ఉందని వారు చెబుతున్నారు.హైదరాబాద్‌లో పరిశ్రమలు నగరమంతటా చెల్లాచెదురుగా విస్తరించి ఉన్నాయి. ఇది వ్యవస్థీకృత పరిశ్రమల జోనింగ్ సూత్రాలను ఉల్లంఘిస్తోంది. నగర విస్తరణ సమయంలో శాస్త్రీ య విశ్లేషణలు, పౌర సంప్రదింపులు ఎక్కువగా లేకపోయాయి. ఒకప్పుడు హైదరా బాద్‌లో మూసారాంబాగ్ వంటి చారిత్రక 'బాగ్‌లు', అనేక చెరువులు ఉండేవి. కానీ అవి కనుమరుగవడం గాలి నాణ్యతపై నే రుగా ప్రభావం చూపింది. ప్రజా రవాణా ఇప్పటికీ విశ్వసనీయంగా లేకపోవడం, అం దుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడాల్సి రావడం మరో ప్రధాన కారణం.'హైదరాబాద్‌లో ఇప్పుడు ద్విచక్ర, త్రిచక్ర వాహనాల సాంద్రత అత్యధికంగా ఉంది. ఏటా లక్షల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి, దీనివల్ల ఉద్గారాలు గణనీయం గా పెరుగుతున్నాయ'ని ఒక పౌరుడు తెలిపారు. ప్రణాళిక లేని పరిశ్రమల అభివృద్ధి, ముఖ్యంగా రసాయన, ఔషధ పరిశ్రమలు, కాలుష్య భారాన్ని మరింత పెంచుతూ హైదరాబాద్ గాలిని రసాయనపరంగా మరింత విషపూరితంగా మారుస్తున్నాయి. కాలుష్యానికి మరో ప్రధాన కారణం హైదరాబాద్‌లో శాస్త్రీయ పట్టణ ఘన వ్యర్థాల నిర్వహణ లేకపోవడమే. 'చెత్తను తరచుగా కాల్చడం లేదా రోడ్ల పక్కన పడేయడం జరుగుతోంది. భారీ చెత్త కొండలు ఏర్పడి, జవహర్‌నగర్ వంటి ప్రాంతాలు డంపింగ్ యార్డులుగా మారా



యి.ఇది పౌరులూ, జీహెచ్ఎంసీ రెండింటికీ చెందిన వైఫల్యం' అని ఆయన వివరించారు. అత్యంత కీలకమైన చివరి అంశం పౌర స్ఫూర్తి అని ప్రొఫెసర్ రెడ్డి పేర్కొన్నారు. గాలిలో నూ, నీటిలోనూ మైక్రో ప్లాస్టిక్స్ ఉన్నాయని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణను రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) తప్పనిసరిగా పేర్కొన్నప్పటికీ, పౌరులు పర్యావరణా న్ని దెబ్బతీసే ఆచారాలను కొనసాగిస్తూనే ఉన్నారని ఆయన విమర్శించారు. స్థిరమైన ప్రణాళికలు అమలు చేయడానికి ప్రత్యేక రాష్ట్ర పర్యావరణ అభివృద్ధి కమిషన్ ఏర్పా టు చేయాలని పిలుపునిచ్చారు. మునిసిపల్ వ్యవస్థపై మరింత బలమైన బాధ్యత నిర్ధారణ అవసరమని డిమాండ్ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త శరత్ కుమార్ హైదరాబాద్‌లో కాలుష్యం ఉందని అంగీకరించినప్పటికీ, అది ఢిల్లీ స్థాయికి చేరదని అన్నారు. 'ఏఐక్యూను అర్థం చేసుకోవడంలో చాలాసార్లు గందరగోళం ఏర్పడుతుంది. మనకు 50–100 మంచి స్థాయి, 100–200 సంతృప్తికర స్థాయి. ఢిల్లీ ఏఐక్యూ గణాంకాలు జాతీయ సగటుగా తీసుకోవడం వల్ల అవి తరచూ తప్పుగా అర్థం చేసుకోవాల్సి వస్తుంద'ని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో ఏఐక్యూ ప్రాంతానికి, ప్రాంతానికి చాలా తేడా ఉంటుందని, సనత్‌నగర్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో స్థానిక పరిస్థితుల ఆధారంగా మారుతుందని చెప్పారు. వాతావరణ పరిస్థితులు కూడా కొన్నిసార్లు కాలుష్యాన్ని తాత్కాలికంగా పెంచుతాయని తెలిపారు.ఐఐటీ కాన్పూర్‌తో కలిసి దాదాపు రూ.1 కోటి వ్యయంతో నిర్వహించిన సోర్స్ అపోర్షన్‌మెంట్ అధ్యయనం ప్రకారం రోడ్డు ధూళి 27--30 శాతం, వాహనాలు మరో 20--30 శాతం, పరిశ్రమలు సుమారు 15 శాతం కాలుష్యానికి కారణమని వెల్లడైంది. ప్రస్తుతం దాదాపు 500 అనుబంధ పరిశ్రమలను కవర్ చేసే కార్యాచరణ ప్రణాళిక అమల్లో ఉందని ఆయన తెలిపారు. ఇందులో ఆకస్మిక తనిఖీలు, వాహనాల పర్యవేక్షణ, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం, చార్జింగ్ మౌలిక వసతుల విస్తరణ, మొక్కల నాట్లు, రియల్‌టైమ్ గాలి నాణ్యత పర్యవేక్షణ వంటి చర్యలు ఉన్నాయి. 'మన అవగాహన, చర్యలే కీలకం. ఉల్లంఘనలను అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత అవసరమ'ని శరత్ కుమార్ అన్నారు.ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కే పురుషోత్తం రెడ్డి ఒక కఠిన హెచ్చరిక జారీ చేస్తూ హైదరాబాద్ నిజంగానే ఢిల్లీ దిశగా కదులుతోందని అన్నారు. ఢిల్లీ భౌగోళిక పరిస్థితులు అక్కడి కాలుష్యాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయని ఆయన వివరించారు. హిమాలయాలు, ఉత్తర పర్వత శ్రేణులు గోడలా నిలిచి, గాలిని అడ్డుకుంటాయని, దాంతో ధూళి అక్కడే చిక్కుకుపోతుందని చెప్పారు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే ధూళి, థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుకతో కలిసిపోయి, సూక్ష్మ కణాలను పెంచి గాలిని అత్యంత విషపూరితంగా మారుస్తోందని ఆయన అన్నారు.ఢిల్లీ అభివృద్ధిని ప్రణాళిక చేయడంలో పర్యావరణ పరిమితులను పర్యావరణ మంత్రిత్వ శాఖ చాలా ముందే పరిగణనలోకి తీసుకోవాల్సింద'ని ఆయన తెలిపారు. భారత ప్రభుత్వం అప్పుడప్పుడు మాత్రమే జాతీయ పట్టణీకరణ కమిషన్లను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు. 'వారు మూడు లేదా నాలుగు సిఫారసులు చేశారు గానీ, ప్రకృతి పరిమితులను ఎప్పుడూ గంభీరంగా పరిగణించలేద' అని ఆయన అన్నారు.

# మూసీ ప్రక్షాళనకు టీడీఆర్

**హైదరాబాద్, జనవరి 17, పెన్ పవర్:**
హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణలో ఒక కొత్త అధ్యాయానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగరం చుట్టూ ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు, నదుల పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ రెడ్డి సర్కారు అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు తీసుకొచ్చిన రూల్స్ వల్ల చెరువుల సంరక్షణతోపాటు ప్రతిష్టాత్మకంగా భావించే మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో కదలిక రానుంది. టీడీఆర్‌లో మార్పులు చేర్పులు కేవలం ఆక్రమణ తొలగింపు మాత్రమే కాకుండా భూమిని కోల్పోయే పట్టాదారులకు ఊరట కల్పించేలా ఉన్నాయి.
తెలంగాణ పురపాలక శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 16 ద్వారా భవన నిర్మాణ నిబంధనలు –2012లో కీలక సవరణలు చేసింది. సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ ఆదేశాలతో జలాశయాల పరిరక్షణకు ఈ నిర్ణయం తీసుకుంది. చెరువుల ఎఫ్టీఎల్, నదుల ఎంఎఫ్ఎల్, బఫర్ జోన్‌లలో ఉన్న పట్టా భూములను స్వాధీనం చేసుకునే క్రమంలో భూ యజమానులకు భారీగా నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా టీడీఆర్‌ను ఇవ్వబోతోంది. ఈ సవరణలు కేవలం నోటిఫైడ్ ప్రాజెక్టులకు, అంటే హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి సంస్థలు చేపట్టే పనులకు మాత్రమే వర్తిస్తాయి. ఇది తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్ల వరకు అంటే ఔటర్ రింగ్ రోడ్డు వరకు అమలులోకి రానుంది. గతంలో ఉన్న టీడీఆర్ నిబంధనలను ప్రభుత్వం మరింత వెసులుబాటు కల్పించింది. స్వచ్ఛందంగా భూమిని అప్పగించే వారికి ప్రోత్సాహకాలు పెంచింది. ఇప్పుడు విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం పరిహారం మార్చింది. చెరువుల పూర్తి స్థాయి ఖీూ, వీఖీూ పరిధిలో ఉన్న భూములకు, ఆ యజమాని వదులుకున్న నిర్మిత విస్తీర్ణానికి ఏకంగా 200 శాతం టీడీఆర్ మంజూరు చేస్తారు. చెరువులు లేదా నదుల బఫర్ జోన్‌లలో ఉన్న భూములను అప్పగిస్తే 300 శాతం టీడీఆర్ లభిస్తుంది. జవనరుల అభివృద్ధి, రహదారి విస్తరణ లేదా బఫర్ జోన్ వెలుపలి భూములను ప్రభుత్వం సేకరించాల్సి వస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వనున్నారు. ప్రైవేటు భూముల్లో నాలా విస్తరణ చేపడితే, రోడ్డు విస్తరణకు ఇచ్చే విధంగా 400 శాతం



టీడీఆర్ వర్తింపజేస్తారు. దీని వల్ల నిర్వాసితులు ప్రభుత్వం నుంచి నగదు కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. టీడీఆర్ సర్టిఫికెట్ల ద్వారా మార్కెట్‌లో మంచి లాభం పొందే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 10వేల కోట్లకుపైగా విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. దీని వల్ల మార్కెట్‌లో వాటి సరఫరా పెరిగింది. దీంతో డిమాండ్ పడిపోయింది. దీని వల్ల భూ యజమానులు టీడీఆర్ తీసుకోవడానికి అంగీకరించడం లేదు. కేవలం నగదు రూపంలోనే పరిహారం అడుగుతున్నారు. అందుకే రూల్స్ మార్చిన ప్రభుత్వం ఈ ఇబ్బందిని అధిగమించాలని చూస్తోంది. అందుకే బిల్డర్స్‌కు కొన్ని రూల్స్ పెట్టింది. హైదరాబాద్‌లో పది అంతస్తులకు మించిన భవనాలు నిర్మిస్తే టీడీఆర్ వినియోగించుకోవాలి. అంటే 11 అంతస్తు నుంచి నిర్మించే ప్రతి ఫ్లోర్‌కు చదరపు అడుగు విస్తీర్ణంలో పది శాతానకకి సమానమైన టీడీఆర్ కచ్చితంగా కొనుగోలు చేయాలి. ఈ రూల్ వల్ల మార్కెట్‌లో టీడీఆర్‌కు ఒక్కసారిగా డిమాండ్ పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. టీడీఆర్‌లు చెల్లుబాటు అవుతాయని ప్రజలకు మేలు జరుగుతుందని అంచనా వేస్తున్నారు. టీడీఆర్ జారీ ప్రక్రియలో ఎటువంటి అక్రమాలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వ కఠినమైన రూల్స్ పెట్టింది. టీడీఆర్ ఇచ్చే ముందు ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారుల నుంచి తప్పనిసరిగా క్లియరెన్స్ తీసుకోవాలి. భూ యజమాని అందుబాటులో లేకపోయినా లేదా టైటిల్ వివాదాలు ఉన్నా ఆ టీడీఆర్‌ను టీడీఆర్ బ్యాంకులో జమ చేస్తారు. వివాదం పరిష్కారమైన తర్వాత అసలు ఓనర్‌కు అప్పగిస్తారు. ఒక ఎకరం కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూములకు టీడీఆర్ ఇవ్వాలంటే ముందస్తుగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. భూమిని ఉచితంగా ప్రభుత్వానికి అప్పగించే సంస్థలకు మరిన్ని ఆఫర్లు ప్రకటించింది ప్రభుత్వం. వారు తమ ప్రాజెక్టులో సెట్ బ్యాక్‌ల సడలింపు ఉంటుంది. అదనపు అంతస్తుల నిర్మాణం, అదనపు నిర్మిత విస్తీర్ణంలో వెసులుబాటు పొందవచ్చు. ఏ నిబంధన అయినా సరే ఫైర్, ఎయిర్‌పోర్టు అథారిటీ రూల్స్‌కు అనుగుణంగానే ఉంటుంది.

# వ్యూహాత్మక మౌనమే పరిష్కారమా

**హైదరాబాద్, జనవరి 17, పెన్ పవర్:**
ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరగడం సహజం, ప్రజలు క్షమించడానికి సమయం పడుతుంది. తర్వాతి ఎన్నికల్లో ప్రజలే భవిష్యత్‌ను నిర్ణయిస్తారు. కానీ పదేళ్ల అధికారంతో తెలంగాణ చాంపియన్‌లుగా ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్‌ను 2023 ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉంది. రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత లేదు. హామీలు అమలు చేయకపోయినా విపక్షాల నుంచి తప్ప ప్రజల నుంచి విమర్శలు రావడం లేదు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే రేవంత్ సర్కార్‌ను నిత్యం టార్గెట్ చేస్తున్నారు. దీంతో విశ్లేషకులు నేతలకు ఓపిక ఉండాలని సూచిస్తున్నారుకేటీఆర్ ప్రతీ మాట సామాన్యుడి మనసులో కౌంటర్‌గా మారుతోంది. ఇది తన మాటల విలువను తగ్గిస్తూ, పార్టీకి నష్టం కలిగిస్తోంది. రేవంత్‌పై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ కేటీఆర్ స్వయం పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నారు.
గత అధికార కాలంలోని తప్పులు గుర్తుంచుకోకుండా విమర్శిస్తుండడంతో ప్రజలు పెద్దగా కనెక్ట్ కావడం లేదు.తాజా పార్టీ మార్పులపై కేటీఆర్ వ్యాఖ్యలు గతాన్ని గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉంటూ ప్రతిపక్షాలను అణచివేసి, తెలంగాణ పోరాటకారులను దూరం చేసి, కొత్తలకు పదవులు పంచారు. ఇప్పుడు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేస్తున్నారు. స్పీకర్ ఆధారాలు లేవని ప్రకటించినా, కేటీఆర్ సోషల్ మీడియాలో రాజ్యాంగ విలువలను ప్రశ్నిస్తున్నారు. అప్పటి ఫిరాయింపులు 'బంగారు తెలంగాణ' పేరుతో జరిగాయని ప్రజలు మరువలేదు కేటీఆర్.ప్రస్తత పరిణామాల్లో మౌనం చాలా మంచిది. ప్రజలకు ఆలోచనకు సమయం ఇవ్వాలి. గత తప్పులకు
పశ్చాత్తాపం చెంది, భవిష్యత్తులో అవి జరగకుండా హామీ ఇవ్వాలి. పడిగట్టు మాటలు, నాన్ స్టాప్ విమర్శలు ప్రజల మద్దతు ఆకర్షించవు. కేటీఆర్ దీన్ని గుర్తించి వ్యూహం మార్చితే పార్టీకి లాభం.అధికారంలో ఉంటూ అందరినీ 'గులాబీ కారు'లో ఎక్కించిన గతం ప్రజల మనసుల్లో ఉంది. ఇప్పుడు విమర్శలు చేసినా, స్వీయ పరిశీలన లేకపోవడం వల్ల ప్రజలు దూరమవుతున్నారు. తగిన సమయం కోసం వేచి ఉండి.. ప్రజల్లో వ్యతిరేకత వచ్చిన తర్వాత స్పందిస్తే ప్రజల మద్దతు లభిస్తుంది.

## ములకలపల్లి: క్రీడా జ్యోతితో ర్యాలీ

**అశ్వారావుపేట, జనవరి 17 పెన్ పవర్:** ములకలపల్లిలో సీఎం కప్ క్రీడల ప్రచారం ఉత్సాహంగా ప్రారంభమైంది. సర్పంచ్ కొర్సా చంద్రలేఖ క్రీడా జ్యోతిని వెలిగించి ఈ ప్రచార ర్యాలీని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ప్రచార ర్యాలీ ప్రభుత్వ పాఠశాల నుంచి పాత పోలీస్ స్టేషన్ వరకు సాగింది. ఈ ర్యాలీలో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రామయ్య సన్నిధి భక్తులతో కిక్కిరిసిపోయింది

**భద్రాచలం, జనవరి 17 పెన్ పవర్:** భద్రాచలం రామయ్య సన్నిధి శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు.

## సీఎం కప్ 2వ ఎడిషన్ దమ్మపేటలో ఘనంగా ప్రారంభం

**కొత్తగూడెం, జనవరి 17 పెన్ పవర్:** దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో సీఎం కప్ 2వ ఎడిషన్ ఈరోజు ప్రారంభమైంది. నాగుపల్లి పంచాయతీ సెక్రటరీ కొండ్రు నాగేంద్ర బాబు, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ కుంపిటి వేణు, జిఖూూ స్కూల్ ఊఓ సరళ, స్కూల్ స్టాఫ్, కొత్తగూడెం జిల్లా అత్యంత పాత్య సెక్రటరీ బొబ్బిలి నాగశివాజీ, నునవత్ రాములు, శ్రీకాంత్, భరత్, అభి, సాగర్, గణేష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూరల్ నుండి నేషనల్ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని, పంచాయతీ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు గ్రామానికి మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## అర్ధరాత్రి అదృశ్యమైన వృద్ధుడు, ఆచూకీ కోసం కుటుంబ సభ్యుల ఆందోళన

**ఇల్లందు, జనవరి 17 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలం చిన్నబండి రేవు గ్రామానికి చెందిన తంతరపల్లి నరసయ్య (60) అర్ధరాత్రి నుండి అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, రాత్రి భార్యతో కలిసి నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయారు. తెల్ల బనియన్, కండువా ధరించి ఉన్నట్లు తెలిపారు. గతంలో కూడా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన సందర్భాలున్నాయని పేర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.

## భార్యపిల్లలు దూరమై.. మనస్తాపంతో ఆత్మహత్య

**పినపాక, జనవరి 17 పెన్ పవర్:** ఇంట్లో వంటగ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో ఇద్దరు కవల కుమారులు, ఆత్మహత్యకు పాల్పడి భార్య మృతి చెందటంతో మనస్తాపం చెంది ఖమ్మం జిల్లా తల్లాడ మండల మిట్టపల్లి గ్రామంలో ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిట్టపల్లికి చెందిన గుత్తికొండ వినోద్‌కుమార్(36) ఈనెల 7న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఆపస్మారక స్థితిలో ఉన్న వినోద్‌కుమార్‌ను స్థానికులు ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గత ఏడాది ఏప్రిల్ 28న వినోద్‌కుమార్ ఇంట్లో వంటగ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో వినోద్‌కుమార్–రేవతి దంపతుల కవల కుమారులు వరుణ్–తరుణ్ ఇద్దరు మృతి చెందారు. ఇద్దరు కుమారులు మృతి చెందినప్పటి నుంచి భార్య రేవతి బెంగతో బాధపడుతూ ఈనెల 1న ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి వినోద్‌కుమార్ కూడా మనస్తాపానికి గురయ్యాడు.

## నల్లబెల్లి గ్రామ అభివృద్ధికి అందరూ తోడ్పడాలి:

**నర్సంపేట, జనవరి 17 పెన్ పవర్:** నల్లబెల్లి గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని మహేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ాఖీూఖ భూముల ఆక్రమణ అంశంపై స్పందించి, కబ్జాలకు అడ్డుకట్ట వేయడానికి సహకరించాలని కోరారు. నల్లబెల్లి గ్రామం మాజీ ఎమ్మెల్యే సొంత గ్రామం కావడంతో, గ్రామ అభివృద్ధి పనులకు ఆయన సహకారం మరింత అవసరమని పేర్కొన్నారు. గ్రామ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

## రేవూరి కళ్యాణ లక్ష్మి చేతుల మీదుగా షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**భూపాలపల్లి, జనవరి 17 పెన్ పవర్:**



పరకాల పట్టణంలో శనివారం ఎమ్మెల్యే రేవూరి కళ్యాణ లక్ష్మి తన క్యాంప్ కార్యాలయంలో షాది ముబారక్ పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రశంసించారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా చెక్కులు అందించినందుకు ఎమ్మెల్యే రేవూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ట్రస్ట్ బోర్డ్ ఏర్పాటు

**ములుగు, జనవరి 17 పెన్ పవర్:** ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర కోసం ట్రస్ట్ బోర్డ్ ను ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇర్ప సుకన్య సునీల్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గా, 15 మంది డైరెక్టర్లుగా నియమితులయ్యారు. ఎండోమెంట్ అధికారి వీరస్వామి ట్రస్ట్ బోర్డ్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాలు జరిగేలా చూడాలని సభ్యులకు సూచించారు.

## వర్ధన్నపేటలో వంద పడకల ఆస్పత్రి కోసం రిలే నిరాహార దీక్షలు

**నర్సంపేట, జనవరి 17 పెన్ పవర్:** వర్ధన్నపేట పట్టణంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని స్థానిక ఆస్పత్రి సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సాధన కమిటీ నాయకులు మాట్లాడుతూ, వర్ధన్నపేటకు వంద పడకల సామర్థ్యం గల ఆస్పత్రి అవసరమని, ప్రస్తుత వైద్య సదుపాయాలు ప్రజల అవసరాలను తీర్చడం లేదని, ప్రభుత్వం ఈ విషయంలో త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## జనగామ మున్సిపల్ వార్డులకు రిజర్వేషన్లు ఖరారు

**పరకాల, జనవరి 17 పెన్ పవర్:** జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో 30 మున్సిపల్ వార్డులకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్టీ జనరల్, ఎస్సీ మహిళ, ఎస్సీ జనరల్, బీసీ మహిళ, బీసీ జనరల్, జనరల్ మహిళా, జనరల్ కేటగిరీల వారీగా వార్డుల కేటాయింపులు ఖరారు చేయబడ్డాయి. ఈ రిజర్వేషన్ల ప్రక్రియ జనగామలో జరిగింది.

## ఆటో టైర్ పేలిపోయి ప్రమాదం.. మహిళ మృతి

**ములుగు, జనవరి 17 పెన్ పవర్:** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటో టైర్ పేలడంతో ఈ దుర్ఘటన జరిగింది. అందులో తొమ్మిది మంది ప్రయాణిస్తుండగా ఒక మహిళ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలు కాగా 108 సిబ్బంది వారిని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారు మహబూబాబాద్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తూరు గ్రామస్థులని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కన్నెపల్లిలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో:

# ఒకరికి తీవ్ర గాయాలు

**బెల్లంపల్లి, జనవరి 17 పెన్ పవర్:** కన్నెపల్లి మండలంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలవగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయపడిన వారిని చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ఇటీబీపీలో ఉద్యోగం:

## యువతకు స్ఫూర్తిగా నిలిచిన చిరుత హరీష్, రాము



**మంచిర్యాల, జనవరి 17 పెన్ పవర్:** ఇటీబీపీ పారామిలిటరీ బలగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన చిరుత హరీష్ (నంబాల), గడికొప్పుల రాము(వెల్గనూర్) లను శనివారం దండేపల్లి మాజీ వైస్ యంపిపి ఆకుల రాజేందర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి యువత క్రమశిక్షణతో కూడిన దేశభక్తిని పెంపొందించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి యువత తమ జన్మభూమి కోసం, దేశం కోసం, సనాతన ధర్మం కోసం పాటుపడుతూ సాయుధ బలగాల్లో చేరేందుకు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, నాయకులు మాడ దయాకర్, దావూద్ ఖాన్, ఎర్రం మల్లేష్, కంది రవి, లక్కాకుల రాజశేఖర్, అలిశెట్టి భాస్కర్, చెరుకు మినేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు అర్లి యువత తరలింపు

**కొమరంభీం, జనవరి 17 పెన్ పవర్:** ఆసిఫాబాద్‌లోని అర్లి గ్రామానికి చెందిన యువత మేడారం జాతరకు బయలుదేరారు. కోట్లాది మంది భక్తులు సమ్మక్క, సారలమ్మ దేవతలను దర్శించుకోవడానికి, మొక్కులు తీర్చుకోవడానికి, సంప్రదాయాలను పాటించడానికి, వన దేవతలను పూజించడానికి వివిధ ప్రాంతాల నుండి తరలి వెళ్తున్నారు. యువత స్వచ్ఛందంగా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించడానికి, జాతర ఏర్పాట్లలో సహాయం చేయడానికి కూడా బయలుదేరుతున్నారు. మేడారం జాతరకు ముందుగానే భక్తులు భారీగా ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సమ్మక్క, సారలమ్మకు మొక్కులు చెల్లించేందుకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వేలాదిగా వెళ్తున్నారు.

## నూతన సర్పంచ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు, అభివృద్ధికి పిలుపు

**ఆసిఫాబాద్, జనవరి 17 పెన్ పవర్:** ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్‌ను శనివారం రెబ్బేన మండలంలోని తుంగెడ గ్రామ పంచాయతీ నూతన సర్పంచ్ పలగని బుచ్చక్కా?పర్వతాలు, ఉప సర్పంచ్ డోంగ్రి రాజశేఖర్‌తో పాటు వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, ఇతర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అజ్మీరా శ్యామ్ నాయక్ నూతన ప్రజా ప్రతినిధులను శాలువాలతో సత్కరించి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కలిసి పనిచేయాలని సూచించారు.

## కోనప్పకు మా పూర్తి మద్దతు: మాజీ ఎంపీటీసీ శిరీష

**చెన్నూరు, జనవరి 17 పెన్ పవర్:** కౌటాల మండల కేంద్రంలో కోనేరు కోనప్పను కలిసిన కౌటాల మాజీ ఎంపిటిసి బసర్కర్ శిరీష, స్థానిక నాయకులు తమ సంపూర్ణ మద్దతు ఆయనకే ఉంటుందని, తమ రాజకీయ జీవితం కోనప్పతోనే కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ కార్యకర్తలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానని, కొత్త పాత తేడా లేకుండా అందరూ తన దృష్టిలో ఒకటేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌటాల సర్పంచ్ నక్క శంకర్, గోపాల్, ఆత్మరామ్, ఎమాజీ, ముత్తయ్య, హనుమంతు, మారుతి, మనీష్, వసంతరావు, మధుకర్, తిరుపతి, బాపు, ప్రభాకర్ గౌడ్, సంతోష్, వాయు కుమార్, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన, వ్యాస రచన పోటీలు

**మంథని, జనవరి 17 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లా మంథనిలోని కాకతీయ హైస్కూల్‌లో శనివారం మంథని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాటిని తమ తల్లిదండ్రులకు కూడా తెలియపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దులికట్టలో టీ10 టోర్నమెంట్:

## వంశీ జట్టు విజేత, రూ. 5016 నగదు బహుమతి

**పెద్దపల్లి, జనవరి 17 పెన్ పవర్:** దులికట్ట గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బిరియాని సెంటర్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి టీ10 టోర్నమెంట్ నిర్వహించారు. ఏడు జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో వంశీ కెప్టెన్సీలోని జట్టు విజేతగా నిలిచింది. బెస్ట్ బౌలర్‌గా శివరాం, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఓదెల యాదవ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సందనవేణి నరేష్ యాదవ్ ఎంపికయ్యారు. విజేత జట్టుకు గ్రామ సర్పంచ్ మారం కొమురయ్య ట్రోఫీని అందజేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బిర్యాని సెంటర్ ప్రొప్రైటర్ భూసారపు తిలక్ గౌడ్ విజేత జట్టుకు రూ. 5016/- నగదు బహుమతిని అందించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని సర్పంచ్ సూచించారు.

## విద్యార్థి దశ నుంచే క్రీడలకు ప్రోత్సాహం

**వేములవాడ, జనవరి 17 పెన్ పవర్:** విద్యార్థి దశ నుంచే క్రీడలకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం సీఎం కప్ టార్చ్ ర్యాలీని ఆయన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి ప్రారంభించారు. ఒలింపిక్స్ లో దేశం నుంచి ఎక్కువ సంఖ్యలో పతకాలు సాధించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని, సీఎం కప్ ద్వారా గ్రామ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహిస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి షెడ్యూల్ ప్రకారం వివిధ క్రీడల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

## జిల్లెల్ల క్రికెట్ టోర్నీ:

## రన్నరప్‌కు రూ.5000 బహుమతి

**సిరిసిల్ల, జనవరి 17 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగడపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం సెమీ ఫైనల్ మ్యాచ్‌ను వార్డు మెంబర్ ఎర్ర సుమన్ టాస్ వేసి ప్రారంభించారు. క్రీడలు యువతలో ఐక్యతను పెంచుతాయని, గ్రామీణ క్రీడాకారులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఫైనల్‌లో నిలిచే రన్నరప్ జట్టుకు తన వంతుగా రూ.5000 నగదు బహుమతిని సుమన్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ యువత పాల్గొన్నారు.

# ముంబై తరహాలో విశాఖ నగరం

**విశాఖపట్టణం జనవరి 17, పెన్ పవర్:** సాగరతీరం విశాఖపట్నం అభివృద్ధి మీద ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగా ముంబై తరహాలో విశాఖ నగరాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఏపీ నుంచి అధికారుల బృందం ముంబైలో పర్యటించింది. సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ విధానాలను అధ్యయనం చేసింది. ఆ విధానాలను ఇక్కడ అమలు చేసేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించనున్నారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖపట్నం రూపురేఖలు త్వరలోనే మారిపోనున్నాయి. ముంబై తరహాలో విశాఖపట్నాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన నేషనల్ గ్రోత్ హబ్‌లో భాగంగా, విశాఖపట్నాన్ని గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం ముంబైలో విజవంతమైన సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ , ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహా విధానాలను ఏపీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.మరోవైపు విశాఖ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద.. కైలాసగిరి, భీమిలి మధ్య బే సిటీని అభివృద్ధి చేయాలని నీతి ఆయోగ్ సూచించింది. విశాఖపట్నం 2.0ను భోగాపురం విమానాశ్రయం వరకు విస్తరించాలని, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం చుట్టూ ఏరోసిటీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడానికి.. ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం జనవరి 12, 13 తేదీలలో పట్టణ అభివృద్ధి నమూనాలను అధ్యయనం చేయడానికి ముంబైని సందర్శించింది. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వంపై ఆధారపడకుండా ల్యాండ్ మానిటైజేషన్, ఖీూ× ప్రీమియంల ద్వారా నిధులు ఎలా సమకూర్చుకోవాలో వీరు అధ్యయనం చేశారు.ఈ సందర్శనలో భాగంగా సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆర్థికంగా స్వయం సమృద్ధిని ఎలా సాధించాయనే దానిపై అధ్యయనం జరిపారు. అలాగే ప్రతిపాదిత భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ 2.0 ప్రాజెక్టులకు బెంచ్‌మార్క్‌లుగా జ×ణజూ నవీ ముంబై, (నవీ ముంబై ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ నోటిఫైడ్ ఏరియా) నమూనాలను అధ్యయనం చేశారు. మరోవైపు ప్రస్తుతం దాదాపు రూ. 14,000 కోట్ల వార్షిక బడ్జెట్‌తో పనిచేస్తుంది, ఎక్కువగా భూమి, రియల్ ఎస్టేట్ ఆధారిత ఆదాయాల ద్వారా నిధులు సమకూరుస్తుంది.మరోవైపు నీతి ఆయోగ్ ఇటీవల డెవలపింగ్ విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ యాజ్ గ్లోబల్ ఎకనమిక్ హబ్ అనే పేరుతో నివేదికను విడుదల చేసింది, ఈ ఎకనమిక్ రీజియన్.. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకు తొమ్మిది జిల్లాలను కవర్ చేస్తుంది. నీతి ఆయోగ్ నేషనల్ గ్రోత్ హబ్ కార్యక్రమం కింద విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ ఎంపిక చేశారు. మరోవైపు ముంబై నుంచి నేర్చుకున్న వాటి ఆధారంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ల్యాండ్ వాల్యూ క్యాప్చర్, ల్యాండ్ మానిటైజేషన్ పాలసీలను అనుసరించనుంది.

ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్ వైజాగ్ 2.0 ఆలోచన చేస్తున్నారు. దక్షిణాన విశాఖపట్నం ఓడరేవు నుంచి ఉత్తరాన భోగాపురం విమానాశ్రయం వరకు 200-250 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ఆలోచన చేస్తున్నారు. అలాగే వైజాగ్ బే సిటీని 40 చదరపు కిలోమీటర్ల ఇంటిగ్రేటెడ్ కోస్టల్ హబ్‌గా ప్రతిపాదించారు. కైలాసగిరి, భీమిలి మధ్య 25 కి.మీ తీరప్రాంతాన్ని వాటర్‌ఫ్రంట్ నగరంగా మార్చాలని ఆలోచనలు చేస్తున్నారు.మరోవైపు మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురంలోని ఐటీ, డేటా సెంటర్ హబ్‌లు, భోగాపురం ఏరోసిటీ, వైజాగ్ బే సిటీ వంటి ప్రాజెక్టుల ద్వారా విశాఖ రూపురేఖలు మారుతాయని భావిస్తున్నారు.

# స్కిల్ డెవలప్ మెంట్ కేసు.. క్లోజేనా

**విజయవాడ, జనవరి 17, పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబుకు మంచి రోజులు నడుస్తున్నాయి. ఆయన ఎన్ని రకాల ఇబ్బందులు పడ్డారో తెలియనిది కాదు. ఆయన అధికారంలోకి రావడం అసాధ్యం అనుకున్న రీతిలో.. సుసాధ్యం చేసి చూపించారు. కూటమి కట్టి తిరుగులేని విజయం సాధించారు. 164 అసెంబ్లీ సీట్లతో ఘనవిజయం పొందారు. దాదాపు ఏడాదిన్నర పాలనను కూడా పూర్తి చేసుకున్నారు. అయితే ఎప్పుడైతే జగన్మోహన్ రెడ్డి చంద్రబాబును అరెస్టు చేశారో.. అప్పుడే ఆయనకు టర్నింగ్ పాయింట్ అయింది. అది మొదలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ ప్రారంభం అయ్యింది. అయితే అప్పట్లో పెట్టిన కేసులు ఒక్కొక్కటి కూటమి వచ్చాక క్లోజ్ అవుతున్నాయి. అందులో ప్రధానమైన స్కిల్ డెవలప్మెంట్ స్కాం కేసును కూడా ఏసీబీ కోర్టు కొట్టి వేసింది. చంద్రబాబుతో సహా 37 మందిపై విచారణను మూసివేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది.వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో చంద్రబాబు అవినీతి కేసుల్లో అరెస్టయిన సంగతి తెలిసిందే. ప్రధానంగా స్కిల్ డెవలప్మెంట్ పేరిట భారీ కుంభకోణానికి తెర తీసారని అప్పట్లో సిఐడి కేసు నమోదు చేసింది. రూ.371 కోట్లు దుర్వినియోగం చేసినట్లు చూపింది. ఈ కేసుల్లో అప్పటి సీఎం చంద్రబాబును బాధ్యుడిని చేసింది. 2023 సెప్టెంబర్ 9న సిఐడి అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారు. 52 రోజులపాటు చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. 2023 అక్టోబర్ 31న కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు చంద్రబాబు. అటు తరువాత కూడా చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని వైసిపి ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. కానీ చివరకు అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో అప్పట్లో చంద్రబాబుకు పోరాట లభించింది..అయితే అప్పట్లో చంద్రబాబుపై ఒక్క స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసు మాత్రమే కాదు. ఓ ఐదు కేసులను పెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో కేసులో ఆయనకు విముక్తి లభిస్తూ వచ్చింది.

అయితే స్కిల్ స్కామ్ కేసులో సిఐడి సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి ఏసీబీ కోర్టులో తుది నివేదికలు దాఖలు చేసింది. అయితే ఈ కేసులో తీర్పును వెలువరించే ముందు తన వాదనలు వినాలని స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అప్పటి చైర్మన్ అజయ్ రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో వాదనలు కూడా జరిగాయి. అన్ని పక్షాల వాదనలను పరిగణలోకి తీసుకున్న కోర్టు అజయ్ రెడ్డి పిటిషన్ ను కొట్టివేసింది. మిస్టేక్ ఆఫ్ ఫార్ట్ కారణంగా చూపుతూ నిందితులపై విచారణను మూసివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. చంద్రబాబుతో సహా 37 మంది నిందితులకు ఆరోపణల నుంచి విముక్తి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# చికెన్, మటన్ ధరలకు రెక్కలు



**విశాఖపట్టణం జనవరి 17, పెన్ పవర్:** సంక్రాంతి పండుగ వేళ చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గతంలో రూ. 200 ఉన్న చికెన్ ధర.. ప్రస్తుతం రూ. 350 వరకు చేరింది. దీంతో చాలా మంది సీఫుడ్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనుమ పండుగ సందర్భంగా విశాఖ ఫిష్ హార్బర్ జనసంద్రంగా మారింది. చేపలు, రొయ్యలు కొనుగోలు చేయడానికి జనం బారులు తీరారు. తెల్లవారు జామున 5 గంటల నుంచే ఎక్కువ సంఖ్యలో జనం వచ్చారు.సంక్రాంతి పండుగ సందర్భంగా చికెన్ ధర కొండెక్కి కూర్చుంది. కొద్దినెలల క్రితం కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ. 200 ఉండగా.. నెల క్రితం రూ. 220 నుంచి రూ. 250 వరకు చేరింది. డిసెంబర్‌లో క్రిస్మస్ పండుగ నాటికి.. రూ. 270- 280కి చేరింది. ఇక కొత్త సంవత్సరం ప్రారంభంలోనే కోడి మాంసం ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల రూ. 300కు వరకు పెరిగిన చికెన్ రేటు.. పండుగ మొదలయ్యే సరికి రూ. 350 వరకు వెళ్లింది. కాగా, కనుమ పండుగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో చికెన్ రేట్లు పెరిగాయి. విజయవాడలో కిలో స్కిన్ లెస్ చికెన్.. రూ. 350కి చేరింది. హైదరాబాద్‌లో చికెన్ రూ. 300 నుంచి 350 మధ్య ఉంది. అంతేకాకుండా మటన్ కూడా రూ. 1,050గా ఉంది. సాధారణ రోజులతో పోలిస్తే.. పండగ పూట చికెన్, మటన్ రేట్లు పెరిగాయి. దీంతో ప్రజలు సీఫుడ్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ ఫిష్ హార్బర్‌లో.. చేపలు రొయ్యల కోసం ఎక్కువ సంఖ్యలో వచ్చారు.కనుమ సందర్భంగా విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ జనసంద్రంగా మారింది. చేపలు, రొయ్యల కోసం జనం అధిక సంఖ్యలో వచ్చారు. తెల్లవారుజామునే విశాఖ హార్బర్‌కు క్యూ కట్టారు. చేపలు, రొయ్యల కోసం బారులు తీరారు. దీంతో ఫిషింగ్ హార్బర్ మొత్తం నాన్వెజ్ ప్రియలతో నిండిపోయింది. చికెన్ రేట్లు పెరగడంతో.. కొనుగోలు చేయాలన్నా ఆలోచించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో.. చేపలు, రొయ్యలకు డిమాండ్ ఏర్పడింది. సైజును బట్టి బుట్ట రొయ్యలు రూ. 2 వేలకు పైగా ధర పలుకుతోంది. అయితే ఇక్కడ కూడా ధరలు ఎక్కువగా చెబుతున్నారని నాన్‌వెజ్ ప్రియులు వాపోతున్నారు.కొన్ని నెలల క్రితం చికెన్‌కు డిమాండ్ సరిగా లేకపోవడంతో పౌల్ట్రీ ఫారాల యజమానులు నష్టాలు చవిచూశారు. దీంతో ఉత్పత్తి తగ్గించారు. ఈ కారణంగానే.. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు సరిపడా సప్లై చేయలేకపోతున్నారు. న్యూఇయర్, సంక్రాంతి పండుగ రావడంతో డిమాండ్ మరింత పెరిగింది. దానికి సరిపడా ఉత్పత్తి లేక కంపెనీలు ధరలు పెంచుతున్నాయి.కాగా, చికెన్ రేటు పెరగడానికి కోళ్లకు వేసే దాణా కూడా కారణమని తెలుస్తోంది. దాణాలో ప్రధానమైన మొక్కజొన్న వంటి పంటల ఉత్పత్తి తగ్గిపోవటంతో.. ధర పెరిగినట్లు సమాచారం. దీనికి తోడు హేచరీస్‌లో కోడి పిల్లకు రూ. 25 నుంచి రూ. 30 ఉన్న ధర.. ప్రస్తుతం రూ. 40గా పైగా పలుకుతోంది. ఇవేకాక పౌల్ట్రీ ఫారాల నిర్వహణ ఖర్చులు కూడా పెరిగడం ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

# పాపం... బాబు..

**తిరుపతి, జనవరి 17, పెన్ పవర్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గ పాలిటిక్స్ సమ్‌థింగ్ స్పెషల్. వైసీపీ మాజీ మంత్రి, ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫ్యామిలీదే అక్కడ హవా. 2009 నుంచి పుంగనూరులో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న పెద్దిరెడ్డి దూకుడుకు బ్రేకులు వేసేందుకు టీడీపీ అనేక ఎత్తులు వేసింది. 2024 ఎన్నికల్లో స్పెషల్‌గా టార్గెట్ చేసినా, ఆయన విజయాన్ని మాత్రం టీడీపీ ఆపలేకపోయిందన్న చర్చ ఉంది. గత ఎలక్షన్స్‌లో పెద్దిరెడ్డి చేతిలో టీడీపీ నేత చల్లా బాబు ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్యేగా ఓడినా..రాష్ట్రంలో అధికారం రావడంతో ఇక తిరుగుండదని భావించారట చల్లా బాబు.ఎన్నో సవాళ్లను ఫేస్ చేస్తూ దాడులు, కేసుల పాలయ్యాయని వాపోతున్నారట. 2023లో టీడీపీ అధినేత చంద్రబాబు పుంగనూరు పర్యటనలో జరిగిన విధ్వంసంలో నమోదైన నాలుగు కేసుల్లో నిందితుడిగా చల్లా బాబు కడప సెంట్రల్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కొంతకాలం అజ్ఞాతంలో ఉండాల్సిన పరిస్థితిని కూడా ఆయన ఎదుర్కొన్నారట. 2024 ఎన్నికల్లో పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పెద్దిరెడ్డిని ఓడించలేక పోయినా..ఆయన మెజారిటీని భారీగా తగ్గించారు చల్లా బాబు. ఇలా ప్రతిపక్షంలో ప్రత్యర్థి పార్టీకి టార్గెట్‌గా మారిన చల్లాబాబుకు ఇప్పుడు అధికారం వచ్చాక ప్రయారిటీ దక్కట్లేదట. పవర్‌లోకి వచ్చిన తొలినాళ్లలో కాస్త దూకుడు ప్రదర్శించి హంగామా చేసినా ఇప్పుడు స్పీడు తగ్గించాల్సి వస్తోందట. ఇందుకు ప్రధాన కారణం సొంత పార్టీలోనే కొందరు ఆయన హడావుడికి అడ్డంకులు సృష్టిస్తున్నారట.పుంగనూరు టీడీపీ ఇంచార్జ్‌గా భారీ కాన్వాయ్‌తో..చల్లా బాబు చేస్తున్న హడావుడిని కొందరు సొంత పార్టీ నేతలే డైజెస్ట్ చేసుకోలేకపోతున్నారట. టీడీపీలోనే ఒక వర్గం ఆయన్ను టార్గెట్ చేసి..హైకమాండ్ దగ్గర ఆయన పరపతిని తగ్గించే ప్రయత్నం చేస్తోందట. ఇది చల్లా బాబుకు ఇబ్బందిగా మారిందంటున్నారు. ఆయన అనుచరుల హడావుడిపైనా అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో చల్లా బాబు పవర్‌కు బ్రేకులు వేసినట్లైందట. దీంతో చల్లాబాబు కూడా దూకుడును తగ్గించారట. జిల్లా ఇంచార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో సన్నిహితంగా ఉంటూ పుంగనూరులో మరింత బలపడాలనుకుంటున్న చల్లాబాబుకు సొంత పార్టీ నేతల పెడుతున్న ఇబ్బందులు హెడెక్‌గా మారాయట.నామినేటెడ్ పదవుల విషయంలో కూడా ఆయన వర్గానికి ఇంపార్టెన్స్ దక్కకపోవడంతో చల్లాబాబు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారట. టీడీపీ అధికారంలోకి వస్తే తమ నాయకుడికి ప్రాధాన్యత ఉంటుందని భావించిన చల్లా అనుచరులు, టీడీపీ క్యాడర్ కూడా నిరాశ చెందుతుందట. పుంగునూరులో చల్లా బాబును వ్యతిరేకిస్తున్న ఒక వర్గం..హైకమాండ్‌కు ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తుందట. పుంగనూరులో చల్లాబాబు దూకుడుతో పార్టీ బలపడిందన్న అభిప్రాయం క్యాడర్‌లో ఉన్నా..ఆయనకు దక్కని ప్రాధాన్యత గురించే ఇప్పుడు ఎక్కువుగా చర్చ జరుగుతోందట. దీంతో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ నుంచి, అధికారంలోకి వచ్చాక సొంత పార్టీలోని ఒక వర్గానికి టార్గెట్‌గా మారి చల్లా బాబు పొలిటికల్ ట్రబుల్స్ ఫేస్ చేస్తున్నారట.

# కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం..
# 144 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుక



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రక్షణ రంగ చరిత్రలోనే మరో అతిపెద్ద ఒప్పందానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భారత వైమానిక దళం (ఎంఈ) అమ్ములపొదిలో మరిన్ని అత్యాధునిక 'రాఫెల్' యుద్ధ విమానాలను చేర్చేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేసింది. సుమారు రూ. 3.25 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు ప్రధాన మంత్రి నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. ఈ ఒప్పందంలో భాగంగా మొదటి 12 నుంచి 18 విమానాలను ఫ్రాన్స్ నుంచి నేరుగా దిగుమతి చేసుకోనున్నారు. మిగిలిన విమానాలను భారత్‌లోనే స్వదేశీ కంపెనీల భాగస్వామ్యంతో తయారు చేయనున్నట్లుగా తెలుస్తోంది. అయితే, విమానాల తయారీలో కనీసం 30 శాతం నుంచి 60 శాతం వరకు స్వదేశీ విడిభాగాలను వాడాలని భారత్ నిబంధన విధించింది. రాఫెల్ సాఫ్ట్‌వేర్ 'సోర్స్ కోడ్'ను కూడా భారత్ ఇవ్వాలని షరతు విధించింది. రాఫెల్ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం హైదరాబాద్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. తాజా పరిణామంతో ఫ్యూచర్‌లో రాఫెల్ విమానాల మెయిన్‌టెన్స్ మరింత సులభం కానుంది. కాగా, ప్రస్తుతం వాయుసేనలో యుద్ధ విమానాల స్క్వాడ్రన్ల సంఖ్య 29కి పడిపోయింది. ప్రస్తుతం లోటును భర్తీ చేసేందుకు ఫ్రాన్స్‌తో 114 కొత్త రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌ను ఖాయం చేసుకున్నారు.

# కాకినాడలో 84,000 కోట్ల పెట్టుబడి అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు

**కాకినాడ, జనవరి 17, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో సరికొత్త చరిత్ర లాంటి పెట్టుబడి రానుంది. కాకినాడ కేంద్రంగా ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సంస్థ సిద్ధమైంది. సుమారు 10 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 84,000 కోట్లు భారీ పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్తు కోసం 7.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని , 1 గిగావాట్ పంప్డ్ హైడ్రో స్టోరేజీని వినియోగించనుండటం విశేషం. ఇది భారతదేశం నుండి అంతర్జాతీయ మార్కెట్‌కు గ్రీన్ ఎనర్జీని ఎగుమతి చేసే తొలి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ వ్యాల్యూ చైన్‌లో కీలక భాగస్వామిగా మారుతోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, సింగపూర్ , జపాన్ వంటి అగ్రదేశాలకు ఎగుమతి చేయనున్నారు. పర్యావరణ హితమైన ఇంధన తయారీలో అత్యాధునిక సాంకేతికతను వాడటం ద్వారా ఏపీ పారిశ్రామికంగా కొత్త పుంతలు తొక్కనుంది. కేవలం పెట్టుబడులకే పరిమితం కాకుండా, ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 8,000 మంది యువతకు ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇది కాకినాడ ప్రాంత ఆర్థిక ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేస్తుందని భావిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టుపై మంత్రి నారా లోకేష్ అత్యంత ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడలో ఈ మెగా ప్రాజెక్టు ఏర్పాటు కావడం ఏపీకి గర్వకారణం. ఇది రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో ఒక మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీ మళ్లీ పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతోందని లోకేష్ ధీమా వ్యక్తం చేశారు. గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి హబ్‌గా మార్చడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందాలు పూర్తి కావడంతో, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ ఎగుమతి టెర్మినల్ ద్వారా కాకినాడ పోర్టు గ్లోబల్ గ్రీన్ గేట్‌వేగా మారుతుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు రాష్ట్రానికి భారీ ఆదాయం, యువతకు ఉపాధి కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. పారిశ్రామికవేత్తల్లో నమ్మకాన్ని పెంచేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఇలాంటి మెగా ప్రాజెక్టులు రాష్ట్రానికి రావడానికి దోహదపడుతున్నాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సచివాలయ ఉద్యోగులకు ఫేషియల్ అటెండన్స్

**విజయవాడ జనవరి 17, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ , వార్డు సచివాలయ వ్యవస్థను మరింత జవాబుదారీగా మార్చేందుకు సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇకపై సచివాలయ సిబ్బంది అందరికీ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల సమయపాలనపై వస్తున్న ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించిన సర్కార్, టెక్నాలజీ సాయంతో పనితీరును మెరుగుపరచాలని భావిస్తోంది. ఈ మేరకు సంబంధిత శాఖాధికారులు ఇప్పటికే ప్రాథమిక ఉత్తర్వులు జారీ చేశారు.
కొత్త నిబంధనల ప్రకారం, సచివాలయ ఉద్యోగులు ఉదయం నిర్ణీత సమయానికే విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా ఆలస్యంగా వస్తే, ఆ సమాచారం నేరుగా సెంట్రల్ సర్వర్‌కు చేరుతుంది. నిర్దేశించిన సమయం కంటే ఎక్కువ సార్లు ఆలస్యంగా వస్తే, ఆ రోజు వేతనంలో కోత విధించేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నారు. బయోమెట్రిక్ విధానంలో ఉన్న లోపాలను అరికట్టేందుకు, ఒకరి బదులు మరొకరు హాజరు వేసే అవకాశం లేకుండా ఈ ఫేషియల్ అటెండెన్స్‌ను ప్రవేశపెడుతున్నారుసచివాలయ వ్యవస్థ ఉద్దేశమే ప్రజల చెంతకు పాలనను చేర్చడం. అయితే, క్షేత్రస్థాయిలో కొందరు ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఫేషియల్ అటెండెన్స్ వల్ల ఉద్యోగులు కచ్చితంగా కార్యాలయాల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు నిర్ణీత సమయంలో అందుతాయని, వ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగ సంఘాల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లే సమయంలో ఈ హాజరు విధానం ఇబ్బందికరంగా మారుతుందని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సాంకేతిక సర్దుబాట్లు చేయాలని కోరుతున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, పారదర్శకమైన పాలన కోసం ఇలాంటి కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఈ విధానం పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి వద్దకే చేరవేసే లక్ష్యంతో 2019లో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటైంది. ప్రతి 2,000 మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడ వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 10 నుండి 11 మంది ఉద్యోగులను నియమించారు. కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల నుండి సంక్షేమ పథకాల లబ్ధి వరకు దాదాపు 500కు పైగా సేవలను స్థానికంగానే అందించడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. సచివాలయ సిబ్బందికి తోడుగా గ్రామాల్లో ఉండే వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తారు. పరిపాలనను వికేంద్రీకరించి, అవినీతికి తావులేకుండా పారదర్శకమైన సేవలు అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వం మారిన తర్వాత వాలంటీర్లను కొనసాగించలేదు. ఎక్కువ సేవలు వాట్సాప్ ద్వారానే అందిస్తున్నారు. దీంతో ఉద్యోగులకు పనిలేకుండా పోయిందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# కూటమి ఉన్నట్లా.. లేనట్లా..
# మనల్ని కాదన్నట్లు దులిపేసుకుంటున్నారా?

**విజయవాడ జనవరి 17, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీకి సీనియర్ల అవసరం ఖచ్చితంగా కనిపిస్తుంది. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కేవలం చంద్రబాబు నాయుడు మీదనే ఆధారపడి ఉండేలా పార్టీ నడిచేది కాదు. కానీ చంద్రబాబు నాయుడు ఇప్పుడు విదేశాలకు వెళ్లినా, మరొకచోటకు అధికార పర్యటనకు వెళ్లినా విపక్షం చేసే విమర్శలకు మాత్రం సూటిగా సమాధానమిచ్చే సీనియర్ నేతలు కొరవయ్యారనే చెప్పాలి. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఒకరిద్దరు నేతలు తప్ప ఎవరూ పెద్దగా పెదవి విప్పడం లేదు. ఇక కొత్తగా వచ్చిన నేతలు ప్రతిపక్ష పార్టీ చేసే విమర్శలకు ఘాటుగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. వారి కౌంటర్లు ప్రజల్లోకి బలంగా వెళ్లలేకపోవడం పార్టీకి మైనస్ గా మారిందన్నది అందరూ అంగీకరిస్తున్నదే. మరొకవైపు కూటమిలో ఉన్న మిత్రపక్షాలు తమను కాదన్నట్లు వ్యవహరించడం చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పద్దెనిమిది నెలలు కావస్తుంది. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వస్తుంది. అలాగే అభివృద్ధి పనులను కూడా అంతేస్థాయిలో ముందుకు తీసుకెళుతుంది. రాష్ట్ర భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని అనేక నిర్ణయాలు తీసుకుంటుంది. మరొకవైపు కూటమి ఉన్నట్లా లేన్నట్లా అన్న అనుమానం కూడా కలుగుతుంది. టీడీపీని కానీ, చంద్రబాబును కానీ విపక్షాలు విమర్శిస్తే అందులో మిత్ర పక్షాలు పెద్దగా పట్టించుకోవడం లేదు.




చంద్రబాబు విదేశాల్లో ఉన్న సమయంలో భోగాపురం ఎయిర్ పోర్టులో తొలి విమానం ల్యాండ్ అయింది. దీనిపై వైసీపీ తమ ప్రభుత్వ హయాంలో భోగాపురం చాలా వరకూ పూర్తయిందని చెప్పుకుంది. టీడీపీ నేతలు మినహా జనసేన, బీజేపీ నేతలు అసలు స్పందించలేదు. అసలు తమను కాదన్నట్లుగానే వారు వ్యవహరించారు. అలాగే రాయలసీమ ఎత్తిపోతల పథకంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా ఒకరిద్దరూ టీడీపీ నేతలు కౌంటర్ ఇచ్చారు తప్పించి జనసేన, బీజేపీలు తమది కాదన్నట్లు వ్యవహరించడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. అసలు కూటమిలో ఏం జరుగుతుందన్న అనుమానం మాత్రం టీడీపీ నేతల్లో కలుగుతుంది. మరి దీనికి సమాధానం ఎవరు చెబుతారన్నది చూడాలి. జనసేన నేతలు కానీ, బీజేపీ లీడర్లు కానీ విపక్షాలకు కౌంటర్ ఇవ్వడం లేదు. వారు ఎందుకు మౌనంగా ఉంటున్నారో తెలియదు కానీ కూటమి ప్రభుత్వంపై చేసే విమర్శలకు కూడా టీడీపీ నేతలే కౌంటర్ ఇవ్వాల్సిన దయనీయ స్థితిని చూడాల్సి ఉంది. మెడికల్ ప్రయివేటు కళాశాలల ప్రయివేటీకరణపై కూడా మిత్ర పక్షాల నుంచి పెద్దగా స్పందన రాలేదు. నిజానికి

## ఇరాన్ నుంచి స్వదేశానికి చేరుకున్న భారతీయులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. తీవ్ర అల్లర్లు, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్, భద్రతా సమస్యలు పెరగడంతో భారత ప్రభుత్వం అక్కడ చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మొదటి బ్యాచ్‌గా 292 మంది భారతీయులు శనివారం తెల్లవారుజామున టెహ్రాన్ నుంచి ఢిల్లీ ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సురక్షితంగా చేరుకున్నారు. వీరిలో ఎక్కువ మంది మెడికల్ విద్యార్థులు, ఉమ్రా యాత్రికులు, వ్యాపారవేత్తలు ఉన్నారు. ఇరాన్ ఎయిర్‌స్పేస్ తాత్కాలికంగా తెరవడంతో చార్టర్డ్ ఫ్లైట్ ద్వారా ఈ ఎవాక్యుయేషన్ సాధ్యమైంది. స్వదేశానికి వచ్చిన భారతీయులు అక్కడి పరిస్థితులు చాలా భయంకరంగా ఉన్నాయని, ఇంటర్నెట్ నిలిపివేయడంతో కుటుంబాలతో సంబంధం కోల్పోయామని తెలిపారు. భారత ఎంబసీ, ప్రభుత్వ సహకారంతో సురక్షితంగా తిరిగి వచ్చామని భావోద్వేగానికి గురయ్యారు. ఇంకా 800 మందికి పైగా భారతీయులు తరలింపు కోసం నమోదు చేసుకున్నారని.. వీలైనంత త్వరగా వారిని కూడా స్వదేశానికి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

## స్టార్టప్‌లతో ఉద్యోగాల సృష్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో స్టార్టప్‌లు భారీగా పెరుగుతుండటంతో ఉద్యోగావకాశాలు బాగా పెరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. స్టార్టప్ ఇండియా 10వ వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టార్టప్ ఇండియా పథకం దేశంలో ఆవిష్కరణలను పెంపొందించడానికి, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి, పెట్టుబడి ఆధారిత వృద్ధిని ప్రారంభించడానికి దోహదపడుతుందని చెప్పారు. స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అవి తమ ఐపిఓలను ప్రారంభిస్తున్నాయని, మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. స్టార్టప్ ఇండియా ప్రారంభించిన తరువాత గత ఏడాది అత్యధికంగా 44 వేల కొత్త స్టార్టప్‌లు నమోదయ్యాయని చెప్పారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ దేశంగా భారత్ స్థానాన్ని సంపాదించుకుందని ప్రధానమంత్రి చెప్పారు. పదేళ్లలో 500 నుంచి రెండు లక్షలకు స్టార్టప్‌లు పెరిగాయని, నాలుగు యూనికార్న్‌ల నుంచి 125 యాక్టివ్ యూనికార్న్‌లు పెరిగాయని చెప్పారు. భారతీయ యువత నిజమైన సమస్యలపై దృష్టిపెట్టి, వాటిని అధిగమిస్తోందని అన్నారు. 'నెలవారీ జీతాన్ని మించి ఆలోచించేవారిని గౌరవిస్తున్నాం. రిస్క్ తీసుకునే ఆలోచనలు ఇప్పుడు ఫ్యాషన్‌గా మారుతున్నాయి' అని మోడీ తెలిపారు. అనంతరం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ మీడియాతో మాట్లాడుతూ 2025లో రూ. 10 వేల కోట్లతో ఆమోదించిన కార్పస్ ఫండ్ కృత్రిమ మేధస్సు, క్వాంటం టెక్నాలజీలు, రక్షణ, అంతరిక్షం వంటి రంగాల్లో ఆవిష్కరణలపై దృష్టిపెట్టిందన్నారు. ఇలాంటి రంగాల్లో స్టార్టప్‌లు విజయవంతం కావడానికి చాలా సమయం పడుతోందని, మరింతగా పెట్టుబడులను అందుబాటులో ఉంచాల్సి వస్తోందని అన్నారు.

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు..
## తొమ్మిది దాటినా కనిపించని సూరీడు!



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశం మొత్తం దట్టమైన పొగమంచుతో కమ్ముకుపోయింది. దీంతో విజిబిలిటీ తీవ్రంగా తగ్గిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం తొమ్మిది గంటలు దాటినా సూర్యుడు కనిపించని పరిస్థితి నెలకొంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో గాలిలో కాలుష్యం మరింత పెరగడంతో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏఖిఎ) 'వెరీ పూర్' స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉఖీంఖ-ఎఎఎ కింద ఆంక్షలను మళ్లీ అమలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నిర్మాణ కార్యకలాపాలపై పరిమితులు విధించడంతో పాటు, డీజిల్ వాహనాల వినియోగాన్ని నియంత్రిస్తున్నారు. ఎఎఓూ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ విజువల్స్‌లో పొగమంచు తీవ్రత స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే పరిస్థితి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలోనూ నెలకొంది. నోయిడా సెక్టర్-115 ప్రాంతంలో దట్టమైన పొగమంచు కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, జనవరి 16 నుంచి ఉత్తర భారతదేశంలో చలిగాలులు, దట్టమైన పొగమంచు కొనసాగనున్నాయి. రాబోయే కొన్ని రోజుల్లో విజిబిలిటీ మరింత తగ్గే అవకాశం ఉందని హెచ్చరించారు. దీని ప్రభావం రోజువారీ జీవితం, రహదారి రవాణా, రైలు, విమానయాన కార్యకలాపాలపై పడే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అలాగే, ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో జనవరి 21 వరకు మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## యశ్వంత్ వర్మకు సుప్రీం షాక్



**హైదరాబాద్ పెన్ పవర్:** తనపై ప్రవేశపెట్టిన అభిశంసన తీర్మానం వ్యవహారంలో కమిటీని ఏర్పాటు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తీసుకున్న నిర్ణయాన్ని సవాలుచేస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. జస్టిస్ వర్మ నివాసంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నగదు తగలబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మను అభిశంసించేందుకు ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు తీర్మానాన్ని అందజేశారు. దీనిని పరిశీలించడానికి కమిటీని ఏర్పాటు చేయాలని స్పీకర్ నిర్ణయించారు. దీనిని సవాలు చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించగా చుక్కెదురైంది. కమిటీ ఏర్పాటులో స్పీకర్ ఎలాంటి చట్టవిరుద్ధ చర్యకు పాల్పడలేదని న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, ఎస్‌సి శర్మతో కూడిన బెంచ్ అభిప్రాయపడింది. ఈ వ్యవహారంలో ఊరట పొందేందుకు జస్టిస్ వర్మ అర్హుడు కాదని తేల్చింది. స్పీకర్ నిర్ణయంలో కోర్టు జోక్యం చేసుకోబోదని తెలిపింది. గత సంవత్సరం జులై 21న పార్లమెంట్ ఉభయ సభలలో అభిశంసన తీర్మానాలు ప్రవేశపెట్టగా, రాజ్యసభ ఛైర్మెన్ నిర్ణయం కోసం ఎదురుచూడకుండా, చట్ట ప్రకారం ఆయనతో సంప్రదింపులు జరపకుండా కమిటీ ఏర్పాటుపై ఓం బిర్లా సొంతగా నిర్ణయం తీసుకున్నారని జస్టిస్ వర్మ తన పిటిషన్‌లో వాదించారు. ఆయన తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## భారతీయ ప్రజాస్వామ్య చారిత్రక చిహ్నం పార్లమెంటు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశం స్వాతంత్ర్యానికి ముందే బ్రిటిష్ పాలకులు నిర్మించిన పార్లమెంట్ భవనం, దేశ ప్రజాస్వామ్యానికి నాంది పలికింది. 1927 ఆగస్టు 18న ప్రారంభమైన ఈ భవనం భారత రాజకీయ,చారిత్రక, సాంస్కృతిక పరిణామాలకు పునాది వేసింది. ఇది వృత్తాకార రూపంతో ప్రత్యేకమైన నిర్మాణ శైలికి ఉదాహరణగా నిలిచింది.పార్లమెంట్ భవన నిర్మాణానికి 1919లో బ్రిటిష్ ప్రభుత్వం పునాది వేసింది. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు ఎడ్విన్ లుటియన్స్ మరియు హెర్బర్ట్ బేకర్, బ్రిటిష్ రాజ్ ప్రతిష్ఠాత్మక ఆర్కిటెక్ట్‌లు, వ్యవహరించారు. వృత్తాకార డిజైన్‌తో రూపొందించబడిన ఈ భవనం 560 అడుగుల వ్యాసార్థాన్ని కలిగి ఉంది. భారతీయ శిల్పకళ, పాశ్చాత్య నిర్మాణ శైలుల మేళవింపుతో రూపొందించ బడింది. 1921 నుంచి 1927 వరకు ఆరు సంవత్సరాల పాటు భవన నిర్మాణం జరిగింది. ఈ ప్రాజెక్టు కోసం 83 లక్షల రూపాయల భారీ ఖర్చు జరిగింది. భవనానికి మధ్యభాగంలో గుమ్మటం (డోమ్) ఉంది, ఇది భారతీయ ఆచారాన్ని ప్రతిబింబిస్తుంది. భవనం చుట్టూ సుందరమైన తోటలు, పార్కులు నిర్మించ బడ్డాయి. భవనం మొత్తం మూడు ముఖ్యమైన మండపాలను కలిగి ఉంది: లోక్‌సభ (జన ప్రతినిధుల సభ), రాజ్యసభ (సభ్యుల మండలి), సెంట్రల్ హాల్ (చారిత్రక సమావేశాలకు కేంద్రం). ఈ మండపాలు భవనంలో ప్రజాస్వామ్యానికి ప్రాథమిక వేదికలుగా ఉన్నాయి. సెంట్రల్ హాల్ ప్రత్యేకత ఏమిటంటే, ఇదే ప్రాంతంలో 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించ బడింది. భారత పార్లమెంట్ భవనం అనేక చారిత్రక సంఘటనలకు వేదికగా నిలిచింది. బ్రిటిష్ ఇండియా లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశాలకు ఉపయోగించ బడింది. భారత జాతీయ కాంగ్రెస్ వంటి సంస్థలు ఇక్కడ అనేక చర్చలు జరిపాయి.1947 ఆగస్టు 15న, భారత స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత, మొదటి పార్లమెంట్ సమావేశం ఈ భవనంలోనే జరిగింది. భారత రాజ్యాంగం కూడా ఈ భవనంలో రచించ బడింది.1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రధాన కేంద్రంగా నిలిచింది.భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ భవనం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. అయితే కాలక్రమేణా, భవనపు అవసరాలు దేశ ప్రజల అవసరాలకు తగినట్లు మారే అవకాశం లేకపోయింది. 1927లో నిర్మించిన ప్రస్తుత పార్లమెంటు భవనంలో నేటి అవసరాలకు తగినంత స్థలం లేకపోవడంతో పాటు తగినన్ని సౌకర్యాలు కొరవడడంతో నూతన పార్లమెంటు భవన నిర్మాణానికి 2020 డిసెంబరు 10న భారత ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసారు. 2023 మే 28న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. 2023 సెప్టెంబరు 19న నూతన భవనంలో పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలు ప్రారంభించ బడ్డాయి. ఇది ఆధునిక సదుపాయాలు, విస్తృత వసతులతో నిర్మించ బడింది. అయినప్పటికీ, పాత పార్లమెంట్ భవనం చారిత్రక వారసత్వంగా నిలిచి భారత ప్రజాస్వామ్య పునాది మీద వెలుగు నింపుతోంది. పాత పార్లమెంట్ భవనం కేవలం ఒక భవనం మాత్రమే కాదు; ఇది భారతదేశ ప్రజాస్వామ్య, స్వాతంత్ర్య యుగానికి చారిత్రక సాక్ష్యం. ఇది ప్రజల భావప్రకటన, సమానత్వం, స్వేచ్ఛల సాధనకు వేదికగా నిలిచింది. భారతదేశ చరిత్రలో పాత పార్లమెంట్ భవనం అనతి కాలం గడిచిన తర్వాత కూడా గౌరవప్రదమైన గుర్తుగా నిలుస్తుంది. భవిష్యత్తు తరాలకు ఇది ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తుంది.

## హిందీ సాహిత్య దిగ్గజం

**హైదరాబాద్ పెన్ పవర్:** డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ ( 1907 నవంబరు 27 – 2003 జనవరి 18) 20 వ శతాబ్దం ప్రారంభంలో హిందీ సాహిత్యంలోని నయీ కవితా సాహిత్య ఉద్యమం లోని భారతీయ కవి. హిందీ సాహిత్యంలో సాటిలేని వారసత్వా న్ని మిగిల్చిన సాహిత్య దిగ్గజం ఆయన. 20వ శతాబ్దపు ఛాయా వాద ఉద్యమం మార్గదర్శకునిగా పరిగణించబడే హరివంశ్ రాయ్ బచ్చన్ గురించి ప్రస్తావించ కుండా హిందీ సాహిత్యం గురించి ప్రస్తావిం చడం సాధ్యం కాదు. 60 సంవత్స రాల పాటు సాగిన సాహిత్య జీవితంతో, బచ్చన్ 30కి పైగా కవితలు రాశారు. ప్రతి ఒక్కటి శక్తివంతమైన చిత్రాలతో, సమ కాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉన్నాయి. హరివంశ్ రాయ్ బచ్చన్ బ్రిటిష్ ఇండియా లోని యునైటెడ్ ప్రావి న్సెస్ ఆఫ్ ఆగ్రా లోని ప్రతాప్ గఢ్ జిల్లాకు చెందిన బాబు పట్టి గ్రామం లో కాయస్థ కులంలోని శ్రీవాస్తవ వంశానికి చెందిన అవధి భారతీయ హిందూ కుటుంబంలో నవంబర్ 27, 1907న జన్మించారు. ఆయన ముందు శ్యామాను వివాహం చేసుకోగా, ఆమె త్వరగా మరణించడంతో మళ్లీ తేజీ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. అనేక ప్రసిద్ధ కవితలు వ్రాసారు. సిల్సిలా (1981), ఆలాప్ (1977) మరియు ఫిర్ భీ (1972) అనే బాలీవుడ్ చిత్రాలలో గీత రచయి తగా కూడా పనిచేశారు.

1941 నుండి 1957 వరకు, అలహా బాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకునిగా బోధిం చారు. ఆ తరువాత రెండు సంవత్స రాలు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన సెయింట్ కాథరీన్ కళా శాలలో ప్రఖ్యాత ఐరిష్ రచయిత డబ్ల్యూ.బి.యీట్స్ రచనలపై పి.హెచ్.డి చేసారు. కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో పి హెచ్ డి చేసిన మొదటి భారతీయునిగా గుర్తింపు పొందారు. హరివంశ్ రాయ్ హిందీ కవిత్వం రాసేటప్పుడు సాధారణంగా సాంప్ర దాయంగా ఉపయోగించే శ్రీవాస్తవ వంశ పేరుకు బదులుగా "బచ్చన్" (బాలుడు) అనే కలం పేరును ఉపయో గించారు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత, అలహాబాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం బోధించారు. అలహా బాద్‌లోని ఆల్ ఇండియా రేడియోలో కూడా పని చేశారు. బచ్చన్ అనేక హిందీ భాషలలో (హిందూస్థానీ, అవధి) నిష్ణాతులు. దేవనాగరి లిపిలో రాసిన కవితల్లో హిందూస్థానీ పదజాలం విస్తృతంగా వాడారు. ఒమర్ ఖయ్యామ్ చేత పర్షియన్, ఉర్దూ కవిత్వం పట్ల ప్రభావితమయ్యారు.

బచ్చన్ తన ప్రారంభ రచన మధుశాల ద్వారా అనూహ్య గుర్తింపు పొందారు. సామాన్యుడి దృక్కోణంలో రాసిన ఆయన కవితలు దేశంలోని అసంఖ్యాక సామాన్యులకు స్వరం వినిపించాయి. బచ్చన్ కవిత్వం స్వేచ్ఛ కోసం సామాన్యుని కోరిక, జీవితం, మరణం, ప్రేమ, వాంఛ మొదలైన అనేక ఇతి వృత్తాలతో ముడి పడి ఉంది. హరివంశ్ రాయ్ అనేక కవితలు ఆయన వ్యక్తిగత జీవితం, విషాదాల నుండి ప్రేరణ పొందాయి. బచ్చన్ రచించిన చాలా కవితలలో ప్రేమికుడి వేదన ప్రధానమైన ఇతివృత్తాలలో ఒకటిగా నిలిచింది. మధుశాల అనేది 135 పద్యాల కవిత్వం, ఇది హరివంశరాయ్ బచ్చన్‌ను ఎనలేని గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆంగ్లం, మలయాళం, బెంగాలీ మరియు మరాఠీలోకి అనువదించ బడింది. హరివంశ్ రాయ్ బచ్చన్ రచించిన అత్యంత ప్రజాదరణ పొందిన కవితలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే వారికి ప్రేరణగా బచ్చన్ అగ్నిపథ్' అనే కవితను రాశారు.1969లో సాహిత్య అకాడమీ అవార్డుతో బచ్చన్ ను సత్క రించారు. 1976 లో హిందీ సాహిత్యానికి చేసిన సేవకు గాను పద్మ భూషణ్ పురస్కారాన్ని అందు కున్నారు. ఆయన భార్య తేజీ బచ్చన్ సామాజిక కార్యకర్త. హరివంశ్ రాయ్ కుమారుడు, మనుమడు పరిచయం అక్కరలేని ప్రఖ్యాత హిందీ నటులు అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్. హిందీ సాహిత్యంలో తనదంటు ప్రత్యేక ముద్ర వేసుకున్న బచ్చన్ దీర్ఘకాలిక అనారోగ్యానికి గురై, 2003 జనవరి 18న తనువు చాలించారు.

## 75 దేశాల ఇమ్మిగ్రేషన్ వీసాల రద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:** 75 దేశాలకు చెందిన పౌరులకు ఇమ్మిగ్రేషన్ వీసాలను జారీ చేసే ప్రక్రియను అమెరికా నిలిపివేసింది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. విదేశాంగ శాఖ కార్యదర్శి మార్కో రూబియో నవంబర్‌లో జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం 75 దేశాల ప్రజల నుంచి వీసా దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియను నిలివేయాలని కాన్సులర్ అధికారులను అదేశించినట్టు పేర్కొంది. ఈ సస్పెన్షన్ వలసేతర వీసాలు, తాతాల్కిక పర్యాటక, వ్యాపార వీసాలను కోరుకునే దరఖాస్తులకు వర్తించదని వివరించింది. ఈ ప్రకటన ఏయే దేశాలకు ఇమ్మిగ్రేషన్ వీసాలను రద్దు చేస్తున్నట్టో స్పష్టం చేయలేదు. వీటిలో ఎక్కువగా ఆఫ్రికా దేశాలు ఉన్నట్టు సమాచారం. రష్యా, ఇరాన్, సోమాలియా, ఆఫ్ఘనిస్తాన్, బ్రెజిల్, ఈజిప్టు వంటి దేశాలు ఉన్నాయని పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక అమెరికా అధికారి తెలిపారు. ఈ 75 దేశాల జాబితాను అమెరికా ప్రభుత్వం ఇంకా బహిరంగపర్చనందున తన పేరు చెప్పడానికి ఆ అధికారి ఇష్టపడలేదు.


# మార్షల్ లా ప్రకటన కేసు



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణకొరియాలో మార్షల్ లా (అత్యవసర పరిస్థితి) విధించడానికి ప్రయత్నించిన కేసులో ఆ దేశ మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. మార్షల్ లా ప్రకటనకు సంబంధించి యూన్ ఎదుర్కొంటున్న క్రిమినల్ ఆరోపణలపై మొదటి కేసు. మార్షల్ లా ప్రకటనపై తనపై విచారణ జరిపేందుకు కోర్టు చట్టబద్ధంగా జారీ చేసిన అరెస్టు వారెంట్‌ను అమలు చేయకుండా అధికారులను అడ్డుకున్నారని, అధికారులను నిరోధించడానికి అధ్యక్ష భవన భద్రతా విభాగాన్ని రెచ్చగొట్టారని సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు యూన్‌ను దోషిగా నిర్ధారించింది. అలాగే టెలివిజన్ ప్రసారమైన ప్రసంగం, అధికారిక పత్రాలను తారుమారు చేయడం, మార్షల్ లాకు అవసరమైన చట్టపరమైన ప్రక్రియను పాటించడంలో విఫలమవ్వడం వంటి ఆరోపణలపై కూడా యూన్‌ను దోషిగా నిర్ధారించింది. 'అధ్యక్షుడిగా తనకున్న అపారమైన అనుభవాన్ని దుర్వినియోగం చేసి, భద్రతా సేవల అధికారుల ద్వారా చట్టబద్ధమైన వారెంట్ల అమలును యూన్ నిరోధించారు. ఇది రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు

విధేయులైన అధికారులను వ్యక్తిగత లాభం మళ్లించినట్లయింది' అని ముగ్గురు జడ్జీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. అయితే, ఈ తీర్పుపై అప్పీల్ చేస్తామని యూన్ న్యాయవాదుల్లో ఒకరైన యూ జంగ్-హ్వా మీడియాకు తెలిపారు. కాగా, యూన్ విధించిన అత్యవసర పరిస్థితి దక్షిణ కొరియాలో కేవలం ఆరు గంటల పాటు మాత్రమే సాగినా.. ఆదేశంలో తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. పార్లమెంట్ కొన్ని గంటల వ్యవధిలోనే యూన్ విధించిన మార్షల్ లా డిక్రీని రద్దు చేసింది. అలాగే, యూన్‌పై అభిశంసన తీర్మానం ఆమోదించి అతన్ని అధ్యక్ష పదవి నుంచి తొలగించింది.

# యూఎస్‌కు పెట్టుబడులు తెచ్చేది భారత్.. పాకిస్థాన్ కాదు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ దేశాలతో అమెరికా సంబంధాలపై ఆ దేశ కాంగ్రెస్ సభ్యుడు, రిపబ్లికన్ పార్టీ నేత రిచ్ మెక్‌కార్మిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూఎస్ పాకిస్థాన్ కంటే భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అవసరమని ట్రంప్ యంత్రాంగానికి సూచించారు. ఎందుకంటే అమెరికాకు పెట్టుబడులు తీసుకువచ్చేది భారత్ మాత్రమేనని.. పాక్ (ఖజీనెతిబబిజీని) కాదని అన్నారు. అంతేకాకుండా ప్రతిభావంతులైన వేలాది మంది నిపుణులను, ఉద్యోగులను భారత్ సరఫరా చేస్తోందన్నారు. దేశాభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. యూఎస్ కంపెనీలు కూడా భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకువస్తాయన్నారు. భారత్‌ను దూరం చేసుకుంటే అమెరికాకే నష్టమని వ్యాఖ్యానించారు. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ భారత్ మాస్కో నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండడం ఆయనకు నచ్చట్లేదని మెక్‌కార్మిక్ పేర్కొన్నారు. అందువల్లే ట్రంప్

భారత్‌తో కఠినంగా వ్యవహరిస్తున్నారన్నారు. కానీ భారత ప్రధాని నరేంద్ర మోదీ వారి జాతీయ ప్రయోజనాల గురించి ఆలోచించి.. చౌకగా లభించే రష్యా చమురును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు

# రైతుల ప్రతిఘటన విజయవంతం



**హైదరాబాద్ పెన్ పవర్:** మోడీ సర్కార్ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపు మేరకు జరిగిన అఖిల భారత ప్రతిఘటన దినోత్సవం విజయవంతమైంది. ఈ నిరసనలో దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ కార్మికులు, శ్రామిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గన్నారు. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, తెలంగాణ, గుజరాత్, రాజస్థాన్, కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గ్రామ, జిల్లా స్థాయిలో ప్రతిజ్ఞా కార్యక్రమాలు, నిరసన, సమావేశాలు, ప్రదర్శనలు విజయవంతమయ్యాయి. బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఐక్య పోరాటాలను కొనసాగిస్తామని రైతులు, కార్మికులు సమిష్టిగా నూతన సంవత్సర ప్రతిజ్ఞ చేశారు. జీవనోపాధి, ఆహార భద్రత, ఉపాధి హామీ, కార్మికుల హక్కులను హరించే సీడ్స్ బిల్లు 2025, విద్యుత్ బిల్లు 2025, విబి-జి ఆర్‌ఎఎం జి చట్టం, నాలుగు కార్మిక కోడ్‌లను తీవ్రంగా వ్యతిరేకించారు. సమాఖ్య సూత్రాలపై దాడిని ఖండించారు. రాష్ట్రాల్లో భారీ స్థాయిలో ప్రజానీకం ఆందోళనల్లో పాల్గన్నారని ఎస్‌కెఎం తెలిపింది. దేశంలో శ్రామిక ప్రజలు తమ హక్కులు, జీవనోపాధిని కాపాడుకోవడానికి పెరుగుతున్న ఐక్యత, దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఒత్తిడి చేయడానికి, హామీ ఇవ్వబడిన పంట సేకరణ, ఉపాధి భద్రత, సామాజిక న్యాయం, సమాఖ్య హక్కులతో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పొందేందుకు ఐక్యమైన, దేశవ్యాప్త ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో అఖిల భారత ప్రతిఘటన దినోత్సవం ఒక ముందడుగు అని పేర్కొంది. మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి, రాబోయే కాలంలో కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, దేశంలోని ప్రజాస్వామ్య సంఘాలతో కలిసి సంయుక్త కిసాన్ మోర్చా పోరాటాలను తీవ్రతరం చేస్తూనే ఉంటుందని తెలిపింది.

## కెనడా, చైనా మధ్య సరికొత్త బంధం

**హైదరాబాద్ పెన్ పవర్:** కెనడా, చైనాల ద్వైపాక్షిక సంబంధాల్లో నూతన అధ్యాయం ప్రారంభమైంది. నాటో కూటమిలో భాగంగా అమెరికాకు దగ్గరగా ఉన్న కెనడా.. ఇప్పుడు చైనాతో సంబంధాలు మెరుగుపరుచుకుంటోంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో, కెనడా ప్రధాని మార్క్ కార్నీ గత ఏడాది అక్టోబరులో దక్షిణ కొరియాలో భేటీలు నిర్వహించిన తర్వాత- ఇప్పుడు కార్నీ స్వయంగా చైనాలో రెండురోజులుగా పర్యటిస్తున్నారు. ద్వైపాక్షిక చర్చలు కొనసాగిస్తున్నారు, వివిధ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. తమ దేశ ఆహార ఉత్పత్తులపై తక్కువ సుంకాలకు ప్రతిగా, చైనా ఎలక్ట్రికల్ కార్లపై విధించిన 100 శాతం సుంకాలను తగ్గించేందుకు అంగీకరించినట్లు కార్నీ శుక్రవారం ప్రకటించారు. ఈ ఒప్పందంతో ప్రారంభంలో 49 వేలుగా ఉన్న వాహనాల సంఖ్య వచ్చే ఐదేళ్లలో 70 వేలకు చేరుకుంటుందన్నారు. కెనడా ప్రధాన ఎగుమతి కనోలా విత్తనాలపై 84 శాతంగా ఉన్న సుంకాలను చైనా 15 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు. ఏళ్ల శత్రుత్వం పక్కన పట్టి సంబంధాలను మెరుగుపరుచుకుంటామని ఇరు దేశాధినేతలైన జిన్‌పింగ్, కార్నీలు ప్రతిజ్ఞ చేశారు. ఎనిమిదేళ్లలో చైనాను సందర్శించిన మొట్టమొదటి కెనడా ప్రధానిగా కార్నీ నిలిచారు.

## మమ్మల్ని సమర్థించకపోతే సుంకాలు విధిస్తా

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రీన్‌లాండ్ విషయంలో తమను సమర్థించని దేశాలను శిక్షించేందుకు వాటిపై అధిక సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం హెచ్చరించారు. డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌ల ప్రతినిధులు అమెరికా పార్లమెంటు ప్రతినిధి బృందంతో కోపెన్‌హాగెన్‌లో చర్చలు నిర్వహిస్తున్న సమయంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. డెన్మార్క్ రాజ్యంలో భాగంగా పాక్షిక స్వయంప్రతిపత్తి కలిగివున్న గ్రీన్‌లాండ్ తమపరం కావడం తప్ప మరేదీ తమకు సమ్మతం కాదని ఆయన ఇప్పుడు ఘంటాపథంగా చెబుతున్నారు. "గ్రీన్‌లాండ్ విషయంలో మాతో అంగీకరించని దేశాలపై నేను సుంకాలు విధిస్తాను. దేశ భద్రత కోసం మాకు ఆ దీవి కావాలి" అని ట్రంప్ తాజాగా ప్రకటించారు.

## ట్రంప్ ఒత్తిడికి దిగొస్తున్న వెనెజువెలా

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనెజువెలాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి పనిచేస్తున్నట్లే కనిపిస్తోంది. చమురు రంగంలో సంస్కరణలకు శ్రీకారం చుట్టే దిశగా ఆ దేశం అడుగులు వేస్తోంది. ఆ దేశాధ్యక్షుడు మదురోను ఈ నెల ఆరంభంలో అమెరికా దళాలు నిర్బంధంలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో తాత్కాలిక దేశాధ్యక్ష పగ్గాలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్ గురువారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కొన్ని కీలక ప్రకటనలు చేశారు. చమురు రంగంలో పాక్షిక ప్రైవేటు పెట్టుబడులు ఆహ్వానించే విధంగా కొత్త విధానం తీసుకొస్తామని తెలిపారు. ఈ విధానాన్ని చట్టసభ సభ్యులు ఆమోదించాలని ఆమె అభ్యర్థించారు. చమురు కొనుగోళ్ల నుంచి వచ్చే ఆదాయంతో రెండు ఫండ్‌లను నిర్వహిస్తామని చెప్పారు. ఈ నిధులను సామాజిక అవసరాల కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం వెచ్చిస్తామని తెలిపారు. అంతేకాదు.. మదురో పాలనలో నిర్బంధానికి గురైన రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని కూడా చెప్పారు.

## పాలస్తీనా అనుకూల విద్యావేత్తలకు అండ

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఓ 'నిరంకుశుడు'గా బోస్టన్‌లోని జిల్లా జడ్జి విలియం యంగ్ అభివర్ణించారు. కళాశాల ప్రాంగణాలలోని పాలస్తీనా అనుకూల కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని, స్వస్థలాలకు తిప్పిపంపడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యావేత్తలు దాఖలు చేసిన పిటిషన్‌కు అనుకూలంగా ఆదేశాలు జారీ చేస్తానని ఆయన తెలిపారు. అమెరికా పౌరులు కాని విద్యావేత్తల ఇమ్మిగ్రేషన్ హోదాను ప్రభుత్వం మార్చకుండా ఈ వారంలో ఆదేశాలు ఇస్తానని చెప్పారు. ఎవరైనా అమెరికా యేతర విద్యావేత్తల ఇమ్మిగ్రేషన్ హోదాను మారిస్తే వారు చట్టం ముందు నిలవాల్సిందేనని స్పష్టం చేశారు. గత సెప్టెంబరులో కూడా ఈ న్యాయమూర్తి ట్రంప్ చర్యలను తీవ్రంగా విమర్శించారు. దేశంలోని విశ్వవిద్యాలయాలలో చదువుకుంటున్న అమెరికాయేతరుల భావప్రకటనా స్వేచ్ఛను హరించడం ద్వారా విదేశాంగ, హోమ్‌లాండ్ సెక్యూరిటీ శాఖలు అమెరికా రాజ్యాంగం యొక్క మొదటి సవరణను ఉల్లంఘించాయని ఆయన నిర్ధారించారు. క్యాబినెట్ మంత్రులు, దేశాధ్యక్షుడు తొలి సవరణను గౌరవించకపోవడం పెద్ద సమస్యగా ఉన్నదని అన్నారు.

# ఎస్ఐఆర్‌లో వివక్షా పూరిత వ్యూహాలపై ఆందోళనలు



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణలో అనుసరిస్తున్న వివక్షా పూరిత వ్యూహాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆ రాష్ట్ర సిపిఎం కార్యదర్శి మహ్మద్ సలీం తెలిపారు. కొల్‌కతాలోని ముజఫర్ అహ్మద్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత బ్లాక్‌స్థాయిలోనూ, ఆ తరువాత దశల వారీగా జిల్లా ఎన్నికల కార్యాలయాలు, రాష్ట్ర ఎన్నికల కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ విషయంలో కోర్టులను ఆశ్రయించడం కంటే ప్రజలతో ఉద్యమాన్ని నిర్మించడంపైనే పార్టీ ఎక్కువ దృష్టిపెడుతోందని చెప్పారు. ఆ తరువాత కోర్టులను కూడా ఆశ్రయిస్తామని తెలిపారు. ఎన్నికల చివరి నిమిషంలో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తున్నారని, తద్వారా ఈ ప్రక్రియలో తాము జోక్యం చేసుకోబోమని కోర్టు చెప్పే అవకాశం ఉందని చెప్పారు. ఇది ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ఒక వ్యూహమని ఆయన పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం నడుస్తోందని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ మాన్యువల్ ఆధారంగా మైనారిటీలు, మహిళలు, అణగారిన వర్గాల ప్రజలు, వలస కార్మికులను ఇసి లక్ష్యంగా చేసుకుందన్నారు. పాలక ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేక, ప్రజల పేర్లను ఏకపక్షంగా తొలగించేందుకు పరిపాలనా యంత్రాంగాన్ని ఆశ్రయిస్తోందన్నారు. రోహింగ్యాలు రాష్ట్ర ఓటర్లలో ఉన్నారంటూ బిజెపి తప్పుడు ప్రచారం చేసిందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలవడంతో బిజెపి చేస్తున్నది తప్పుడు ప్రచారమని తేలిపోయిందన్నారు. ఇంతకాలం బిజెపి ప్రచారంతో తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉంటాయని భావించిన మధువాలు తమ పేర్లను తొలగించారని తెలుసుకుంటున్నారని చెప్పారు. పేర్లలో అక్షర దోషాలు, పేర్ల స్పెల్లింగు లేదా ఇంటి పేర్లలో చిన్న చిన్న పొరపాట్లను కారణంగా చూపి పేర్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఎస్ఐఆర్ గణనలో పాల్గంటున్న వారికి సరైన శిక్షణ ఇవ్వలేదన్నారు.

## అమ్మకాలు లేక టెస్లా కార్ల ధరల తగ్గింపు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ కుబేరుడు ఎలన్‌మస్క్‌కు చెందిన టెస్లా కార్లకు భారత్‌లో డిమాండ్ సన్నగిల్లింది. డెలివరీలు లేక దిగుమతి చేసుకున్న కార్ల నిల్వలు పెరిగిపోవడంతో ఏమి చేయలో తెలియక ఎలాగోలా అమ్ముకోవడానికి భారీ డిస్కౌంట్లను ప్రకటిస్తోంది. అమ్మకాలు ఊహించిన స్థాయిలో లేకపోవడంతో ఆ కంపెనీ విక్రయిస్తోన్న మోడల్ 'వై' పై ఏకంగా రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ అందిస్తోన్నట్లు వెల్లడించింది. స్టాక్‌ను క్లియర్ చేసేందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంది. గతేడాది టెస్లా 300 మోడల్ వై కార్లను దిగుమతి చేసుకోవగా.. అందులో మూడోవంతు కార్లు కూడా విక్రయం కాలేదు. కొన్ని నెలలుగా షోరూమ్‌లకే పరిమితమయ్యాయి. దీంతో ఈ కార్లను ఎలాగైనా విక్రయించాలని రూ.2 లక్షల వరకు వివిధ రూపాల్లో డిస్కౌంట్లు అందిస్తోందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. భారత్‌లో ఈ మోడల్ ధరను రూ.60 లక్షలుగా నిర్ణయించింది. ఇదే ధరలో ఇతర లగ్జరీ కంపెనీల్లో మంచి మోడళ్లు లభించడంతో వినియోగదారులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. ఇటీవల అంతర్జాతీయంగా టెస్లాను చైనా ఆటోమొబైల్ దిగ్గజం బివైడి అధిగమించింది. గడిచిన ఏడాది 2025 విక్రయాల్లో మొదటిసారిగా టెస్లాను బివైడి వెనక్కి నెట్టింది. ప్రపంచంలోనే అత్యధిక విద్యుత్ వాహనాలను విక్రయించిన సంస్థగా బివైడి రికార్డ్ సృష్టించింది. 2025లో గ్లోబల్‌గా టెస్లా 16.3 లక్షల యూనిట్లను డెలివరీ చేసింది. ఇది గత ఏడాదిలోని 17.3 లక్షల యూనిట్లతో పోలిస్తే 8.6 శాతం తగ్గుదల. మరోవైపు 2025లో బివైడి ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు 28 శాతం పెరిగి 22.6 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి.

## స్మార్ట్‌ఫోన్‌లు మరింత ప్రియం?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ధరలు మరింత పెరగనున్నాయి. స్మార్ట్‌ఫోన్, టివి, ల్యాప్‌టాప్ తదితర ఉత్పత్తుల ధరలు వచ్చే రెండు నెలల్లో భారీగా పెరగొచ్చని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థల నుంచి మెమొరీ చిప్స్‌కు భారీగా డిమాండే పెరగడమే ఇందుకు కారణం. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు పెరిగాయి. టెలివిజన్ (టివి) కంపెనీలు కూడా ధరలు పెంచే కసరత్తులో ఉన్నాయని ఓ ఆంగ్ల మీడియా కథనం ప్రచురించింది. 2025 డిసెంబర్ త్రైమాసికంలో మెమొరీ చిప్స్ ధరలు ఏకంగా 50 శాతం మేరకు ఎగిశాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. జనవరి-మార్చి త్రైమాసికంలో మరో 40-50 శాతం పెంపు ఉంటుందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అంచనా వేసింది. ఏప్రిల్-జూన్‌లో మరో 20 శాతం వరకు పెరగొచ్చని అంచనా వేసింది. 'వివో, నథింగ్ వంటి సంస్థలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.3,000 నుంచి రూ.5,000 వరకు పెంచాయి. సామ్‌సంగ్ వంటి కంపెనీలు పరోక్షంగా ఖర్చులు తగ్గించుకోవడానికి క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లను నిలిపివేశాయి. మెమొరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఆ మేరకు ధరల పెంపు చేపట్టవచ్చు.' అని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పథక్ పేర్కొన్నారు. మెమరీ చిప్‌ల ధరలు 2026లో మరియు ఆ తర్వాతి ఏడాది కూడా భారీగా పెరిగే అవకాశం ఉంది. కొత్తగా ఆవిష్కరించే ఫోన్‌లలో ఆయా కంపెనీలు ఈ ధరల పెరుగుదలను సర్దుబాటు చేసినప్పటికీ.. ధర పెంచకుండా ఉండటానికి డిస్‌ప్లే వంటి ఇతర భాగాల నాణ్యతలో కంపెనీలు రాజీ పడవచ్చని తరుణ్ తెలిపారు.

## పీఎఫ్ డబ్బులు తీసుకునే కష్టాలకు చెక్.. యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే డబ్బులు




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8 కోట్ల మంది ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇఖఈూ) సభ్యులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పేందుకు రెడీ అయింది. పీఎఫ్ ఖాతాల నుంచి డబ్బులు ఉపసంహరించుకునే ప్రక్రియను మరింత వేగవంతం, సులభతరం చేయాలనే లక్ష్యంతో యూపీఐ ఆధారిత విత్‌డ్రా విధానాన్ని ప్రవేశప కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ కొత్త విధానం 2026 ఏప్రిల్ నాటికి అమల్లోకి రానుంది. ప్రస్తుతం ఈపీఎఫ్ ఖాతా నుంచి డబ్బులు తీసుకోవాలంటే క్లెయిమ్ ఫారమ్‌లు సమర్పించడం, ఆధార్-బ్యాంకు లింకింగ్, ధృవీకరణ వంటి అనేక దశలను పూర్తి చేయాల్సి వస్తోంది. ఈ ప్రక్రియకు సాధారణంగా కొన్ని రోజులు, కొన్ని సందర్భాల్లో వారాలు కూడా పడుతోంది. అయితే యూపీఐ ఆధారిత వ్యవస్థ అమల్లోకి వస్తే ఈ మొత్తం ప్రక్రియ చాలా సులభంగా మారనుంది. సభ్యులు తమ పీఎఫ్ ఖాతాకు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు యూపీఐ పిన్ ఉపయోగించి నేరుగా డబ్బులు బదిలీ చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ కొత్త విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ఈపీఎఫ్‌వో ప్రస్తుతం తన ఐటీ మౌలిక సదుపాయాల్లో కీలక మార్పులు చేస్తోంది. అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, భద్రతా ప్రమాణాల అమలు, బ్యాంకులు-యూపీఐ నెట్‌వర్క్‌తో సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దీని వల్ల పీఎఫ్ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ సమయం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఈపీఎఫ్‌వో ఆటో-సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టి సభ్యులకు మరింత సౌలభ్యం కల్పిస్తోంది. అనారోగ్యం, విద్య, వివాహం, గృహ నిర్మాణం వంటి అవసరాల కోసం చేసే పాక్షిక ఉపసంహరణ క్లెయిమ్‌లను మూడురోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. ఈ విధానంలో గరిష్ట పరిమితిని గతంలో ఉన్న రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచడం ద్వారా సభ్యులకు మరింత ఆర్థిక స్వేచ్ఛను కల్పించారు. అలాగే.. పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ నిబంధనలను కూడా ఈపీఎఫ్‌వో సరళీకరించింది. గతంలో ఉన్న 13 సంక్లిష్ట నియమాలను తొలగించి, వాటిని మూడు సులభమైన కేటగిరీలుగా విభజించింది. దీని వల్ల సభ్యులు తాము అర్హత కలిగిన మొత్తాన్ని సులభంగా అర్థం చేసుకుని విత్‌డ్రా చేసుకునే అవకాశం ఏర్పడింది. కొత్త నిబంధనల ప్రకారం.. సభ్యులు తమ ఇఖఈూ ఖాతాలో ఉన్న అర్హత బ్యాలెన్స్‌లో 100 శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. అయితే, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత దృష్ట్యా కనీసం 25 శాతం మొత్తాన్ని ఖాతాలో కొనసాగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే పీఎఫ్ ఖాతాపై ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ రేటు వర్తిస్తుండటంతో పాటు చక్రవడ్డీ ప్రయోజనాలు కూడా అందుతాయి. యూపీఐ ఆధారిత సేవలు అందుబాటులోకి వస్తే ఈపీఎఫ్‌వో సేవలు బ్యాంకింగ్ స్థాయికి చేరుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. ప్రతి సంవత్సరం వచ్చే 5 కోట్లకు పైగా పీఎఫ్ క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ భారం కూడా గణనీయంగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

# నట సార్వభౌముడు ఎన్‌టిఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగువారు 'అన్నగారు' అని అభిమానంతో, ప్రేమతో, ముద్దుగా పిలుచుకునే నందమూరి తారక రామారావు, అటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో మకుట రహిత మహారాజుగా ఖ్యాతిని ఆర్జించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. నటనకే పరిమితం కాక, పలు చిత్రాలను నిర్మించి, మరి ఎన్నింటికో దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు. సినీ కళామతల్లి సేవలతో పాటు, ప్రజా సేవ కూడా చేయాలని నిర్ణయించుకొని, రాజకీయ పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది మాసాల్లోనే ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించి, హస్తానికి అధికారాన్ని గతం చేసి, తెలుగుదేశం పక్షాన హస్తగతం చేసుకున్నారు. మూడు విడతలుగా ఏడు సంవత్సరాల పాటు అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు.

పట్టుదలకు, క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగు భాషకు, తెలుగు జాతికి, దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి, అభిలాంధ్ర అందాల నటుడు నందమూరి తారక రాముడు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో చిరస్మరణీయునిగా వెలుగొందారు ఆయన. ఎన్టీఆర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు"గా ఖ్యాతిగాంచారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సుయోధనుడు రావణుని వంటి పౌరాణిక పాత్రల తో బాటు వైవిధ్య భరిత సాంఘిక, జానపద చిత్రాలలో విభిన్న పాత్రలను పోషించారు. సాటిలేని మేటిగా "చిత్రసీమ రారాజుగా భాసిల్లిన స్థితప్రజ్ఞులు రామారావు, 44 ఏళ్ల సినీ ప్రస్థానంలో, 13 చారిత్రక, 55 జానపద, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాలతో పాటు పలు తెలుగు, తమిళ చలన చిత్రాలలో విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది మాసాల కాల వ్యవధి లోనే, అప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా పగ్గాలు చేత బుచ్చుకుని, ఎనిమిదేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు. 1923 మే న కృష్ణాజిల్లా పామూరు మండలం నిమ్మకూరులో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతులకు జన్మించి, తారక రాముని"గా నామాంకితులై, విజయవాడ మున్సిపల్ స్కూల్లో, తర్వాత ఎస్.ఆర్. ఆర్ కళాశాలలో చదివారు. "కవి సామ్రాట్" విశ్వనాథ సత్య నారాయణ తెలుగు భాష ఉపాధ్యాయునిగా రామారావుకు "ఆడ వేషం" వేసే అవకాశం కల్పిస్తే, మీసాలు తీయకనే నటించి, "మీసాల నాగమ్మ" పిలువ బడ్డారు. విద్యాభ్యాస సమయంలో ఆస్తి హరించుకు పోగా, కొద్ది రోజులు పాల వ్యాపారం, కిరాణా షాపు, ఒక ముద్రణాలయాన్ని నడిపారు. 1942 లో మేనరికంగా బసవ తారకంను వివాహ మాడారు. నాటి ప్రఖ్యాత నటులు "కొంగర జగ్గయ్య, రక్త కన్నీరు నాగభూషణం, కె.వి.ఎస్. ముక్కామల" లాంటి నటులతో "నేషనల్ ఆర్ట్ థియేటర్" నాటక సంస్థను స్థాపించారు. తర్వాత కాలంలో సదరు సంస్థ కొన్ని చిత్రాలు కూడా తీసింది. జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ మోహన కృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ, కుమారులు కాగా, పురంధరేశ్వరి, భువనేశ్వరి, ఉమా మహేశ్వరి కూతుళు ్ళ కలిగారు. 1947 లో పట్టభద్రులై మద్రాసు సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి 1100 మందికి, ఏడుగురిలో ఎంపికై సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం పొంది, తన కార్యక్షేత్రం సినీ రంగంగా ఎంచి, ఉద్యోగాన్ని వదిలారు. ప్రముఖ సినీ నిర్మాత బి.ఎ.సుబ్బారావు రామారావును మద్రాసు పిలిపించి, "పల్లెటూరి పిల్ల" చిత్రంలో కథానాయకుడి పాత్రను 116 రూపాయల పారితోషకం అందించారు.


అయితే 1949 లో విడుదలైన "మన దేశం" ఎన్టీఆర్ కెమెరా ముందు నిలిచిన తొలి చిత్రం అయింది. తర్వాత దర్శకుడు యోగానంద్ కలిసి మద్రాసులో చిన్న గదికి మకాం మార్చారు. 1951లో నటించిన, నాటికీ నేటికీ తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిన పాతాళభైరవి" చిత్రం. 10 కేంద్రాలలో శత దినోత్సవాలు జరుపుకుంది. 1956 లో ×మాయాబజార్' చిత్రానికి ఎన్టీఆర్ తీసుకున్న 7500 రూపాయల పారితోషికం నాడు అత్యధికం. తర్వాత భూకైలాస్" "వెంకటేశ్వర మహత్యం" భారీ విజయాలు సాధించగా, "శ్రీమద్విరాటపర్వం"లో ఐదు పాత్రలు పోషించి ఔరా అనిపించు కున్నారు. 1952 నుండి ఎన్టీఆర్ పారితోషికం లక్షల్లోకి చేరింది. "లవకుశ", "సీతారామ కళ్యాణం", "దాన వీర శూర కర్ణ", "నర్తనశాల", "విశ్వామిత్ర" లాంటి చిత్ర రాజాలు, ఆయన నటనకు కలికి తురాయిలుగా నిలిచాయి. "న భూతో న భవిష్యతి" అనిపించాయి. "అడవి రాముడు" "యమగోల" బాక్సాఫీసు విజయాలు సాధించాయి. చిత్ర సీమలో రారాజుగా ఉన్న ఎన్టీఆర్ "ప్రజా సేవ" వైపు తమ దృష్టిని మరల్చారు. 1978లో రాష్ట్ర కాంగ్రెస్ లో కుమ్ము లాటలు, ఐదేళ్లలో 4గురు సీఎంలు మారడం, ఢిల్లీలో అధిష్టాన నిర్ణయానుసారం, సీఎంలు ఎన్నుకోబడిన సాంప్రదాయం, కాంగ్రెసు ప్రతిష్టను దిగజార్చడం జరిగింది. ఈ క్రమంలోనే 1982 మార్చి 21న హైదరాబాద్ కు చేరి, మార్చి 29 సాయంత్రం, రాజకీయ పార్టీని స్థాపించ నున్నట్లు ప్రకటించి, "తెలుగుదేశం" అని పేరు ఖాయం చేశారు. తన "చేవ్రోలెట్" కారునే "చైతన్య రథం"గా మార్పించి, దానిపై నలు మూలలా ఆంధ్రదేశ మంతటా పర్యటించి, ప్రచారం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో, ప్రజల మనోభావాలను ప్రభావితం చేసి "ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఆత్మగౌరవ పునరుద్ధరణ" పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి సర్వం తానే అయి, ప్రజాకర్షణతో, ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ప్రసంగాలతో ప్రజా మద్దతు పొందారు. 1983 జనవరి 7న ప్రకటిత శాసన సభ ఫలితాలలో, 199 స్థానాలను సునాయాసంగా గెలుచుకొని, 97 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయ గలిగారు. టిడిపి వ్యవస్థాపక నేతలలో ఒకరైన నాదెండ్ల భాస్కర్ రావు, 1986 ఆగస్టు 16న, నాటి దేశ ప్రధాని ఇందిర, ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ రాంలాల్ సహకారంతో, ఎన్టీఆర్ ను పదవీచ్యుతుని గావించి, అధికారం హస్తగతం చేసుకోగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ ఫలితంగా, సెప్టెంబర్ 16న తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయినారు. ఎన్టీఆర్ ఎందరో ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు రాజకీయ జీవితాలను ప్రసాదించారు. విడిపోయిన తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా బాబు నాయుడు, దివంగత ఎన్టీఆర్ మంత్రివర్గంలో పని చేసిన వారే కావడం విశేషం. 1985 జూన్ 1న శాసన మండలి రద్దు, హుస్సేన్ సాగర్ కట్టపై ప్రసిద్ధుల విగ్రహాల ఏర్పాట్లు, సినిమా థియేటర్లకు స్లాబ్ విధానం, 1989 లో మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరచి, కొత్త మంత్రి మండలి ఏర్పాటు, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక పాత్ర, రెండు రూపాయల కిలో బియ్యం పథకం, సంపూర్ణ మద్య నిషేధం, స్త్రీలకు ఆస్తిలో వాటా 1991 నంద్యాలలో గౌరవ సూచకంగా, నాటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు పోటీ పెట్టక పోవడం, 1989... 1994 మధ్య ప్రతిపక్ష పార్టీ నేతగా వ్యవహరించడం, 1993లో లక్ష్మీపార్వతిని వివాహ మాడటం, ఆమె సహచర్యం, తారకరాముని రాజకీయ ప్రస్థానంలో, ముఖ్యాతి ముఖ్య అంశాలుగా మిగిలాయి.

# డిఫెన్స్ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులకు నిబంధనలు సడలించే యోచనలో కేంద్రం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ డిఫెన్స్ కంపెనీల్లో విదేశీ సంస్థ పెట్టుబడులకు సంబంధించి నిబంధనలను మరింత సులభతరం చేయాలని కేంద్రం భావిస్తోంది. గతేడాది పాకిస్తాన్‌తో జరిగిన ఘర్షణ నేపథ్యంలో దేశీయ తయారీని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఇందుకు సానుకూలంగా ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ అనుమతి అవసరం లేని ఆటోమేటిక్ రూట్ కింద ఇప్పటికే లైసెన్సులు ఉన్న రక్షణ సంస్థలలో విదేశీ కంపెనీలు 49 శాతం వరకు పెట్టుబడి పెట్టడానికి అవకాశాలు ఉన్నాయి. దీన్ని 74 శాతానికి పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనివల్ల విదేశీ కంపెనీలు సులభంగా మన రక్షణ రంగ సంస్థల్లో మెజారిటీ వాటాను సొంతం చేసుకోవచ్చు. ప్రస్తుతం, కొత్త రక్షణ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మాత్రమే విదేశీ కంపెనీలు స్వయంగా 74 శాతం వరకు స్వంతం చేసుకోవడానికి అనుమతి ఉంది. కొత్త నిబంధన ఇప్పటికే లైసెన్సులు ఉన్న కంపెనీలకు వర్తిస్తుంది. ఈ మార్పు ద్వారా స్నేహపూర్వక దేశాల నుంచి రక్షణ కంపెనీలను భారత్‌లో మరింత భారీగా పెట్టుబడి పెట్టడానికి ఆకర్షించే లక్ష్యంతో చేస్తోంది. రాబోయే కొన్ని నెలల్లో కొత్త నిబంధనలు అమలులోకి రావచ్చు. కాగా, గత 25 ఏళ్లలో భారత రక్షణ రంగంలోకి మొత్తం విదేశీ పెట్టుబడుల వాటా 26.5 మిలియన్ డాలర్లు(మన కరెన్సీలో రూ. 240 కోట్ల) వరకు మాత్రమే ఉన్నాయి.



## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ నుంచి పోటీ.. డెలివరీ ఫీజు తొలగించిన బ్లింకిట్





**హైదరాబాద్ పెన్ పవర్:** జక్విక్ కామర్స్ రంగంలో రోజురోజుకూ పోటీ తీవ్రమవు తోంది. ముఖ్యంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థల నుంచి స్టార్టప్ సంస్థలకు గట్టి పోటీ ఎదురవుతోంది. ఈ రెండు దిగ్గజ సంస్థలు మార్కెట్‌లోకి వేగంగా దూసుకొస్తుండటంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కంపెనీలు అప్రమత్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే క్విక్ కామర్స్‌లో మార్కెట్‌లీడర్‌గా ఉన్న బ్లింకిట్ గురుగ్రామ్, బెంగళూరు, ముంబయి వంటి ఎంపిక చేసిన మార్కెట్లలో డెలివరీ ఫీజును తొలగించింది. బలంగా వేళ్లూనుకున్న మార్కెట్లలో కొత్తగా వచ్చే ప్లేయర్లకు సవాల్ విసిరేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. క్విక్ కామర్స్ విభాగంలో జెప్టో, స్విగ్గీ ఇప్పటికే కనీస కార్ట్‌వాల్యూతో పాటు, వివిధ రకాల ఫీజులను తొలగించాయి. హ్యాండ్లింగ్ ఫీజు, సర్‌ఛార్జ్ వంటి ఫీజులను జెప్టో గతేడాది తొలగించింది. కనీస ఆర్డర్ విలువను కూడా రూ.99గా నిర్ణయించింది. ఆ మొత్తం దాటితే ఫ్రీ డెలివరీ అందిస్తోంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సైతం ఇదేబాటలో పయనిస్తోంది. బ్లింకిట్ మాత్రం ఈ ఛార్జీల విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్, అమెజాన్ నౌ పేరిట.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలు ఈ రేసులోకి ఎంట్రీ ఇవ్వడంతో బ్లింకిట్ అప్రమత్తమైంది. వాటినుంచి పోటీ తట్టుకోవడానికి డెలివరీ ఫీజు తొలగించి ఖాతాదారులను నిలుపుకొనే ప్రయత్నాలను మొదలుపెట్టింది. సగటున రెండు డార్క్ స్టోర్ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకెళు తున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఫ్లిప్‌కార్ట్ కూడా దూకుడుగా ముందుకెళుతోంది.

# మరింత వేగంగా ఫిర్యాదుల పరిష్కారం: ఆర్‌బిఐ

**హైదరాబాద్ పెన్ పవర్:** బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియంత్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందుకోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను శు క్రవారం విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలు కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలు ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. విచారణలు క్లుప్తంగా ఉంటాయని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది. ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీప్ట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది. నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాలపై రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

# ఒంటిపై పుట్టు మచ్చలు పుట్టుకొస్తున్నాయా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒంటిపై కొత్త పుట్టుమచ్చలు అకస్మాత్తుగా కనిపించడం, పుట్టుమచ్చలు పెద్దగా పెరగడ వంటి లక్షణాలు కనిపిస్తే కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఇది ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంపై పుట్టుమచ్చలు సర్వసాధారణం. కొందరు వీటిని అందానికి చిహ్నంగా భావిస్తారు. మరికొందరికి ఇవి అసహ్యంగా మారుతాయి. ఒంటిపై కొత్త పుట్టుమచ్చలు అకస్మాత్తుగా కనిపించడం, పుట్టుమచ్చలు పెద్దగా పెరిగడ వంటి లక్షణాలు కనిపిస్తే కాస్త జాగ్రత్తగా ఉండాలి. ఇది ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది చిన్న పుట్టుమచ్చలతో ఏం సమస్య ఉంటుందిలే అని నిర్లక్ష్యం చేస్తుంటారు. మన చర్మంలో మెలనిన్ అనే వర్ణద్రవ్యం ఉండటం వల్ల మచ్చలు ఏర్పడతాయి. చర్మంపై మెలనోసైట్లు అనే కణాలు ఒకే చోట చేరి ఎక్కువ వర్ణద్రవ్యం ఉత్పత్తి చేసినప్పుడు అది ఒక చిన్న మచ్చగా కనిపిస్తుంది. ఇవి నలుపు, గోధుమ, లేత గులాబీ లేదా నీలం రంగులో ఉండవచ్చు. సగటు వ్యక్తి శరీరంపై 10 నుంచి 40 పుట్టుమచ్చలు ఉండటం సాధారణం. అంతకంటే ఎక్కువ ఉంటే మీరు దానిని విస్మరించకూడదు. మీ ఇంట్లో ఎవరి ఒంటిపై అయినా చాలా పుట్టుమచ్చలు ఉంటే అవి తరువాతి తరానికి సంక్రమించే అవకాశం ఉంది. యుక్తవయస్సు లేదా గర్భధారణ సమయంలో సంభవించే హార్మోన్లలో మార్పులు కొత్త మచ్చలు కనిపించడానికి కారణమవుతాయి.

సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు మెలనిన్ ఉత్పత్తిని వేగవంతం చేస్తాయి. అందుకే సూర్యరశ్మికి గురయ్యే శరీర భాగాలపై మచ్చలు ఎక్కువగా కనిపిస్తాయి. వయసు పెరిగే కొద్దీ చర్మంలో వచ్చే మార్పులు మచ్చలు పెరగడానికి దారితీస్తాయి. పుట్టు మచ్చలు ఎప్పుడు ప్రమాదకరంగా మారుతాయి? చాలా పుట్టుమచ్చలు ప్రమాదకరం కాదు. అయితే ఒక పుట్టుమచ్చ అకస్మాత్తుగా పరిమాణం పెరిగితే మీరు వైద్యుడిని సంప్రదించాలి. పుట్టుమచ్చలో రెండు లేదా మూడు రంగులు కనిపిస్తే, లేదా అది నల్లగా మారితే విస్మరించకూడదు. పుట్టుమచ్చ ఉన్న ప్రదేశంలో నిరంతర దురద లేదా నొప్పి ఉంటే. ఒక పుట్టుమచ్చ నుంచి ఎటువంటి గాయం లేకుండా రక్తస్రావం అవుతుంటే దానిని విస్మరించకూడదు. ఇటువంటి మార్పులు చర్మ క్యాన్సర్ ప్రారంభ సంకేతాలు కావచ్చు. కాబట్టి వాటిని విస్మరించడం మంచిది కాదు.

# జుట్టు రాలడం ఆగిపోవాలంటే..



ఎవరికైనా కొంచెం జుట్టు రాలితే వెంటనే షాంపూ, నూనె, సీరమ్‌లను మారుస్తారు. కానీ అసలు సమస్య మీరు రోజూ తీసుకునే ఆహారం నుంచే మొదలవుతుందని మీకు తెలుసా...? జుట్టు పల్చబడటం, మెరుపు కోల్పోవడం, రాలిపోవడం కాలుష్యం వల్ల మాత్రమే కాదు ప్రోటీన్ లోపం కూడా ఈ సమస్యకు కారణం కావచ్చు. జుట్టు రాలడం అందరిలో కనిపించే సాధారణ సమస్య. ఎవరికైనా కొంచెం జుట్టు రాలితే వెంటనే షాంపూ, నూనె, సీరమ్‌లను మారుస్తారు. కానీ అసలు సమస్య మీరు రోజూ తీసుకునే ఆహారం నుంచే మొదలవుతుందని మీకు తెలుసా?? జుట్టు పల్చబడటం, మెరుపు కోల్పోవడం, రాలిపోవడం కాలుష్యం వల్ల మాత్రమే కాదు ప్రోటీన్ లోపం కూడా ఈ సమస్యకు కారణం కావచ్చు. శరీరానికి తగినంత ప్రోటీన్ లభించకపోతే అది దాని ప్రాధాన్యతలను మార్చుకుంటుంది. గుండె, మెదడు వంటి ముఖ్యమైన అవయవాలకు ప్రోటీన్‌ను పంపుతుంది. జుట్టు పెరుగుదలను ఆపుతుంది. ఈ అంతర్గత పోషక లోపాన్ని సరిగ్గా గుర్తించి, ఆహారం ద్వారా జుట్టును మళ్ళీ బలోపేతం చేయడం వల్ల సమస్య నివారణ అవుతుంది. సాధారణ వ్యక్తి శరీర బరువు కిలోగ్రాముకు 0.8 నుంచి 1 గ్రాము ప్రోటీన్ తీసుకోవాలి. ఉదాహరణకు 60 కిలోల బరువున్న వ్యక్తి రోజుకు 50 నుంచి 60 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. అయితే అధిక కార్బోహైడ్రేట్ తీసుకోవడం చాలా మందిలో ప్రోటీన్ లోపానికి దారితీస్తుంది. ఇది మాత్రమే కాదు. మీ జీర్ణవ్యవస్థ కూడా ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే ఇది ప్రోటీన్ తీసుకోవడం గురించి మాత్రమే కాదు.. శరీరం దానిని ఎలా గ్రహిస్తుందో కూడా ముఖ్యం. మీకు గ్యాస్, ఆమ్లత్వం, జీర్ణ సమస్యలు ఉంటే మీరు తీసుకునే ప్రోటీన్ సరిగ్గా గ్రహించబడకపోవచ్చు. అందువల్ల జుట్టు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి జీర్ణవ్యవస్థను మెరుగుపరచడం కూడా ముఖ్యం.


# ఉల్లిపాయలు కొనేముందు ఈ విషయాలు తప్పక తెలుసుకోండి..



మార్కెట్ కి వెళ్లినప్పుడు ఉల్లిపాయలు చూడగానే అన్నీ బానే ఉన్నట్లు కనిపిస్తాయి. కానీ ఇంటికి తెచ్చాక అవి లోపల నల్లగా ఉండటమో లేదా కుళ్లిపోవడమో చూసి చికాకు వేస్తుంది. ముఖ్యంగా ధరలు పెరిగినప్పుడు ఇలా జరిగితే జేబుకు చిల్లు పడ్డట్టే.. మరి ఎక్కువ రోజులు మన్నే గట్టి ఉల్లిపాయలను ఎలా గుర్తించాలి..? వంటగదిలో ఉల్లిపాయ లేనిదే ఏ కూర పూర్తి కాదు. అయితే చాలా సార్లు మనం మార్కెట్ నుండి తెచ్చిన రెండు మూడు రోజులకే ఉల్లిపాయలు కుళ్లిపోవడం లేదా మొలకలు రావడం గమనిస్తుంటాం. దీనివల్ల వంటకు ఇబ్బంది కలగడమే కాకుండా ఆర్థికంగానూ నష్టం వాటిల్లుతుంది. ఉల్లిపాయలు ఎక్కువ కాలం తాజాగా ఉండాలంటే, వాటిని కొనేటప్పుడే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మంచి ఉల్లిపాయను గుర్తించడానికి మొదటి మార్గం దానిని తాకి చూడటం. ఉల్లిపాయను చేత్తో పట్టుకుని నొక్కినప్పుడు అది గట్టిగా ఉండాలి. ఒకవేళ అది మెత్తగా లేదా స్పంజ్ లాగా అనిపిస్తే, అది లోపలి నుండి కుళ్ళిపోవడం ప్రారంభించిందని అర్థం. ఉల్లిపాయ తొక్క కాగితంలా పల్చగా, పొడిగా ఉండాలి. ఒకవేళ తొక్క తేమగా ఉన్నా లేదా పైన తడి తగిలినా అది త్వరగా మొలక వచ్చే అవకాశం ఉంది. అలాగే తొక్క మెరుస్తూ, స్పష్టమైన రంగులో ఉండేలా చూసుకోవాలి. ఉల్లిపాయ పైన నల్లటి పొడిలాంటి మచ్చలు లేదా బూజు కనిపిస్తే వాటిని అస్సలు కొనకండి. ఇవి శిలీంధ్రాల వల్ల ఏర్పడతాయి. అటువంటి ఉల్లిపాయలను మిగిలిన వాటితో కలిపి ఉంచితే, మంచివి కూడా త్వరగా పాడైపోతాయి. తాజా ఉల్లిపాయలకు ఎటువంటి వింత వాసన ఉండదు. కానీ, ఒకవేళ ఉల్లిపాయ నుండి ఘాటైన లేదా ఒక రకమైన కుళ్ళిన వాసన వస్తుంటే, అది లోపలి నుండి పాడైందని గుర్తించాలి. ముఖ్యంగా ఉల్లిపాయ పైభాగం దగ్గర వాసన గమనించడం ముఖ్యం. ఉల్లిపాయలు కొన్న తర్వాత వాటిని ప్లాస్టిక్ కవర్లలోనే ఉంచడం పెద్ద పొరపాటు. ఉల్లిపాయలను ఎప్పుడూ గాలి తగిలే బుట్టల్లో లేదా పొడి ప్రదేశంలో ఉంచాలి. బంగాళదుంపలు, ఉల్లిపాయలు కలిపి ఉంచకూడదు. ఎందుకంటే బంగాళదుంపలు విడుదల చేసే వాయువుల వల్ల ఉల్లిపాయలు త్వరగా మొలకెత్తుతాయి.

# పాదాల పగుళ్లను నయం చేసే ఇంటి చిట్కాలు..

శీతాకాలం పొడి వాతావరణంలో మడమలు పగుళ్లు ఏర్పడటం సాధారణ సమస్య. మడమలు పగిలిపోతే, గోరువెచ్చని నీటిని ఉపయోగించడం, స్క్రబ్బింగ్ చేయడం, నూనెతో మసాజ్ చేయడం వంటి ఇంటి నివారణలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ సమస్యను విస్మరించడం వల్ల నొప్పి, ఇన్ఫెక్షన్ వస్తుంది. శీతాకాలం పొడి వాతావరణంలో మడమలు పగుళ్లు ఏర్పడటం సాధారణ సమస్య. ఈ సమస్యను విస్మరించడం వల్ల నొప్పి, ఇన్ఫెక్షన్ వస్తుంది. ఈ సమస్య ప్రధానంగా చర్మంలో తేమ లేకపోవడం వల్ల వస్తుంది. దీని కోసం రాత్రి పడుకునే ముందు ఒక టబ్‌లో గోరువెచ్చని నీటిని తీసుకుని దానికి కొంచెం సముద్రం ఉప్పు, నిమ్మరసం కలపాలి. ఆ తర్వాత మీ పాదాలను ఈ నీటిలో 15-20 నిమిషాలు నానబెట్టాలి. ఇది మృత కణాలను మృదువుగా చేసి తొలగించడం సులభం చేస్తుంది. ఇలా మీ పాదాలను నానబెట్టిన తర్వాత ప్యూమిస్ స్టోన్ లేదా ఫుట్ స్క్రబ్బర్‌తో మీ మడమల మీద ఉన్న మృత చర్మాన్ని సున్నితంగా రుద్దాలి. ఇది పగుళ్లను నయం చేయడానికి సహాయపడుతుంది. పాదాలను ఆరబెట్టిన తర్వాత కొబ్బరి నూనె, ఆముదం లేదా ఆలివ్ నూనెతో మసాజ్ చేయాలి. నిమ్మరసాన్ని వాసెలిన్‌లో కలిపి పగుళ్లపై పూయడం వల్ల అవి త్వరగా నయమవుతాయి. తేనెలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. అర బకెట్ గోరువెచ్చని నీటిలో ఒక కప్పు తేనె కలిపి అందులో మీ పాదాలను నానబెట్టడం వల్ల చర్మం మృదువుగా ఉంటుంది. అలాగే పండిన అరటిపండును చూర్ణం చేసి మీ మడమల మీద 15 నిమిషాలు అప్లై చేసి ఆపై మీ పాదాలను కడిగేసినా మంచి ఫలితం ఉంటుంది. ఈ చిట్కాలను అనుసరించిన తర్వాత మీ మడమలకు క్రీమ్ లేదా నూనె రాసుకోవాలి. కాటన్ సాక్స్ ధరించి నిద్రపోవాలి. ఇది తేమను నిలుపుకోవడంలో సహాయపడుతుంది. ఇలా చేయడం వల్ల మీ పాదాలు వేగంగా నయం అవుతాయి.




## అమ్మాయిలు రాత్రిపూట ఎందుకు జుట్టు దువ్వకూడదు?



ఇంట్లో పెద్దలు చెప్పే నీతి సూత్రాల వెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి. ఇలాంటి అతి ముఖ్యమైన నియమాలలో ఒకటి మహిళల జుట్టు సంరక్షణ. జుట్టు దువ్వడానికి సరైన సమయం అంటూ ఒకటి ఉందట. పురాతన కాలం నుంచి అమ్మమ్మలు, నానమ్మలు రాత్రిపూట జుట్టు దువ్వడం, జుట్టు జడ వేయకుండా వదులుగా వదిలేయకూడదని చెబుతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో జీవన విధానానికి సంబంధించి ఎన్నో విషయాలు ప్రస్తావించారు. ఏ సమయంలో ఏది చేయాలి? ఎలాంటి మార్గంలో జీవించాలి వంటి విషయాలు మన పూర్వికులు పేర్కొన్నారు. వీటినే ఆచారాలు, సంప్రదాయాలు అనే ముసుగులో నేటికీ పాటిస్తున్నారు. వీటి వెనుక ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయి మరి. ఇలాంటి అతి ముఖ్యమైన నియమాలలో ఒకటి మహిళల జుట్టు సంరక్షణ. జుట్టు దువ్వడానికి సరైన సమయం అంటూ ఒకటి ఉందట. పురాతన కాలం నుంచి అమ్మమ్మలు, నానమ్మలు రాత్రిపూట జుట్టు దువ్వడం, జుట్టు జడ వేయకుండా వదులుగా వదిలేయకూడదని చెబుతున్నారు. ఇలా చెప్పడం వెనుక ఉన్న ఖచ్చితమైన కారణాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం.. శాస్త్రాల ప్రకారం.. సూర్యాస్తమయం అంటే పగలు, రాత్రి కలిసే సమయం. ఈ సమయం తర్వాత వాతావరణంలో ప్రతికూల శక్తి, దుష్ట శక్తులు సక్రియం అవుతాయని నమ్ముతారు. రాత్రిపూట వదులుగా ఉన్న జుట్టు వదిలేసినా, చింపిరి జుట్టు ప్రతికూల శక్తులను తనవైపుకు ఆకర్షిస్తుందట. దీని కారణంగా మహిళలు మానసిక క్షోభ అనుభవించవచ్చు. సాయంత్రం వేళ లక్ష్మీదేవి వస్తుందని నమ్ముతారు. ఇలాంటి సమయాల్లో జడ వేయకుండా జుట్టు వదిలేయడం వల్ల మీ ఇంటిని మురికిగా భావించి, పేదరికానికి ఆహ్వానిస్తుందని నమ్మకం. దేవాలయాన్ని సందర్శించేటప్పుడు ఎల్లప్పుడూ జుట్టు జడ వేసుకునే వెళ్లాలి. ఎందుకంటే వదులుగా ఉన్న జుట్టు పరధ్యానానికి చిహ్నంగా పరిగణించబడుతుంది. జుట్టు స్త్రీ అందానికి ఆభరణం. కానీ దానిని వదులుగా ఉంచడం మంచిది కాదని శాస్త్రాలు చెబుతున్నాయి. పురాతన నమ్మకాల ప్రకారం దుఃఖ సమయాల్లో మాత్రమే జుట్టు వదులుగా ఉంటుంది. కాబట్టి సంతోషకరమైన జీవితం, ఇంటి శ్రేయస్సు కోసం మహిళలు జడ వేసుకోవాలి. చాలా మంది అమ్మాయిలకు రాత్రిపూట జుట్టు వదిలేసి నిద్రపోయే అలవాటు ఉంటుంది. కానీ వాస్తు శాస్త్రం ప్రకారం ఇది తప్పు. రాత్రిపూట జుట్టు వదులుగా ఉంచి నిద్రపోవడం కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పురోగతిపై చెడు ప్రభావం చూపుతుందని నమ్మకం. జుట్టు దువ్వేటప్పుడు ఊడిన జుట్టును పారవేసేటప్పుడు కూడా జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. ఊడిన జుట్టును వీధిలో లేదా జనాలు తిరిగే ప్రదేశంలో వేయకూడదు. కొంతమంది దానిని ప్రతికూల ప్రయోజనాల కోసం, మంత్రవిద్యల కోసం ఉపయోగించే అవకాశం ఉంది. కాబట్టి, ఊడిని జుట్టును సురక్షితమైన స్థలంలో మాత్రమే పారవేయాలి.

## టెన్షన్ పడితే ఇన్ని నష్టాలా?



టెన్షన్ పడితే ఏమవుతుందిలే అని తేలిగ్గా తీసుకుంటున్నారా? అయితే మీరు ప్రమాదంలో ఉన్నట్టే! నిరంతరం ఒత్తిడికి గురవ్వడం వల్ల మన శరీరంలో 'కార్టిసాల్' వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి సైలెంట్ పాయిజన్ లాగా పనిచేస్తూ గుండె, మెదడు మరియు జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి. కేవలం మానసిక సమస్యగానే కాకుండా, ఒత్తిడి వల్ల వచ్చే శారీరక మార్పులు ఏంటో తెలిస్తే మీరు వెంటనే జాగ్రత్త పడతారు. ఆర్థిక ఇబ్బందులు, ఆఫీసు పని, కుటుంబ బాధ్యతలు.. ఇలా కారణం ఏదైనా కావచ్చు, కానీ మీరు పడే టెన్షన్ మిమ్మల్ని అకాల వృద్ధాప్యానికి గురి చేస్తోంది. అతిగా ఆలోచించడం వల్ల జుట్టు రాలడం నుండి గుండె జబ్బుల వరకు ఎన్నో అనర్థాలు ఉన్నాయి. హార్మోన్ల అస్తవ్యస్తం: ఒత్తిడి పెరిగినప్పుడు కార్టిసాల్, అడ్రినలిన్ హార్మోన్లు విపరీతంగా విడుదలవుతాయి. దీనివల్ల రక్తపోటు (ఃఖ) పెరిగి గుండెపై ఒత్తిడి పడుతుంది. జీర్ణ సమస్యలు: టెన్షన్ వల్ల ఎసిడిటీ, మలబద్ధకం మరియు జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. కొందరిలో ఆకలి చచ్చిపోతే, మరికొందరు అతిగా తిని ఊబకాయం బారినపడతారు. రోగనిరోధక శక్తి పతనం: నిరంతర ఒత్తిడి వల్ల బాడీలోని ఇమ్యూనిటీ తగ్గుతుంది. ఫలితంగా తరచూ జలుబు, జ్వరం మరియు అంటువ్యాధులు సోకుతాయి. స్త్రీ, పురుషుల సమస్యలు: మహిళల్లో రుతుక్రమ సమస్యలు, పురుషుల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. ఇది సంతానలేమికి కూడా దారితీయవచ్చు. మెదడుపై ప్రభావం: జ్ఞాపకశక్తి తగ్గడం, ఏకాగ్రత లేకపోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం లేదా యోగా చేయాలి. ప్రతిరోజూ 7-8 గంటల గాఢ నిద్ర అవసరం. సానుకూల మనస్తత్వాన్ని అలవాటు చేసుకోవాలి. అవసరమైతే థెరపిస్ట్ సలహా తీసుకోవాలి.

## చలికాలంలో గోరు వెచ్చనీ నీళ్లు తాగే అలవాటు ఉందా?

శీతాకాలంలో చలి రోజురోజుకూ పెరిగేకొద్దీ చల్లటి నీరు తాగడానికి చాలా మంది ఇష్టపడరు. బదులుగా కాస్త వేడిగా ఉండే నీరు లేదా గోరువెచ్చని నీరు తాగడం ప్రారంభిస్తారు. ఇటువంటి వాతావరణంలో శరీర అవసరాలు భిన్నంగా ఉంటాయి. తాగే నీరు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ఆరోగ్య నిపుణులు కూడా శీతాకాలంలో చల్లటి నీరు తాగడం అంత మంచిది కాదని అంటున్నారు. ఈ కాలంలో గోరువెచ్చని నీరు తాగడం చాలా మంచిదట. గోరువెచ్చని నీరు శరీరాన్ని లోపల నుండి సమతుల్యతలో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియ నుంచి రోగనిరోధక శక్తి వరకు ఎన్నో రకాలుగా మంచిది. అంతే కాదు ఈ అలవాటు వల్ల ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఢిల్లీ ఓఅఆ కి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ ప్రకారం గోరువెచ్చని నీళు తాగడం వల్ల శరీర అంతర్గత ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇది జలుబు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా జీర్ణవ్యవస్థను చురుకుగా ఉంచడం ద్వారా గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందుతుంది. గోరువెచ్చని నీరు శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి సహాయపడుతుంది. మూత్రపిండాలు, కాలేయం మెరుగ్గా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. శీతాకాలంలో ఇది కీళ్లలో దృఢత్వాన్ని, కండరాల ఉద్రిక్తతను తగ్గిస్తుంది. అంతేకాకుండా ఇది గొంతు నొప్పిని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. తద్వారా కాలానుగుణ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. శీతాకాలంలో దాహం తక్కువగా ఉన్నప్పటికీ, శరీరానికి తగినంత నీరు అవసరం. సాధారణంగా ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీళ్లు తాగాలి. ఇది వయస్సు, బరువు, రోజువారీ కార్యకలాపాలపై ఆధారపడి ఉంటుంది. ఒకేసారి నీళ్లు తాగడానికి బదులుగా రోజంతా కొద్ది కొద్దిగా నీళ్లు తాగడం మంచిది. ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దీనితో పాటు ఎక్కువగా టీ, కాఫీ తాగకుండా ఉండాలి. ప్రతిరోజూ తేలికపాటి వ్యాయామం చేయడం, తగినంత నిద్ర పొందడం మర్చిపోవద్దు.

# నితీష్ రెడ్డి అసలు ఆల్ రౌండరే కాదు: తెలుగు క్రికెటర్‌పై మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిపై భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. నితీష్ కుమార్ రెడ్డి ఆల్ రౌండర్ కాదని.. అతను కేవలం బ్యాట్స్?మెన్ మాత్రమేనని అన్నాడు. బీసీసీఐ ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి అంత మంచిదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆల్ రౌండర్ పేరుతో నితీష్ జట్టులో టీమ్ సెటప్ సరిగ్గా లేక కెప్టెన్?కు కంపర్టబుల్?గా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశాడు. టీమ్?లో అతడు ఆరవ బౌలర్ కాదని.. నిజానికి అతనొక పార్ట్ టైమ్ బౌలర్ అని అభివర్ణించాడు. అసలు జట్టులో నితీష్ రెడ్డి పాత్ర ఏంటో నాకు అర్థం కావడం లేదని.. టీమిండియా కోచ్, మేనేజ్‌మెంట్ దయచేసి టీమ్?లో అతడి పాత్ర ఏంటో తనకు చెప్పాలని కోరాడు. రాజ్?కోట్ వేదికగా న్యూజిలాండ్?తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా ప్లేయింగ్ లెవన్ ఎంపికపైన కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. నెమ్మదిగా ఉన్న రాజ్‌కోట్ పిచ్?పై టీమిండియా నలుగురు పేసర్లతో ఆడిందని.. కానీ పర్యాటక న్యూజిలాండ్ జట్టు రాజ్ కోట్ పిచ్ పరిస్థితులను బాగా అర్థం చేసుకుందన్నారు. స్పిన్ వారి బలం కాకపోయిన న్యూజిలాండ్ ఈ మ్యాచులో ముగ్గురు స్పిన్నర్లతో ఆడిందని గుర్తు చేశారు. అసలు రెండో వన్డే కోసం ఎంపిక చేసిన జట్టు వ్యూహమేంటో తనకు అర్థం కాలేదన్నాడు. అసలు జట్టులో నితీష్ కుమార్ రెడ్డి పాత్ర ఏంటని ప్రశ్నించాడు. నితీష్ అస్సలు ఆల్ రౌండరే కాదని కైఫ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. కైఫ్ వ్యాఖ్యలపై నితీష్ అభిమానులు మండిపడుతున్నారు. కాగా, రాజ్ కోట్ వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమిండియా ఓటమి పాలైన విషయం తెలిసిందే. పర్యాటక న్యూజిలాండ్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఈ మ్యాచులో గెలిచి సిరీస్?ను 1-1 సమం చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డే జనవరి 17న మధ్యప్రదేశ్ లోని ఇండోర్ వేదికగా జరగనుంది.

# ఇండియా ఓపెన్‌లో ముగిసిన భారత పోరాటం.. క్వార్టర్ ఫైనల్స్‌లో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఓటమి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఇండియా పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మెన్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ 2117, 1321, 1821తో చైనీస్ తైపీకి చెందిన వరల్డ్ 13వ ర్యాంకర్ లిన్ చున్-యీ చేతిలో ఓడిపోయాడు. గంటా 8 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో లక్ష్య సేన్ తొలి గేమ్‌ను గెలిచి శుభారంభం చేశాడు. కానీ తర్వాతి రెండు గేమ్స్‌లో అనూహ్యంగా తడబడిన సేన్.. అనవసర తప్పిదాలు చేశాడు. గురువారం జరిగిన మెన్స్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి 25-27, 21-23, 19-21తో హీరోకి మిడోరికావా -- క్యోహీ యామాషితా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. అయితే, మూడో గేమ్‌లో ఇరు జంటలూ 15-15తో సమానంగా ఉన్నప్పుడు ఒక షాట్ ఆడే క్రమంలో సాత్విక్ నెట్‌ను తాకాడని చైర్ అంపైర్ 'ఫాల్ట్'గా ప్రకటించడం వివాదాస్పదమైంది.

**స్టేడియంలో కోతులు, పక్షులు..షట్లర్ల ఇక్కట్లు..**

ఈ టోర్నీలో కాలుష్యం, చలి వంటి వాతావరణ సమస్యలతో పాటు ఇందిరా గాంధీ ఇండోర్‌స్టేడియంలో పక్షుల రెట్టలు పడటం, కోతులు ప్రత్యక్షమవ్వడం వంటి వింత సంఘటనలు నిర్వాహకులకు పెద్ద తలనొప్పిగా మారాయి. గురువారం హెచ్ ఎస్ ప్రణయ్ మ్యాచ్ సందర్భంగా పక్షుల రెట్టలు కోర్టులో పడటం వల్ల ఆట నిలిచిపోవడంపై ఆటగాళ్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇక వాయు కాలుష్యం కారణంగా శ్వాస తీసుకోవడం కష్టమవుతోందని లో కీన్ యూ వంటి ఇంటర్నేషనల్ స్టార్లు ఫిర్యాదు చేశారు. ఈ విమర్శలపై స్పందించిన ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ స్టేడియం నిర్వహణలోని లోపాలను అంగీకరిస్తూనే, భవిష్యత్తులో జరగబోయే వరల్డ్ చాంపియన్‌షిప్ నాటికి ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి మెరుగైన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చింది.

# డబ్ల్యూపీఎల్: బలమైన ముంబై ఇండియన్స్ ను ఓడించిన యూపీ వారియర్స్



- ముంబై ఇండియన్స్‌పై యూపీ వారియర్స్ 22 పరుగుల తేడాతో గెలుపు
- హాఫ్ సెంచరీలతో చెలరేగిన యూపీ బ్యాటర్లు మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్
- 188 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో తడబడిన ముంబై
- అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ పోరాడినా ఫలితం శూన్యం
- యూపీ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో జట్టుకు విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2026 సీజన్‌లో యూపీ వారియర్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శనివారం నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 22 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్‌లో కెప్టెన్ మెగ్ లానింగ్ (70), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (61) హాఫ్ సెంచరీలతో చెలరేగగా, అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. ముంబై జట్టులో అమేలియా కెర్, అమన్‌జోత్ కౌర్ చివరి వరకు పోరాడినా ఫలితం లేకపోయింది.

188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్, 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఛేదనలో ముంబై టాప్ ఆర్డర్ విఫలమవడంతో 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అమేలియా కెర్ (28 బంతుల్లో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్ (24 బంతుల్లో 41) ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించి పోరాడారు. అయితే, వీరిద్దరి పోరాటం జట్టును గెలిపించడానికి సరిపోలేదు. యూపీ బౌలర్లలో శిఖా పాండే రెండు వికెట్లు తీయగా, మిగతా బౌలర్లు సమష్టిగా రాణించి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ కిరణ్ నవగిరె (0) డకౌట్ అయినా, కెప్టెన్ మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరూ ముంబై బౌలర్లపై ఆధిపత్యం చెలాయిస్తూ రెండో వికెట్‌కు 119 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. లానింగ్ 45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 70 పరుగులు చేయగా, లిచ్‌ఫీల్డ్ 37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 61 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో అమేలియా కెర్ మూడు వికెట్లు పడగొట్టింది.

# నాగ్ 100 కోట్లు కొట్టాలంటే..



తెలుగు సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు టాలీవుడ్ కింగ్ నాగార్జున. కెరీర్ స్టార్టింగ్ నుంచే ప్రయోగాత్మక సినిమాలు, విభిన్న పాత్రలతో తనకంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అయితే గత కొన్నేళ్లుగా ఆయన చేసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. నాగార్జున స్క్రీన్ ప్రెజెన్స్ ను పూర్తిగా యూజ్ చేసుకోకపోవడమే అందుకు ప్రధాన కారణమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే నాగార్జున ప్రస్తుతం తన కెరీర్ లో 100వ సినిమాను చేస్తున్నారు. కింగ్ 100 అనే వర్కింగ్ టైటిల్ తో





తెరకెక్కుతున్న ఆ చిత్రానికి తమిళ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఆ మూవీ.. యాక్షన్ ప్రధానంగా సాగుతుందని తెలుస్తోంది. సినిమాలో నాగార్జున లుక్, క్యారెక్టర్ పూర్తిగా కొత్తగా ఉంటుందని సమాచారం. కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో ప్రాజెక్ట్ పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.అదే సమయంలో నాగ్ కు రూ.100 కోట్ల హిట్ ఎప్పుడు సొంతమవుతుందోనని అంతా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కెరీర్ లో ఎన్నో సినిమాల్లో నటించినా.. ఆ మార్క్ అందుకోకపోవడం గమనార్హం. ఆయనతో పాటు సీనియర్ హీరోలు అయిన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ మాత్రం ఇప్పటికే పలు రూ.100 కోట్ల సినిమాలను తమ ఖాతాలో వేసుకున్నారు. దీంతో నాగార్జున అభిమానుల్లో ఈ అంశం మరింత ఆసక్తిగా మారింది.అయితే ఇప్పుడు నాగార్జునకు రూ.100 కోట్ల హిట్ రావాలంటే అనిల్ రావిపూడితో సినిమా చేయాలని అనేక మంది సినీ ప్రియులు, నెటిజన్లు, కొందరు అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటివరకు అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచాయి. ముఖ్యంగా చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి సీనియర్ హీరోలతో ఆయన చేసిన సినిమాలు పండగల సీజన్ లో భారీ వసూళ్లను సాధించాయి.ఇప్పటివరకు అనిల్ రావిపూడితో పని చేయని సీనియర్ హీరోల్లో నాగార్జున ఒకరే మిగిలారు. అందుకే ఆ కాంబినేషన్ వస్తే నాగ్ కెరీర్ కు ఇది సరైన టర్నింగ్ పాయింట్ అవుతుందని సినీ వర్గాలు అంటున్నాయి. ఫుల్ ఎంటర్టైనర్ అయినా, కొత్తదనం ఉన్న కథ అయినా అనిల్ రావిపూడి హ్యాండిల్ చేయగలరనే నమ్మకం ఇండస్ట్రీలో ఉంది. అంతేకాదు సీరియస్ టోన్ ను కూడా సక్సెస్ ఫుల్ గా చూపించగలరు. ఇప్పటికే భగవంత్ కేసరి మూవీతో అది నిరూపించారు.అదే సమయంలో అనిల్ సినిమాలు తక్కువ బడ్జెట్ లో వేగంగా పూర్తవుతాయి. దీంతో నాగార్జున నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఏదేమైనా.. నాగార్జున, అనిల్ కాంబినేషన్ లో సినిమా వస్తే, అది నాగ్ కు ఫస్ట్ రూ.100 కోట్ల హిట్ గా నిలిచే అవకాశం ఉందని ఆయన అభిమానులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మరేం జరుగుతుందో.. ఆ కాంబోలో ఎప్పుడు మూవీ వస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965